సాహితీ గత వారం పుస్తకాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
6-6-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 125 పేజీలు: 14 వెల: 6.50

అమరావతిలో భూములు, ఆస్తులకు ప్రత్యేక నంబర్లు 2లో

19 దేశాల పౌరులపై అమెరికా కఠిన ఆంక్షలు 5లో

# 175 చోట్ల నగర వనాలు


గురువారం పర్యావరణ పరిరక్షణపై ప్రమాణం చేస్తున్న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్, మంత్రులు

## చెట్లు పెంచనివారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది?
## ఒకే రోజున రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు
## అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్‌తో కలిసి మొక్కలు నాటిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వచ్చే నాలుగేళ్లలో ఐదు కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిదని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. రాజధాని అమరావతి పరిధిలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంనిర్వహించారు. అనంతవరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేష్‌లు ప్రమాణం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాఠశాల విద్యార్థిని ప్రమాణం చేయించింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. మొన్నటివరకు వనజీవి రామయ్యను చూశామని.. ఆయన లేకపోయినా ఇప్పుడు నల్లమల పరిరక్షణ కోసం అంకారావు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోందని.. దీని పర్యావసానంగా ఇతర ప్రాంతాల్లో కూడా గ్రీన్ కవర్ పెరుగుతోందన్నారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వానికి చెట్ల వల్ల ఉపయోగం తెలియదని.. వారికి చెట్లు నరకడం తప్ప చెట్లు పెట్టడం తెలియదని విమర్శించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో వెళితే కింద రోడ్డుపై చెట్లు నరికేవారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వస్తుంటే ఎక్కడైనా ఒక్క చెట్టు తాము నరుకుతున్నామా అని ప్రశ్నించారు. కొన్ని దేశాల్లో చెట్లు నరికితే శాశ్వతంగా జైల్లో పెడతారన్నారు. చెట్లు నరికితే మనిషిని చంపినట్టే అని కొన్ని దేశాల్లో చట్టాలుకూడా ఉన్నాయన్నారు. నాలుగు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 37 శాతం గ్రీన్ కవర్ రావాల్సి >>2


గురువారం ఎన్‌కౌంటర్‌లో హతమైన సుధాకర్ (ఫైల్)

# మావోయిస్టు అగ్రనేత సుధాకర్ ఎన్‌కౌంటర్‌లో హతం

## ఒక్కొక్కరుగా రాలుతున్న కేంద్ర కమిటీ సభ్యులు
## సుధాకర్ మృతిని ధ్రువీకరించిన బస్తర్ ఐజి సుందర్ రాజ్

**చర్ల , జూన్ 5 (ప్రభాతవార్త):** ఆపరేషన్ కగార్‌ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉధృతం చేసాయి.2026 మార్చి 31 మావోయిస్టుల అంతమే లక్ష్యంగా చేసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అడుజాడల్లో భద్రతా బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి.ఈ క్రమంలో వరుస ఎన్ కౌంటర్లు జరుగుతున్నాయి. తాజాగా నేషనల్ పార్క్ ఏరియాలో గురువారం జరిగిన ఎన్ కౌంటర్‌లో మావోయిస్టు కేంద్రకమిటి సభ్యుడు టెంట్ లక్ష్మీ ౖ నర సింహాచలం ఆలియాస్ సుధాకర్ (65) మృతిచెందారు. ఇతనిపై కోటి రూపాయల రివార్డు ఉన్నట్లు సమాచారం. ఇతని స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రొగడవరం గ్రామం. తండ్రి రామకృష్ణ నాయుడు. సుమారు మాడు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానంలో అనేక హోదాల్లో పనిచేసి కేంద్రకమిటీ సభ్యుడయ్యాడు. ప్రస్తుతం ఉన్న >>2

# నెల్లూరు జిల్లాలో ఘోర ప్రమాదం

## ఇద్దరు మృతి, 9 మందికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

**ఆత్మకూరు (నెల్లూరు), జూన్ 5, ప్రభాతవార్త :** ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఒక కారు-ఆటో ఢీకొన్న సంఘటనలో ఆటోలోని ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా మరో 7మందికి తీవ్రగాయాలైనాయి. కారులోఉన్న ఇద్దరికికూడా గాయాలైనాయి. మొత్తంగా 9మంది గాయ పడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఆత్మకూరు పోలీసులు, వెంకట్రావుపల్లి గ్రామస్తుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మున్సిపల్‌పరిధిలోని 2వవార్డు అయిన వెంకట్రావుపల్లికి చెందిన >>2


కర్ణాటక హైకోర్టు


పోలీస్ కమిషనర్ దయానంద్

# తొక్కిసలాట ఘటనపై సిఐడి విచారణ

## బెంగళూరు పోలీసు కమిషనర్, డిసిపి సస్పెన్షన్
## సుమోటోగా కేసు విచారణకు స్వీకరించిన కర్ణాటక హైకోర్టు
## కెసిఎ సభ్యులు, ఆర్సీబీ ఈవెంట్ మేనేజర్లపైనా కేసులు
## మృతుల కుటుంబాలకు ఆర్సీబీ రూ. 10 లక్షలు పరిహారం

**బెంగళూరు, జూన్ 5:** ఐపిఎల్‌ఛాంపియన్ టీమ్ ఆర్సీబీ విక్టరీ పెరేడ్‌లో నెలకొన్న విషాదంపై సమగ్ర విచారణకోసం కర్ణాటక ప్రభుత్వం సిఐడి విచారణకు ఆదేశించింది. నగరంలోని చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటకు సంబంధించి మరోవైపు హైకోర్టు సువోమోటోగా కేసును స్వీకరించింది. అంతేకాకుండా సంఘటనకు బాధ్యులుగా బెంగళూరు నగర కమిషనర్ దయానంద్‌ను సస్పెండ్‌చేస్తూ సిద్ధరామయ్య ఆదేశాలు జారీచేసారు. అలాగే అదనపు కమిషనర్, ఆప్రాంత డిప్యూటికమిషనర్లను స్పెండ్‌చేస్తున్నట్లు ముఖ్యమంత్రిప్రకటించారు.భారీ సంఖ్యలో >>2

# బీచ్ ఫెస్టివల్ ఆరంభం


గురువారం బీచ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు దుర్గేష్, రవీంద్ర తదితరులు

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించిన మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర
## నాలుగు రోజులు జరుగనున్న వేడుకలు

**విజయవాడ జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మసులా బీచ్ ఫెస్టివల్-2025 ఘనంగా ప్రారంభమైంది. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మైన్స్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రలు బీచ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. తొలుత బీచ్ ముఖ ద్వారంవద్ద ఏర్పాటు చేసిన గేట్ వే ఆఫ్ అమరావతి ఐకానిక్‌టవర్‌ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం 100 అడుగుల ఎత్తులో ఏర్పాటుచేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. బీచ్ ఫెస్టివల్‌కు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ బీచ్ ఫెస్టివల్‌ను 4 రోజులపాటు నిర్వహించనున్నారు.

**బీచ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం:**
మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఇక్కడికి వచ్చిన తరువాత చూస్తే చాలా సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను 100 అడుగుల మేర ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. అఖండ గోదావరి కార్యక్రమం చేస్తున్నామని రూ.97 కోట్లతో సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్రంలో 5 పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాజెక్టులు ఇస్తామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి హామీ ఇచ్చారని వెల్లడించారు. ఆ 5 ప్రాజెక్టుల్లో మచిలీపట్నం బీచ్‌ను పొందుపరుస్తామన్నారు. మంగినపూడి బీచ్ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.
బీస్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ,కాగిత కృష్ణ ప్రసాద్, డిసి ఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులు పాల్గొన్నారు. తొలుత బీచ్ ముఖ్య ద్వారం వద్ద ఏర్పాటు చేసిన గేట్‌వే ఆఫ్ అమరావతి ఐకానిక్‌టవర్‌ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం 100 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
నాలుగు రోజుపాటు నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌కు అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో ఇంత పెద్ద బీచ్ ఫెస్ట్ నిర్వహించడం గర్వంగా ఉందని మంత్రి కొల్లు >>2



# పోలీస్ కస్టడీలో మాజీ మంత్రి కాకాణి

**నెల్లూరు రూరల్, జూన్ 5, ప్రభాతవార్త:** అక్రమ మైనింగ్‌కేసు ఆరోపణలతో అరెస్టు అయిన మాజీ మంత్రి వైఎస్ఆర్సీ జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అరెస్ట్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం అందరికీ తెలిసిందే అయితే గురువారం కోర్టులో విచారణ జరిపిన నెల్లూరు అదనపు 5వ మెజిస్ట్రేట్ కోర్టులో కాకాని గోవర్ధన్ రెడ్డి బిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. బెయిల్ పిటిషన్ వాయిదావేస్తూ పోలీస్ కస్టడీలోకి మాజీమంత్రి కాకానిని అప్పగిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. 6వ తేదీఉదయం 10:30 నుండి 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కస్టడీలోకి తీసుకొని కాకానితరపు న్యాయవాదుల సమక్షంలో విచారణ జరపాలని జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు విచారించేందుకు ప్రభుత్వం తరపు గుంటూరు జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రాజేంద్రప్రసాద్ కోర్టులో వాదనలు వినిపించారు.

# కదులుతున్న 'కల్తీనెయ్యి' డొంక

## సిట్ దర్యాప్తులో మరిన్ని సాక్ష్యాధారాలు లభ్యం
## టిటిడి ఉద్యోగుల సమాచారం ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు



**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన పాపంలో సిబిఐ సిట్ అధికారులు మరింత కీలకసమాచారం సేకరించడంతో సూత్రధారులను పట్టుకునే దిశగా చర్యలు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఈ కల్తీనెయ్యి బాగోతంలో ఉత్తరాఖండ్ బోలేబాబా డెయిరీకిచెందిన షోమిల్‌జైన్‌కు అనుచరుడుగా ఉన్న కోల్‌కతాలో నూనెల పరిశ్రమ నడుపుకుంటున్న పారిశ్రామికవేత్త జ్యోతిష్యను సిట్ విచారణ చేస్తోంది. అయితే అవసరం మేరకు కొన్ని రకాల నూనెలు సరఫరా చేసినట్లు వివరాలు రాబట్టినా దీనికి సంబంధించి ఎక్కడా నగదు లావాదేవీలు జరగలేదనేది సిట్ రాబట్టిన సమాచారం. రెండు రోజులుగా తిరుపతి అలిపిరిలోని తాత్కాలిక్ సిట్ కార్యాలయంలో మాజీఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి వ్యక్తిగత సహాయకుడు (పిఎ)అప్పన్న నుండి కొంత సమాచారం సేకరించిన సిట్ అధికారులు తదుపరి ముగ్గురు ప్రముఖులను విచారణకు తాఖీదులు పంపనున్నారు.
ఇదే జరిగితే కల్తీనెయ్యిలో అసలు సూత్రధారులు బాగోతం వెలుగుచూడనుందనేది టిటిడిలో సంచలనంగా మారింది. గతంలోనే బోలేబాబా డైరీ, ఏఆర్‌డైరీ, వైష్ణవిడైరీలకు సంబంధించి 15మంది వరకు ముఖ్యులైన మేనేజర్ల నుండి అధికారులు, ల్యాబ్ సిబ్బంది, ట్యాంకర్ల డ్రైవర్‌లు, అధికారులు, సిబ్బందిని సిట్ అరెస్టుచేసింది. టిటిడికి గత మూడునాలుగేళ్లలో నెయ్యిసరఫరాకు సంబంధించి అనుమతిలిచ్చిన అసలు సూత్రధారులు ఎవరనేది ఇప్పుడు బయటకు రానుంది.
ఇప్పటికే కల్తీనెయ్యిలో నిందితులు ఏఆర్ డైరీ ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరాదారులు ఉత్తర ప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, షోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఒ అపూర్వ వినయ్ కాంత్ టచావ్దాలను కస్టడీకి తీసుకుని కీలకమైన ఆధారాలు రాబట్టింది. ఈ డైరీలకు కాంట్రాక్టు ఎలాకేటాయించారు, నెయ్యిసరఫరాలో ఏదేని మతలబు చేశారనేది ఈకల్తీపాపంలో కీలక సూత్ర ధారులను తేల్చేపనిలో సిబిఐ సిట్ >>2

# నేటి నుంచి మెగా డిఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు

## కేంద్రాలను గుర్తించేలా ఫ్లెక్సీల ఏర్పాటు

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** మెగా డిఎస్సీ ఆన్‌లైన్ పరీక్షకు నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని డిఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణా రెడ్డి ప్రకటించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు 90 నిముషాలు ముందుగానే చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను గుర్తించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నామని, ఎండల తీవ్రత దృష్ట్యా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరుగకుండా పోలీసు భద్రత ఉంటుందని వెల్లడించారు.
ఈ నెల 6నుంచి 154 కేంద్రాల్లో ప్రారంభం కానున్న మెగాడిఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ అన్నిఏర్పాట్లూ పూర్తి చేసింది. రోజుకు రెండు విడతలుగా ఈ నెల 30 వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఆగస్టు రెండో వారం నాటికి ఉపాధ్యాయుల ఎంపిక పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది హాల్ టిక్కెట్లలో ఏమైనా తప్పులుంటే వాటికి సంబంధించిన గుర్తింపు కార్డులను పరీక్షా కేంద్రాల వద్ద సమర్పిస్తేనే వాటిని సరి చేస్తారు. తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేది, కులం తదితర వివరాలు తప్పుగా నమోదైతే దీనికి సంబంధించిన ఆధారాలను చూపిస్తే నామినల్ రోల్స్‌లో సరి చేస్తారు.
హాల్ టికెట్‌లో ఫొటో లేకపోతే అభ్యర్థులు ఒకరు చొప్పున సాంకేతిక సహాయకులు ఉంటారు. పరీక్షా సమయంలో కంప్యూటర్‌లో ఏమైనా ఇబ్బందులు వస్తే వారు సరి చేస్తారు. రెండు చేతులూ లేని దివ్యాంగులు,దృష్టిలోపం ఉన్న వారికి పరీక్ష రాసేందుకు సహాయకులను ఏర్పాటుచేస్తారు. పదో తరగతి విద్యార్థులను సహాయకులుగా ఏర్పాటు చేస్తారు. స్రైబ్ కోసం ధరఖాస్తు >>2


డ్రగ్స్ కేసు వివరాలు మీడియాకు వివరిస్తున్న డిసిపి సరిత

# బెజవాడలో డ్రగ్స్ కలకలం

## 33 గ్రాముల ఎంఇటిహెచ్ డ్రగ్ స్వాధీనం

**విజయవాడ క్రైం,జూన్ 5,ప్రభాతవార్త:** బెజవాడలో డ్రగ్స్ పట్టుకోవడం కలకలం సృష్టించింది. సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డిసిపి కెజివి సరిత నేతృత్వంలో సెంట్రల్ ఎసిపి దామోదార్ పర్యవేక్షణలో పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామవరప్పాడు వద్ద వాహనాల తనిఖీలలో భాగంగా పటమట పోలీస్‌స్టేషన్ సిఐ పవన్ కిషోర్,ఎస్ఐ దుర్గాదేవి వారి సిబ్బందితో కలిసి వాహానాలను తనిఖీ చేసారు. ఈ నేపథ్యంలో రామవరప్పాడు ఫ్లై ఓవర్ వైపు నుండి విజయవాడ వైపుకు వెళ్తున్న ఎరుపు రంగు ఓలా,నీలం రంగు చేతక్ బైక్ లను ఆపి తనిఖీ చేసారు. సదరు వాహానాలపై సుమారు 20 నుండి 30 సంవత్సరాల వయస్సు కల్గిన ముగ్గురు వ్యక్తులను పట్టుకుని విచారించగా,సదరు బైక్‌ల డిక్కీలలో డ్రగ్స్ పట్టుబడటం సంచలనం కలిగించింది. ఆ బైక్‌ల డిక్కీలలో వైట్ కలర్ క్రిస్టల్ ఎంఇటిహెచ్ డ్రగ్స్ పాకెట్లు-2,పర్పుల్ కలర్ క్రిస్టల్ ఎంఇటిహెచ్ డ్రగ్స్ పాకెట్-1,రెడ్ కలర్ క్రిస్టల్ ఎంఇటిహెచ్ డ్రగ్స్ పాకెట్-1లలో మొత్తం సుమారు 33 గ్రాముల ఎంఇటిహెచ్ డ్రగ్స్,7 సెల్‌ఫోన్లను సాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. విచారణలో సదరు నిందితులు ఆ డ్రగ్స్‌ను నూజివీడుకు చెందిన మనోహార్ అనే వ్యక్తి ద్వారా ఢిల్లీకి చెందిన రింకు నుండి ట్రాక్ ఆన్, డిటిడిసి కొరియర్ల ద్వారా దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది.ఈ కేసులో నిందితులైన పెనమలూరు మండలం, సనత్‌నగర్, రామాలయం స్ట్రీట్‌కు చెందిన తిరుమలశెట్టి జీవన్‌కుమార్ అలియాస్ కిన్ను,ఫన్‌టైమ్స్ రోడ్,టీచర్స్ కాలనీ బొంతు నితీశ్ కుమార్ అలియాస్ బబ్బు, యనమల కుదురుకు చెందిన తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్‌లను అరెస్ట్ చేశారు.ఈ కేసులో మరి కొంత మందిని అరెస్ట్ చేయాల్సి ఉంది.



గురువారం అనంతవరం గ్రామంలో మొక్కను నాటిన సిఎం చంద్రబాబు

# 175 చోట్ల నగర వనాలు

>> ఉందన్నారు. జీవితంలో 10 చెట్లు కంటే ఎక్కువ పెట్టి పెంచుతున్నవారు ఉన్నారని.. అసలు చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది అని సీఎం చంద్రబాబు నిలదీశారు. రాఖీలు కట్టే చెల్లెమ్మలకు ఇకపై అన్న నక్షత్రం పేరుకు తగ్గట్టుగా విత్తనాలు ఇస్తామన్నారు. ఈ ఏడాదిలోనే ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చూడతామని తెలిపారు. నక్షత్రం చూసుకుని అన్నకు రాఖీ కడితే చెట్ల పెంపకానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఇంట్లో రూఫ్ టాప్ గార్డెన్ లేదా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నల్లమల అడవుల్లో విలువైన మూలికలుఉన్నాయన్నారు. ఎర్రచందనంతో పాటు నల్లమల అడవులలో ఉన్న వనమూలికలనూ కాపాడుకోవాలని చెప్పుకొచ్చారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని.. వచ్చే మూడేళ్లలో వెస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు వస్తున్నాయన్నారు.175 నియోజక వర్గాల్లో నగర వనాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

ప్రకృతి అంటే ఏ ఒక్కరి సొత్తూ కాదు.. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉంది. అడవులను కాపాడుకోవడం, జలవనరులను సంరక్షించుకోవడం మన కర్తవ్యం. అందుకే ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నేడు ఒక్కరోజే 1 కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతున్నా. మంచి పరిసరాలు ఉంటేనే మంచి ఆరోగ్యం ఉంటుంది. అందుకే స్వచ్ఛ భారత్‌లో భాగంగా మనం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాం. చెత్తను ఇంధనంగా మారుస్తూ ప్రకృతిని కాపాడుతున్నాం. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ప్లాస్టిక్ పొల్యూషన్ నిర్మూలన అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి మన వంతు బాధ్యతగా పనిచేద్దాం. పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకుందాం. మొక్కలు నాటిన తరువాత పర్యావరణ పరిరక్షణపై కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు.

ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కి తీసుకుంటున్న చర్యలను కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య సీఎంకు వివరించారు. రీసైక్లింగ్ అంశంలో శాఖల మధ్య సమన్వయం అవసరమని చంద్రబాబు సూచించారు. రీసైక్లింగ్‌పై ప్రత్యేక పాలసీ తీసుకురావాలని సిఎం ఆదేశించారు. నల్లమల అడవుల్లో విలువైన మూలికలు ఉన్నాయని, ఎర్రచందనంతో పాటు నల్లమల అడవులలో ఉన్న వనమూలికలనూ కాపాడుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**భవిష్యత్తు తరాలకు స్వచ్ఛంధంగా అందించే ఆస్తులు మొక్కలే: డి.సిఎం పవన్**

భవిష్యత్తు తరాలకు మనం స్వచ్ఛంధంగా అందించే ఆస్తులు మొక్కలేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.కోటి మొక్కలు నాటి.. వాటిని సంరక్షించడమే తమ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అడవిలో కార్చిచుల నివారణకు, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తానని అన్నారు. మానవ జీవితంలో ప్రకృతికి ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. ఒకప్పుడు ఇంటి చిరునామాకు మొక్కలు, చెట్లు ఆనవాళ్లుగా ఉన్నాయని వెల్లడించారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు కానీ, ప్రకృతిని ప్రేమించే వ్యక్తి మనకు సీఎంగా ఉన్నారని ఉద్ఘాటించారు పవన్ కల్యాణ్.

నల్లమడల అడవుల్లో పర్యావరణ సమతుల్యతకు కృషి చేస్తున్న కొండలరావును ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం ప్రశంసనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో కృషి చేద్దామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. చెట్లులేని జీవితాన్ని ఊహించలేమని, ఒకప్పుడు ఇంటి చిరునామాకు చెట్లే ఆనవాళ్లుగా ఉండేవని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు కానీ, ప్రకృతిని ప్రేమించే వ్యక్తి మనకు సిఎంగా ఉన్నారని చెప్పారు. అడవిలో కార్చిచుల నివారణకు కృషి చేస్తానన్నారు. 50 శాతం పచ్చదనం లక్ష్యం కోసం చిత్తశుద్ధితో కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ తలమానికంగా ఉండాలని ఆకాక్షించారు.. ఇక, అందరికి మనస్ఫూర్తిగా పర్యావరణ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.

# ఆన్‌లైన్ పరీక్షలు

>> చేసుకున్న వారు 1300 మంది వరకూ ఉన్నారు. ఒకవేళ ధరఖాస్తులో స్క్రైబ్ కావాలని పేర్కొనకపోయినా అవసరమైతే డిఇఒ పరిశీలించి, ఏర్పాటు చేస్తారు. వీరికి అదనంగా 50 నిముషాలు సమయముంటుంది.రాష్ట్ర వ్యాప్తంగా 3,35,401 మంది అభ్యర్ధులు అన్ని పోస్టులకు కలిపి 5,77,417 ధరఖాస్తులు సమర్పించారు. ఇప్పటి వరకు 3.04 లక్షల మంది హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోని వారి ఫోన్లకు సంక్షిప్త సందేశాలు పంపిస్తున్నారు. పోస్టులకు సంబంధించిన మొత్తం పరీక్షలు పూర్తయిన తర్వాత మరుసటి రోజు ప్రాథమిక 'కీ' విడుదల చేస్తారు. ఆ తర్వాత అభ్యంతరాల స్వీకరణకు వారం రోజులు గడువు ఇస్తారు. ధరఖాస్తుల సమయంలోనే పోస్టులకు ప్రాధాన్యత తీసుకున్నందున అభ్యర్ధులకు వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.

# 'కల్తీనెయ్యి' డొంక

>> అధికారులు వ్యూహాత్మకంగా ముందుకు కదులుతున్నారు. గత ఏడాది జూన్‌లోనే లడ్డూలకు కల్తీనెయ్యి వాడారనేది గుజరాత్‌లోని ఎన్‌డిడిబి ల్యాబరేటరీ(పరిశోధనశాల)నుండి ఆధారాలు బయటకు వచ్చాయి.ఆ ఫలితాల్లో నెయ్యికల్తీ అయిన మాట వాస్తవమేనని,అయితే కొన్ని రకాల ఆహారపదార్ధాల నూనెలు కలిపారనేది టిటిడి అధికారులు కూడా నివేదికలు వెల్లడించారు.గత ఏడాదిలోనే మూడుసార్లు కల్తీనెయ్యి సరఫరా జరిగిందని గుర్తించిన టిటిడి ఉన్నతాధికారులు తిరుమలలో నెయ్యి తీసుకోకుండా ఆ ట్యాంకర్లను వెనక్కుపంపిన విషయం విదితమే. ఆ ట్యాంకర్లలో నెయ్యి కల్తీ జరిగిందనేది ముందుగానే తేల్చేసిన టిటిడి అధికారులు ఏఆర్ డైరీ నెయ్యిట్యాంకర్లను తిప్పిపంపారు. మరీ జులైలో కల్తీనెయ్యి వ్యవహారం వెలుగుచూస్తే గత సెప్టెంబర్ వరకు ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదనేది ఇప్పుడు సిట్ ప్రధానంగా దృష్టి సారించింది. దీనివెనుక ఎవరి ప్రమేయం ఉంది. ఎందుకు మూడేళ్ళు మౌనంగా కల్తీనెయ్యినే లడ్డూలకు వినియోగించారనేది ఇప్పుడు సిట్ కీలక దర్యాప్తులో వెలుగుచూడనుంది.



కర్గిజ్ రిపబ్లిక్ విదేశాంగ మంత్రి జీన్‌బెక్ కులుబెయెవ్ గురువారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన దృశ్యం

# అమరావతిలో ప్రతిష్టాత్మక న్యాయ వర్సిటీ

## బిసిఐ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుకు అడుగులు

## ఆర్డినెన్స్ జారీ చేసిన ప్రభుత్వం

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో ప్రతిష్టాత్మక న్యాయ యూనివర్సిటీ ఏర్పాటు విషయంలో అడుగులు వేగంగా పడుతున్నాయి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ)కు చెందిన బిసిఐ ట్రస్ట్ ఫ్లై ఫస్ట్ అధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు బిసిఐ ట్రస్ట్ ముందుకొచ్చిన విషయం విదితమే. బిసిఐ అధ్యక్షుడు,కీలక సభ్యులు ఇప్పటికే గవర్నర్ అబ్దుల్ నజీర్,ముఖ్యమంత్రి చంద్రబాబుతో వేర్వేరుగా సమావేశమయ్యారు. అమరావతిలో బిసిఐ నెలకొల్పబోయే న్యాయ యూనివర్సిటీలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఆర్బిట్రేషన్ సెంటర్ సైతం ఏర్పాటు కానుంది. అంతేకాక న్యాయ,అనుబంధ రంగాల్లో ఉన్నత విద్యావకాశాల కల్పనకు నైపుణ్యాభివృద్ధికి ఈ యూనివర్సిటీ ఎంతో ఉపయోగపడుతుంది.బీసిఐ ట్రస్ట్ అధ్వర్యంలో బెంగుళూరులో 1986లో నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్‌యూ), 2022లో గోవాలో ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐయూఎల్ఇఆర్) ఏర్పాటు అయ్యాయి. అవి ఎంతో ప్రతిష్టాత్మక సంస్థలుగా ఖ్యాతి గడించాయి.

# విద్యార్ధి దశలోనే యోగా శిక్షణ తప్పని సరి చేసేలా చట్టం

## రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు

**విజయవాడ, జూన్ 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్రకు నాంధి పలికేలా యోగా ప్రతి ఒక్కరి జీవన విధానం అయ్యేలా విద్యార్ధి దశలోనే యోగా శిక్షణను తప్పని సరి చేసేలా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఎంతో ఉందని రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకూ యోగాను పాఠ్యాంశంగా చేసే అంశంపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామని ఆయన తెలిపారు. యోగాంధ్రా2025 కార్యక్రమంలో భాగంగా గురువారం అమరావతిలోని రాష్ట్ర శాసన సభ ప్రాంగణంలో శాసన సభ ఉద్యోగులకు యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మానవాళి యావత్తూ ఆరోగ్యంగా సుఖ శాంతులతో జీవనం సాగించాలనే సత్సంకల్పంతో భారతీయ ఋషులు ప్రపంచానికి అందజేసిన సనాతన కార్యక్రమం యోగా అన్నారు. అయితే నేటి ఆధునిక సమాజంలో మానవుడు యాంత్రిక జీవన విదానాన్ని అనుసరించడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించే యోగా కార్యక్రమం కనుమరుగు అయిపోతున్నదన్నారు.

ఈ యోగా ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ నెల 21 న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొంటున్నారన్నారు. విశాఖపట్నం వేదికగా ఆర్.కె.బీచ్ నుండి భీమిలి వరకూ మరియు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఈ వేడుకల్లోనిర్వహించడం జరుగుచున్నదని, ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరుగుచున్నదన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శ్రీకారంచుట్టారని, ఈకార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతూ కాలుష్య నియంత్రణకు కృషి చేయాలని, యోగాను అభ్యసిస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి కె. రఘు రామకృష్ణ రాజు మాట్లాడుతూ పూర్వీకులు మనకు అందజేసిన యెగాభ్యాసాలు కాల క్రమీణ కనుమరుగు అయ్యే పరిస్థితులు ఏర్పాటు తున్నాయని, అటు వంటి ఉత్తమ ప్రక్రియలను తిరిగి సంగ్రహించే కార్యక్రమం రాష్ట్రంలో మొదలైందన్నారు. విద్యార్ధి దశ నుండే యోగాను పాఠ్యాంశంగా చేర్చితే మంచి ఫలితాలు ఉంటాయని, అందుకు తగ్గట్టుగా చట్టాన్ని రూపొందించే అంశంపై దృష్టి సారించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత నెల 21 నుండి ఈ నెల 21 వ తేదీ వరకు యోగాంధ్రా2025 కార్యక్రమాన్నిరాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ బారీ స్థాయిలో నిర్వహించడం జరుగుచున్నదని, ప్రజలు పెద్దఎత్తున ఈ శిక్షణాకార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేస్తున్నారన్నారు. ప్రపంచ దృష్టిన అకర్షించే విధంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21న విశాఖపట్నం ప్రధాన వేదికగా మరియు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ స్థాయిలో నిర్వహించే ఏర్పాట్లు చేయడం జరుగుచున్నదని, దేశ పధాని నరేంద్ర మోడీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరవుతున్నారన్నారు. అనంతరం ఆయూష్ శాఖ నుండి వచ్చిన వైద్యాధికారులు డా.రామానందం, డా.రత్న ప్రియదర్శిని శాసన సభ ఉద్యోగులకు యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, ఉపకార్యదర్శులు కె.రాజకుమార్, వనితా రాణి, అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.శ్రీనివాసరావు తదితరులతో పాటు శాసన ఉద్యోలు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆగస్టు 15 కల్లా లక్షల బంగారు కుటుంబాల దత్తత

**- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**విజయవాడ.,జూన్ 5,ప్రభాతవార్తప్రతినిధి:** జీరో పావర్టీ పి4 లక్ష్యంలో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి 15 లక్షల కుటుం బాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన మార్గదర్శి రిజిస్ట్రేషన్,దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. నాడు ఆర్థిక సంస్కరణల తర్వాత చేపట్టిన పిపిపి విధానానికి కొనసాగింపుగానే నేడు పి4 విధానం తీసుకువచ్చామని అన్నారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో జీఓ పావర్టీ పి4పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి...స్మార్ట్ ఏపీ ఫౌండేషన్‌ను స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ మార్చాలని నిర్థేశించారు. అమరావతి పి4కి కేస్ స్టడీగా నిలుస్తుందని, రాజధాని నిర్మాణంలో 29వేల మంది రైతులను భాగస్వాములు చేయడం ద్వారా వారికి సంపద సృష్టి జరిగేలా చేశామని చెప్పారు.

# పెట్టుబడి ప్రతిపాదనే పర్యవేక్షణ

## కార్యరూపంలోకి తెచ్చేందుకు పిఎంయు కమిటీ

## 20 లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రి లోకేష్ సమీక్ష

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమిప్రభుత్వం ఏడాదిలో రూ.9.20 లక్షలకోట్ల పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. వాటితో పాటు 1,19,580 చిన్న,మధ్య తరహా పరిశ్రమల ద్వారా రూ.13,895 కోట్ల పెట్టుబడులు వస్తాయన్నారు. 20 లక్షల ఉద్యోగాలు,ఉపాధి కల్పనపై మంత్రులు,అధికారులతో ఉండవల్లి లోని నివాసంలో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఈ పెట్టుబడులతో ఏర్పాటు చేసే పరిశ్రమల ద్వారా 8.5 లక్షల మందికి ఉపాధి లబిస్తుంది. ఎన్టీపీసీ,బిపిఎల్,రిలయన్స్,టాటాపవర్ వంటి సంస్థల కోసం ప్రత్యేక ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్(పిఎంయూ)లను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలి. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు అవసరమైన భూములు,మౌలిక సదుపాయాలు కల్పించాలి. విశాఖలో ఒబెరాయ్,వరుణ్ బీచ్ శాండ్స్ వంటి స్టార్ హోటళ్ళ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. బీసీసీఐ సహకారంతో అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మైదానం నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. పారిశ్రామిక వేత్తలకు త్వరితగతిన అనుమతులు ఇచ్చేందుకు వాట్సప్ గవర్నెన్స్‌తో అనుసంధానించాలి అని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ,దుర్గేష్,టిజి భరత్,కొండపల్లి శ్రీనివాస్,కొల్లు రవీంధ్ర,గొట్టిపాటి రవికుమార్,పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సుధాకర్ ఎన్‌కౌంటర్‌లో హతం

>> కేంద్ర కమిటీ సభ్యుల్లో సీనియర్ నాయకుడిగా పనిచేస్తున్నాడు. సుధాకర్ ఎన్‌కౌంటర్‌పై బస్తర్ ఐజీ విడుదల చేసిన ప్రకటనలో ఈ విధంగా పేర్కొన్నారు. నేషనల్ పార్క్ ఏరియాలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి సభ్యుడు పాపారావుతోపాటు మరికొందరు సభ్యులు ఉన్నట్లు నిఘావర్గాలకు సమాచారం అందిందని ఈ క్రమంలో వారినే లక్ష్యంగా చేసుకొని డిఆర్జీ ఎస్టీఎఫ్ కోబ్రా సంయుక్త బలగాలు నేషనల్ పార్క్ ఏరియాలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయని అన్నారు.మావోల స్థావరాన్ని గుర్తించిన భద్రతా బలగాలు వారిపై కాల్పులు జరిపారని ఈ కాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ మృతిచెందాడని ఘటన ప్రాంతంలో మావోయిస్టు ఆయుధాలు ఇతర సామాగ్రి లభ్యం అయ్యాయని తప్పించుకున్న మావోల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని అన్నారు.కాగా ఈ ఎన్ కౌంటర్‌పై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఎదురుకాల్పులు జరిగితే కేంద్ర కమిటీ సభ్యుడు ఒక్కరే ఎలా చనిపోతారని ఆయనకు ఉన్న భద్రతా వలయంలో ఎవ్వరికీ ఎమి కాకుండా ఉంటుందా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

మావోయిస్టు ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉన్న అగ్రనేతలను కేంద్ర కమిటీ సభ్యులను టార్గెట్ చేస్తు ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది.అగ్రనేతలను హతమార్చితే క్రింది స్థాయి కేడర్ నిస్తేజం అలుముకొని లొంగుబాట్లు అధికంగా ఉంటాయని కొందరు ప్రాణభయంలో ఉద్యమాన్ని వీడి స్వచ్ఛందంగా జన జీవనంలో కలుస్తారనేది కేంద్ర ప్రభుత్వ ఆలోచన విధానం లాగా కనిపిస్తుంది. గడిచిన ఐదు నెలల కాలంలో నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు చలపతి మనోజ్ సుధాకర్ తోపాటు మావోయిస్టు చీఫ్ నంబాల కేశవరావు మృతిచెందారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రేణుక గుడ్డు మరికొందరు నేతలు ఉండటం గమనార్హం..

# అమరావతిలో భూములు, ఆస్తులకు ప్రత్యేక నంబర్లు

**విజయవాడ ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అమరావతి రాజధాని పరిధిలో ఆస్తుల చిట్టాను ఆధునీకరించనున్నారు. దీని కోసం జియోడేటా బేస్ ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించనున్నారు. ప్రతి ఆస్తి, వ్యక్తులు, వారి ఆర్థికస్థితిగతులు, భూములకు సంబంధించిన సమగ్ర వివరాలూ ఇక సిఆర్‌డిఏ దగ్గర ఉండనున్నాయి. దీనికోసం సిఆర్‌డిఏ ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు ఆహ్వానించింది. డిజిటల్ అమరావతి పేరుతో ఈ సర్వే చేపట్టినా భవిష్యత్‌లో ఆస్తులకు సంబంధించిన నిర్వహణ, వాటిపన్నులు వంటి అంశాలు ఇందులో కీలకం కానున్నాయి. దీనికి తోడు ఆస్తివిలువ ఆధారంగా పన్నులు వసూలు చేసే ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ఇదే పద్దతిని అమరావతిలోనూ అమలు చేయనున్నారు. దీనికోసం జియో డేటాబేస్‌ను రూపొందించనున్నారు. రాజధాని నిర్దేశిత ప్రాంతంలో ఉన్న వ్యక్తులు, వారి ఆస్తులు, నివాసాలు, భూమి ఇతర అంశాలకు సంబంధించిన అన్ని వివరాలనూ సమగ్రంగా ఈ డేటాలో ఉంచనున్నారు. దీనికోసం 25 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ఒక గ్రిడ్‌గా రూపొందించనున్నారు. మొత్తంగా 60 చదరపు కిలోమీటర్ల నివాస ప్రాంతాలు, 160 చదరపు కిలోమీటర్ల భూములకు సంబంధించిన 30 అంశాలతో కూడిన సమాచారాని పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నారు. దీని ఆధారంగా భవిష్యత్ లావాదేవీలు నిర్వహిస్తారు.

అలాగే ప్రతి వ్యక్తికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఇందులో చేర్చనున్నారు. ప్రస్తుతం ఉంటున్నవారు, కొత్తగా వచ్చేవారి వివరాలనూ ఎప్పటికప్పుడు ఆధునీకరించనున్నారు. ప్రస్తుతం ప్రపంచబ్యాంకు అప్పు తీసుకుంటున్న ప్రభుత్వం తిరిగి చెల్లింపుకు రాజధాని పరిధిలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రత్యేకంగా చూపించారు. దీనికోసం ఇప్పుడున్న 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న భూములు, ఆస్తుల వివరాలనూ డిజిటలైజ్ చేయనున్నారు. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉన్న రోడ్లు, భవనాలు, వ్యక్తిగత ఆస్తులకు ప్రత్యేక నెంబర్లు కేటాయించనున్నారు. దీనికోసం మూడుదశల్లో డ్రోన్ సర్వే నిర్వహిస్తారు. మొత్తం సమాచారాన్ని భవిష్యత్ అవసరాలకు ఎలావినియోగించుకోవాలనే ప్రణాళికను రెండోదశలో చేపట్టనున్నారు. మొత్తం సర్వే పూర్తయిన తరువాత యూనిట్ ల్యాండ్ పార్శిల్ ఐడెంటిఫికేషన్ నంబర్(యుఎల్ పిఐఎన్), యూనిక్ ప్రాపర్టీ ఐడెంటిఫికేషన్ నెంబరు(యుపిఐఎన్), డిజిటల్ డోర్ నెంబర్స్ (డిడిఎన్) కేటాయించనున్నారు. ఈసర్వేతో ప్రస్తుతం ఉన్నవీధుల వివరాలూ, డోర్ నెంబర్లు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రస్తుతం అమరావ తికి నగరానికి ఎక్కడకెక్కడ ప్రవేశమార్గాలున్నాయి, 29 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న అన్నిరకాల నిర్మాణాలు, ఆస్తుల వివరాలనూ సమగ్రంగా సేకరించనున్నారు.

# వారం - వర్జ్యం

తేది : 06-06-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
ఏకాదశి తె.4.48
హస్త ఉ.6.33
వర్జ్యం మ.3.35-సా.5.24
దు.ఉ.8.12-9.04, 2) మ.12.33-1.25
శుభ సమయం : ఉ.9.10-9.45
రాహుకాలం - ఉ.10.30-12.00

# వార్తాఫలం

**మేషం :** వివాహ, ఉద్యోగయత్నాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెట్టినా ముందుకు సాగుతారు.

**వృషభం :** కుటుంబ సభ్యులతో అకారణంగా విభేదాలు ఏర్పడతాయి. దీర్ఘకాలిక సమస్యలు ఎదురై వేధిస్తాయి.

**మిథునం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**కర్కాటకం :** భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. అనుకోని ఆహ్వానాలు అందుతాయి.

**సింహం:** ఆర్థిక పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా వుండదు. వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి.

**కన్య :** పట్టుదల పెరుగుతుంది. పారిశ్రామిక, కళారంగాలవారికి కొంత అనుకూలంగా వుండును.

**తుల :** శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. వస్తులాభం.

**వృశ్చికం:** ఆరోగ్య సమస్యలు ఎదురైన చికాకులు పెడతాయి. ఇంటాబయటా మీ మాటే చెల్లుబాటుకాగలదు.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురవుతాయి.

**మకరం:** వృత్తి-వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు.

**కుంభం:** ఎదుటివారిని ఆకట్టుకొని ముందుకుసాగుతారు. దీర్ఘకాలిక సమస్యలు ఎదురై వేధిస్తాయి.

**మీనం:** మిత్రులసాయంతో ముఖ్యమైన పనులు కొంతవరకు పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బీచ్ ఫెస్టివల్ ఆరంభం

>> రవీంద్ర అన్నారు. మంగినపూడి బీచ్ లో ఇంత పెద్ద ఫెస్ట్ నిర్వహించడం గర్వంగా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. 2018లో బీచ్ ఫెస్టివల్ అత్యంత ఘనంగా నిర్వహించామని కానీ గత పాలకులు దీనిని నాశనం చేసారని మండిపడ్డారు. బీచ్ లోకి రావడానికి కూడా లేకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీచ్ టూరిజం అభివృద్ధికి ఈ సభ ద్వారా తొలి అడుగు వేశామని అన్నారు. 3 రోజుల పండుగలో అడ్వెంచర్ స్పోర్ట్స్, పారా గ్లైడింగ్, బీచ్ కబడ్డీ, బీచ్ వాలీ బాల్, కయాకింగ్ సహా అనేక ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. దేశంలో అన్ని రుచులు ఒకే చోట అందించబోతున్నామని మంత్రి తెలిపారు. హోటల్స్, రిసార్ట్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

**అమెరికాలో ఉంటే ఇంత ఆనందం ఉండేది కాదు**

తనది కృష్ణా జిల్లా అని ఇక్కడే పుట్టామని తానా మాజీ అధ్యక్షులు కోమటి జయరాం తెలిపారు. అమెరికాలో ఇటువంటి బీచ్ ఉంటే కమర్షియల్ చేస్తారన్నారు. కానీ ఇక్కడ మాత్రం ఆ పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. పర్యాటకంగా అభివృద్ధి చెందితే ఈ ప్రాంతానికేనా గుర్తింపు వస్తుందని వెల్లడించారు. మచిలీపట్నం బీచ్ టూరిస్ట్ హబ్‌గా అభివృధి చెందాలని ఆకాంక్షించారు. మచిలీపట్నం పర్యాటక అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

# తొక్కిసలాట ఘటనపై సిఐడి విచారణ

>> ఫ్యాన్స్ వస్తున్నందును ముందస్తు జాగ్రత్తగా మరింతగా బలగాలను పెంచి కట్టడిచేయడంలో విఫలం అయినట్లు సిద్ధరామయ్య సర్కారు భావించింది. తదుపరి ఆర్సీబీ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్లపైనా చర్యలుంటాయని దర్యాప్తు నివేదిక అందిన తర్వాత వారిపైనాచర్యలుంటాయన్నారు. ముందుగా వీరిని సస్పెండ్‌చేయడంతోపాటు కేసును సిఐడికి బదలీచేసింది.చిన్నస్వామి స్టేడియం ఇన్‌ఛార్జిపైనా చర్యలకు ఆదేశం.అలాగే ఆర్సీబీ ఈవెంట్ సంస్థ, ఆర్సీబీ ప్రతినిధిపైనా కేసులు నమోదుచేయాలని సిఎం సిద్ధరామయ్య ఆదేశాలు జారీచేసారు. ఈకేసులో మొత్తం ఐదుగురు పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటువేసారు. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ సభ్యులను కూడా అరెస్టుచేయాలని సిఎం ఆదేశించారు. అలాగే రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. సమగ్ర నివేదికను 30 రోజుల్లో అందచేయాలని నిర్దేశించామని సిఎం వెల్లడించారు. విజయోత్సవాలవేళ జరిగిన తొక్కిసలాట ఆపై మరణాలు, తీవ్ర గాయాలపాలయిన సంఘటనపై సమాచార హక్కు కార్యకర్త స్నేహమయి కృష్ణ ఫిర్యాదుపై కబ్బన్‌పార్కు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేసారు. ఆర్సీబి ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డిఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్స్, కర్ణాటకక్రికెట్ అసోసియేషన్‌సహా తొక్కిసలాటతో సంబంధం ఉన్న అందరిపైనా కేసులునమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. నేరపూరిత నిర్లక్ష్యం ఈకకేసులో సంస్థలను నిందితులుగాచేర్చింది. బిఎన్ఎస్‌లోని ఐదు సెక్షన్లకింద కేసులునమోదుచేసామన్నారు.

మరోవైపు ఈకేసు దర్యాప్తును సిఐడికి బదలీచేస్తున్నట్లు సిద్ధరామయ్య సర్కారుప్రకటించింది. కోర్టుకు ఇచ్చిన ప్రగతినివేదికలో కూడా స్పష్టంచేసింది. తదుపరి దర్యాప్తుకోసం సిట్ ఏర్పాటుకావాలన్న ఆదేశాలతోపాటు ఎఫ్ఐఆర్ కాపీని సిఐడికి అప్పగించింది. ఇప్పటికే మెజిస్టీరియల్ విచారణజరుపుతున్నామని తొక్కిసలాటకు కారణాలు, లోపాలు జవాబుదారీ తనం వంటి అంశాలు పరిశీలించేందుకు డిప్యూటి కమిషనర్ బెంగళూరు, జిల్లా మేజిస్ట్రేట్‌లో 15రోజుల్లోపు విచారణనివేదిక ఇస్తారని తెలిపింది. స్టేడియం వద్ద 2.5 లక్షలమంది గుమికూడారని, బెంగళూరు నగర పోలీసులు 1380, కెస్ఆర్‌పి ప్లాటూన్లు 325 మందిని మొహరించి భారీ బందోబస్తు ఏర్పాట్లుచేసామన్నారు. కానీ జనం భారీగా తరలిరావడంతో పలుగేట్లవద్ద తొక్కిసలాట జరిగి 11 మందిచనిపోయారని, 56 మంది గాయపడినట్లు వివరించింది. 1,6,7,17 నుంచి 21 గేట్లవద్దనే ప్రాణనష్టం జరిగింది. వైద్యసాయం వెంటనే అందించామని, క్షతగాత్రుల్లో 50 మంది ఔట్‌పేషెంట్లుగా చికిత్సపొందారని, మరో ఆరుగురికి ఇంకా చికిత్స జరుగుతోందని తెలిపింది. స్టేడియం వద్ద పోలీస్ సిబ్బందితోపాటు మూడు ఫైర్‌ఇంజన్లు, రెండు అంబులెన్స్‌లు, రెండు డి-స్వాట్ యూనిట్లు, ఒక నీటి ట్యాంకర్, కమాండ్ కంట్రోల్‌వాహనం ఏర్పాటుచేసినట్లు కోర్టుకు వివరించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారం ప్రకటించామని, క్షతగాత్రుల వైద్యఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపింది. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌సైతం మృతులకు రూ.5 లక్షల చొప్పునపరిహారం చెల్లించనున్నట్లుప్రకటించింది.

**మృతులకుటుంబాలకు రూ.10 లక్షలు..ఆర్సీబీ**

విజయోత్సవాల విషాదంపై రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం స్పందించింది. తన అధికారిక సోషల్‌మీడియా హ్యాండిల్‌పై పోస్టుపెట్టి వరుసగా అప్‌డేట్లు ఇచ్చింది. మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.10 లక్షలచొప్పున పరిహారం ఇస్తామని వెల్లడించింది. అలాగే గాయపడిన వారి సహాయార్థం ఆర్సీబీ కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటుచేస్తున్నట్లుప్రకటించింది. ప్రభుత్వంనుంచి మృతులు ఒక్కొక్కరికి రూ.10 లక్షలుపరిహారం ప్రకటించగా కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌కూడా ఒక్కొక్క కుటుంబానికి ఐదు లక్షలచొప్పున పరిహారం అందిస్తామని ముందుకువచ్చింది.

# నెల్లూరు జిల్లాలో ఘోర ప్రమాదం

>> 9మందిమహిళలు అదేగ్రామానికి చెందినఆటోలో పొగాకు గ్రేడింగ్‌కు సమీపగ్రామమైన టి.ముస్తాపురంకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి నుంచి ముస్తాపురం వెళ్లేందుకు ఏఎస్‌పేట క్రాస్ రోడ్డులో ఆటో మలుపుతిప్పుతున్న సమయంలో మర్రిపాడు నుండి నెల్లూరుకు వెళుతున్న కారు ఢీకొనింది. ఈ సంఘటనలో వెంకట్రావుపల్లికి చెందిన ఆటో డ్రైవర్, యజమాని అయిన దగ్గుమాటి పుల్లారెడ్డి (45), ఆటోలో ప్రయాణిస్తున్న అజిమా(50)లు ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. గౌసున్నీసా, సలీమా, హబీబున్నీసా, అన్వర్‌జాన్, రాబియాబి, మస్తాన్‌బి, బియాన్, బి.గౌసున్నీసా, వరలక్ష్మిలు తదితర 7మందికి తీవ్రగాయాలైనాయి. కారులో ప్రయాణిస్తున్న తిక్కవరంకు చెందిన చంద్రా నారాయణస్వామికి, మర్రిపాడుకు చెందిన గంగవరపు శ్రీనివాసులు నాయుడుకు గాయాలైనాయి. సంఘటన తెలుసుకున్న ఆత్మకూరు సిఐ గంగాధర్, స్థానిక ఎస్ఐ జిలానీలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 వాహనంలో ఆత్మకూరులోని జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. కారులో గాయపడిన వారిని వారి బంధువులు నెల్లూరులోని ప్రవేటు వైద్యశాలకు తరలించారు. ఏఎస్‌పేట క్రాస్ రోడ్డులోని ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న వెంకట్రావుపల్లి లోని క్షతగాత్రులైన వారి బంధువులు పెద్ద సంఖ్యలో ఆత్మకూరులోని జిల్లా వైద్యశాలకు భారీగా తరలివచ్చారు. దీంతో ఆసుపత్రి ప్రాంగణంలో బంధువర్గాల ఆర్తనాదాలతో దద్దరిల్లింది. ప్రమాద కారణాలను బాధితుల ద్వారా తెలుసుకున్న ఆత్మకూరు సిఐ గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# అత్యాధునిక రైల్వేస్టేషన్‌గా విజయవాడ జంక్షన్

## రూ.850 కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు



**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే అత్యాధునీక రైల్వేస్టేషన్‌గా విజయవాడ జంక్షన్ రూపుదిద్దుకుంటోంది. వచ్చే మూడు దశాబ్దాల్లో పెరగనున్న ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా విజయవాడ రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించేందుకు నీతి ఆయోగ్ పచ్చజెండా ఊపింది. రైల్వేస్టేషన్ తాజాగా కేటగిరి1లో చేరడంతో రూ.850 కోట్లతో పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం రోజుకు 1.14 లక్షలు, రద్దీ వేళల్లో గంటకు 9,120 మంది ప్రయాణికులు ఈ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. 2061 నాటికి రోజుకు 2 లక్షలకు చేరుతారనేది అంచనా. దానికి తగ్గట్టుగా రద్దీ సమయాల్లో ఒకేసారి 20 వేల మంది ప్రయాణికులు వచ్చి వెళ్లేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రస్తుతం ప్రధాన మార్గం వైపు మాత్రమే అభివృద్ధి అంతా సాగుతుండగా కొత్త రైల్వేస్టేషన్‌లో పశ్చిమం వైపు కూడా కార్యకలాపాలు విస్తరించనున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలోనే కీలకమైన స్టేషన్ విజయవాడ. నిత్యం లక్ష మంది, పండగలు, సెలవు రోజుల్లో 2లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. 10 ప్లాట్‌ఫాంలున్న స్టేషన్ నుంచి నిత్యం 250కి పైగా ప్రయాణికుల రైళ్లు, 80 గూడ్సు బండ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దక్షిణ భారతదేశంలోనే ముఖ్యమైన రైల్వేజంక్షన్ కావడంతో ఆదాయంలోనూ అగ్రస్థానంలో ఉంటోంది. చారిత్రక, వారసత్వ సంపద కలిగిన స్టేషన్‌గా, ఐదు ప్రవేశ ద్వారాలతో విజయవాడ అరుదైన గుర్తింపు పొందింది. ఏడాదికి వచ్చే ఆదాయం రూ.500 కోట్లు దాటడంతో గతేడాది బెజవాడ రైల్వేస్టేషన్ ఎన్ఎస్‌జీ 1 హోదా సాధించింది|ప్రయాణికుల రాకపోకలు, వారికి అందుతున్న సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైల్వేస్టేషన్లను వివిధ కేటగిరీలుగా విభజిస్తుంది. ఏటా రూ. 500 కోట్ల కన్నా ఎక్కువ వార్షిక ఆదాయం లేదా 20 మిలియన్ల ప్రయాణికుల రాకపోకలు సాగించే స్టేషన్లకు ఎన్ఎస జీ 1 హోదా కేటగిరీ ఇస్తారు. దిల్లీ సహా కొన్ని రాష్ట్రాల రాజధానుల్లో ఉన్న టాప్ రైల్వేస్టేషన్లకు మాత్రమే ఇప్పటి వరకు ఈ హోదా ఉండగా తాజాగా విజయవాడ రైల్వేస్టేషన్ ఆ జాబితాల చేరింది. కేంద్ర ప్రభుత్వం విజయవాడ రైల్వేస్టేషన్‌ను ఎన్ఎస్‌జీ 1 హోదా కేటాయించింది. రాష్ట్రంలో ఈ హోదా కలిగిన ఏకైక రైల్వేస్టేషన్ ఇదొక్కటే. ఎన్ఎస్ జీ 1 హోదా కోసం విజయవాడ రైల్వే స్టేషన్ చాలా ఏళ్లుగా పోటీపడుతోంది. 201718లో కేవలం రెండు ప్రమాణాల్లో వెనకబడిపోయి హోదా చేజార్చుకుంది. ఐదేళ్ల తర్వాత 202324 రైల్వే బోర్డు తాజా సమీక్షలో రూ. 528 కోట్ల వార్షిక ఆదాయంతో ఎన్ఎస్ జీ 1 హోదా ఒడిసిపట్టుకుంది. 202324లో దాదాపు 16.84 మిలియన్ల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగించారు. కొత్తగుర్తింపుతో దేశంలోని టాప్ 28 స్టేషన్లతో ఉన్న ఎలైట్ గ్రూప్‌లో విజయవాడ రైల్వే స్టేషన్ చోటు దక్కించుకుంది. దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్ తర్వాత ఎన్ఎస్ జీ 1 హోదా కలిగిన స్టేషన్ విజయవాడ మాత్రమే. ఇక్కడ ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

**ప్లాట్‌ఫాంల సంఖ్య 12కు పెరిగే అవకాశం**

## ప్యానెల్ అడ్వకేట్‌గా ఎన్.శ్రీనివాసరావు నియామకం

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర



ప్రభుత్వ సంస్థ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఒ) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ తరఫున ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్, రాష్ట్ర వినియోగదారుల హక్కుల కమిషన్, అమరావతి ప్యానల్ అడ్వకేట్‌గా రాష్ట్ర హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ తరఫున మూడు జ్యుడీషియల్ ఫోరంలలో కేసులను వాదించేందుకు, న్యాయ సలహాలు అందించేందుకు నర్రా శ్రీనివాసరావును తమ ప్యానల్ అడ్వకేట్‌గా మూడు సంవత్సరాల కాల పరిమితికి నియామకం చేశారు. ఈ మేరకు ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విజయవాడ జోన్ అధికారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్రా శ్రీనివాసరావు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుండి మాస్టర్ ఆఫ్ లా పట్టాను పొందారు. 1999లో రాష్ట్ర బార్ కౌన్సిల్ న్యాయవాదిగా నమోదయ్యారు. గత 26 సంవత్సరాలుగా న్యాయవాదిగా సేవలందిస్తున్న శ్రీనివాసరావు గుంటూరు జిల్లా కోర్టు, పలు హైకోర్టులు, సుప్రీంకోర్టులో కక్షిదారులకు సేవలందించారు. ప్రస్తుతం కెఎల్ యూనివర్సిటీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలకు న్యాయ సలహా దారునిగా పని చేస్తున్నారు. శ్రీనివాసరావుకు పలువురు న్యాయవాదులు అభినందించారు.

# తిరుమల సమాచారం

## తిరుమలలో 80శాతం పచ్చదనం పెంచేలా చర్యలు

**-2వేల మొక్కలు నాటేందుకు శ్రీకారం - టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి**



**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంఅటవీప్రాంతంలో కొలువైన తిరుమలకొండపై 80శాతం పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. ఇందులో భాగంగా తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో రెండువేల మొక్కలు నాటేకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తిరుమలలో ఇప్పటికే సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలుచేస్తున్నామని, మరింతగా ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు పటిష్ట ప్రణాళికలు అమలుచేస్తున్నామన్నారు. వనమహోత్సవంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు గురువారం ఉదయం తిరుమలలోని ఆక్టోపస్ భవనం వద్ద అదనపు ఇఒ వెంకయ్యచౌదరి మొక్కలు నాటారు. స్వయంగా నీరుపోశారు. మొక్కలను నాటడం కాదని, వాటి సంరక్షణ ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు. తిరుమలకు వస్తున్న భక్తులు తమవెంట తెచ్చుకుంటున్న ప్లాస్టిక్ నీళ్ళసీసాలు, ప్లాస్టిక్ సంచులు, ఆహారపదార్థాల కవర్లను ఘాట్‌రోడ్లలో విసురుతున్నారని, దీనివల్ల ఘాట్‌రోడ్లపై,పరిసరాల్లో ప్లాస్టిక్ అధికంగా పేరుకుపోతోందన్నారు. భక్తులుకూడా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన పెంచుకోవాలన్నారు. తిరుమలలో ప్రతి చెట్టుకు ప్రాధాన్యత ఉందని, పరిశోధన చేసి 40 స్థానిక మొక్క జాతులు నాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎఫ్ శ్రీనివాసులు, డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, ఇఇ సుధాకర్, ఎప్ఆర్ఒ దొరస్వామి పాల్గొన్నారు.

## తిరుచానూరు పద్మావతి అమ్మ తెప్పోత్సవాలు



**తిరుమల,జూన్ 5ప్రభాత వార్తప్రతి నిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మ వారి తెప్పోత్సవాలు ఐదురోజులు జరగనున్నాయి. ఈనెల 7వతేదీ శనివారం సాయంత్రం నుండి 11వతేదీ వరకు అమ్మవారి పుష్కరిణి పద్మసరోవరంలో నిర్వహిస్తారు. పాంచరాత్ర ఆగమ పూజలు అందుకుంటున్న పద్మావతి అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తున్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ట శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తిప్పలు, సంసార దు:ఖాలుతొలగి మోక్షం సిద్దిస్తుంది. పద్మసరస్సులో బంగారు పద్మంనుండి ఆవిర్భవించిన అలిమేలుమంగ జీవకోటికి మాతృమూర్తిగా మారి భవజలదిలో మునిగిపోకుండా రక్షించి సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని తెప్పోత్సవాల అంతరార్థం. ఐదురోజులు తెప్పోత్సవాల్లో తొలిరోజు రుక్మిణీసత్యభామసమేత శ్రీకృష్ణస్వామి, రెండోరోజు సుందరరాజస్వామి, మూడవరోజు నుండి పద్మావతిఅమ్మవారు తెప్పలపై విహరిస్తారు. ప్రతిరోజూ రాత్రి 7.30గంటల నుండి 8.30గంటల వరకు తెప్పోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా తిరుచానూరులో అమ్మవారు 10న రాత్రి గజవాహనంపై, 11న గరుడవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## అనారోగ్యం అనూహ్యమైనది.. మనిషి చేతుల్లో లేనిది హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**విజయవాడ,జూన్ 5,ప్రభాతవార్త ప్రతినిధి:** అనారోగ్యానికి ఎప్పుడు గురవుతామనేది మనిషి చేతుల్లో లేని వ్యవహారం.మానవ నియంత్రణలో లేని ఇలాంటి విషయాల్లో..అనారోగ్యం పాలైన విద్యార్థులకు ఇంత శాతం హాజరు లేకపోతే పరీక్షలు రాయడానికి అనర్హులవుతారనే నిబంధన పెట్టడానికి వీల్లేదు.ఇలాంటి నిబంధన సహేతుకం కాదు అని హైకోర్టు స్పష్టం చేసింది. అనారోగ్యం కారణంగా తరగతులకు హాజరుకాలేకపోయిన ఓ విధ్యార్థి సెమిస్టర్ ఫలితాలు వెంటనే ప్రకటించాలని, తరగతులకు అనుమతించాలని విజయనగరం జిల్లా రాజాంలో ఉన్న జీఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(జీఎంఆర్ఐటీ)కళాశాల ప్రిన్సిపల్‌ను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల ఈ మేకు తీర్పు ఇచ్చారు.జీఎంఆర్ఐటీలో బీవీకె కౌశిక్ బిటెక్ చదువుతున్నారు.అనారోగ్యం వల్ల గతేడాది కొన్ని రోజులు తరగతులకు హాజరుకాలేక పోయారు. హాజరు తక్కువవుతుందని మూడో సెమిస్టర్ పరీక్షకు కళాశాల అనుమతించక పోవడంతో ఆ విద్యార్థి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం పరీక్ష రాయడానికి అనుమతినిచ్చింది. కౌశిక్ మరో వ్యాజ్యం వేస్తూ ఫలితాలు వెల్లడించేలా ఆదేశించాలని, నాలుగో సెమిస్టర్‌కు హాజరయ్యేందుకు అనుమతించాలని కోరారు. ఈ రెండు వ్యాజ్యాలపై న్యాయమూర్తి విచారణ జరిపారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులకు ఇంత శాతం హాజరు తప్పని సరిగా ఉండాలని నిబంధన సరికాదు. ఈ నిబంధన ప్రభుత్వం తెచ్చింది కాదు. ప్రైవేటు కళాశాల జీఎంఆర్ తీసుకువచ్చింది. అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. మెగా డీఎస్సీకి నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.

## మద్యం కుంభకోణం నిందితుల బెయిలు పిటిషన్లపై విచారణ వాయిదా

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన బెయిలు పిటీషన్‌పై విజయవాడ సీబిఐ కోర్టు (ఏసిబీ కోర్టు ఇన్‌ఛార్జి)బుధవారం విచారణ జరిపింది. సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. అనంతరం బెయిలుపై విచారణ ఈ నెల 6కు వాయిదా పడింది. మరోవైపు విజయవాడ జిల్లా జైలు బ్యారెక్‌లో ఒక్కడినే ఉన్నానని, కనీసం ఇద్దరు ఉండే మరో బ్యారెక్‌కు మార్చాలని కెసిరెడ్డి చేసిన అభ్యర్థనకు న్యాయాధికారి సానుకూలంగా స్పందించారు. కారాగార నిబంధనల ప్రకారం కెసిరెడ్డిని మరో బ్యారెక్ లోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని జైలు అధికారులను ఆదేశించారు. మరో వైపు ఇదే కేసులో నిందితులుగా ఉన్న ధనుంజయరెడ్డి,కృష్ణమోహనరెడ్డిలు బెయిలు పిటీషన్లు దాఖలు చేశారు.

## నగర వనంలో రూ.2 కోట్లతో మొక్కల పంపిణి

**జిల్లాలో 5లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక**

### కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్



**శ్రీకాళహస్తి,జూన్ 5 ప్రభాతవార్త** శ్రీకాళహస్తికి సమీపంలోని రామాపురం రిజర్వాయర్ సమీపంలో రూ. 2కోట్లతో 'నగరవనం' కార్యక్రమాలకు గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ శ్రీకారం చుట్టారు. హరితాంధ్ర పథకంలో భాగంగా బైరాజు కండ్రిగ సమీపంలోని అడవుల్లో ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్బంగా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ పర్యావరణం, అటవీసంపద బాగుంటేనే మనందరం కాలుష్యరహిత ఆరోగ్యకర జీవనం కల్గి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడే దిశగా మొక్కలు నాటి తమ పరిసరాలను పచ్చగా ఉంచుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని ప్రస్తుతం 30శాతం నుంచి 50శాతానికి పెంచటానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అధికారులు వివరించారు. నగరవనం రూ. 2కోట్లతో సమగ్రసదుపాయాలతో చేపట్టనున్నట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్బంగా రాష్ట్రం,జిల్లా వ్యాప్తంగా వనమహోత్సవం చేపట్టడం అభినందనీయం అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రతి గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కల్పించాలన్నారు. తిరుపతి జిల్లాలో 5లక్షలకు పైగా మొక్కలు నాటాలన్నదే లక్ష్యంగా వివరించారు. గురువారం జిల్లాలోని ప్రతి గ్రామంలో అటవి, టిటిడి సంయుక్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఈ మహత్తర కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్లాస్టిక్ వాడకం మన జీవన శైలిలో భాగమైపోయిందన్నారు. మనం ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు. చెట్టు కొట్టివేయటం వల్ల కానీ ప్లాస్టిక్ ఎక్కువ వాడకం వల్ల ప్రమాదం కొని తెచ్చుకున్నామన్నారు. కెవిబిపురం నుంచి గిరిప్రదక్షిణ సంబంధించిన కనెక్టివిటి రోడ్డు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఇక్కడ స్థానిక ప్రజలకు ఆదాయాలు పెరుగుతాయని వివరించారు. అంతేకాక ఉద్యోగవకాశాలు లభిస్తాయని కలెక్టర్ వెంకటేశ్వరన్ వివరించారు. అటవీ సంరక్షణ అధికారి సెల్వం మాట్లాడుతూ భారత ప్రభుత్వం యొక్క ప్రధాన ఆటవీకరణ చొరవ అయిన వన మహోత్సవం వేడుకలు 1950లో ప్రారంభించబడ్డాయని వివరించారు. ఇప్పటికి వరుసగా 75 సంవత్సరాలుగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.

## ప్రతి జిల్లా కేంద్రంలో వైద్యుల సౌకర్యార్థం రిజిస్ట్రేషన్ రెన్యువల్

**విజయవాడ,జూన్5.ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఆధ్వర్యంలో ప్రతి జిల్లా కేంద్రంలో వైద్యుల సౌకర్యార్థం రిజిస్ట్రేషన్ రెన్యువల్‌తో పాటు ఇతర సదుపాయాలను అందించే కార్యక్రమాన్ని 13 జిల్లా కేంద్రాల్లో ప్రారంభిస్తున్నామని చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు తెలిపారు. ఈ కార్యక్రమం మొదటి దశగా విజయనగరంలో ఈ నెల 7, 8 తేదీల్లో ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా నేడు ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యక్రమ బ్యానర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని శాసనసభ్యులు డాక్టర్ పార్థసారథి, సభ్యులు డాక్టర్ ఎస్. కేశవరావు బాబు, సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో వైద్య మండలి సిబ్బంది ఆయా జిల్లా కేంద్రాల్లో సేవలందిస్తారు. గతంలో రెన్యువల్ పూర్తయిన తర్వాత మాత్రమే రెన్యువల్ చేసేవారు, ఇప్పుడు 3 నెలల ముందు కూడా రెన్యువల్ సౌకర్యం కల్పిస్తున్నామని చైర్మన్ వివరించారు. అలాగే, ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో, 21, 22 తేదీల్లో కాకినాడలో, 28, 29 తేదీల్లో తిరుపతి మెడికల్ కాలేజీలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాము. ఈ కార్యక్రమాల్లో మండలి సభ్యులు డాక్టర్ సుజాతా, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ కె. సుబ్బా నాయుడు, డాక్టర్ స్వర్ణ గీత, రిజిస్ట్రార్ రమేశ్ పాల్గొంటారు. ఈ కార్యక్రమం వైద్యులకు సౌలభ్యాన్ని అందించడంతో పాటు రాష్ట్రంలో వైద్య సేవలను మరింత మెరుగుపరిచే దిశగా ఒక ముఖ్యమైన అడుగని చైర్మన్ అన్నారు.

## భద్రతకే తొలి ప్రాధాన్యత - అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుని పనితీరు

**- క్యూలైన్లకు చేరుకునేముందే నిశిత తనిఖీలు**

**- టిటిడి నూతన సివిఎస్ఒ మురళీకృష్ణ**



**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రసిద్ధిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవారి ఆలయం భద్రతతోబాటు భక్తులకు రక్షణ కల్పించడమే తొలి ప్రాధాన్యత ఉంటుందని టిటిడి నూతన సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ తెలిపారు. భద్రత పరంగా టిటిడిలో నిమగ్నమైన విజిలెన్స్ సెక్యూరిటీ విభాగంతోబాటు పోలీస్, ఆక్టోపస్, టిటిడి సెక్యూరిటీ, ప్రైవేట్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగాలతో సమన్వయంగా వ్యవహరించి, అవసరమైన మేరకు పనితీరు సాగిస్తానన్నారు. భక్తులు నిషేధిత వస్తువులు తిరుమలకు తీసుకురాకుండా మరింతగా అవగాహన కల్పించేలా చూస్తానన్నారు. టిటిడి భద్రతలో పోలీసుశాఖ ఒకటని, ఆ శాఖతో సత్సంబంధాలు కలిగి ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ పరస్పరం అవగాహనతో ముందుకెళతానన్నారు. తిరుమలలోని వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లోనికి ప్రవేశించే ముందే తనిఖీలు మరింత పటిష్టంగా, నిశితంగా చేయిస్తానన్నారు. భక్తులు కూడా తమవెంట సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, నిషేధిత పదార్థాలు తీసుకురాకూడదని ఆయన కోరారు. గతంలో తిరుమల, తిరుపతిలో పోలీసుశాఖలో పనిచేసిన అనుభవం ఉండటంతో ప్రస్తుతం టిటిడి సివిఎస్ఒగా నియమితులు కావడం కొంతవరకు అవగాహనతో ముందుకెళతానన్నారు. టిటిడి సివిఎస్ఒగా నియమితులైన కెవి మురళీకృష్ణ గురువారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆలయ సాంప్రదాయం పాటిస్తూ స్వామివారి రంగనాయకుల మండపంలో భక్తివిశ్వాసాలతో బాధ్యతలు తీసుకున్నారు. ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి అదనపుఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి చిత్రపటం బహుకరించారు. నూతన సివిఎస్ఒ వెంట విఎస్ఒలు ఎస్వీరామ్‌కుమార్(వింగ్), సురేంద్ర, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్ ,ఆలయ పేష్కార్ రామకృష్ణ ఉన్నారు. అనంతరం ఆయన కొంతసేపు క్యూలైన్ల నిర్వహణ గమనించారు.

## ఎపి మీడియా అకాడమి, ఛైర్మన్‌గా ఆలపాటి సురేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ



**విజయవాడ జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమి, ఛైర్మన్‌గా ఆలపాటి సురేశ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక రెవిన్యూ కాలనీలో సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమి కార్యాలయంలో గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పాత్రికేయ వృత్తిలో ప్రమాణాలు మెరుగు పరచేందుకు తాను అత్యంత ప్రాధాన్యత యివ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. మీడియా విస్తృతి, సంక్షిప్తత కారణంగా యీ నిర్ణయం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. మీడికా అకాడమి ప్రాథమిక విధుల్లో ఇది ఒకటని ఆయన యీ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా, సోషల్ మీడియాను దృష్టిలో వుంచుకుని అవసరమైన సందర్భాల్లో నియంత్రణ చేయాల్సిన అవసరం కూడా ఉందన్నారు. సరియైన సమాచారాన్ని పొందడంలో యిది ఒక భాగమే కనుక మీడియా అకాడమి పరిధిలో లేకపోయినా యీ విషయపై దృష్టి సారించాల్సి వుంటుందన్నారు. తనను నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుసభా ముఖంగా ధన్యవాదాలు తెలిపారఅంతకుముందు తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేయాలని ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సురేశ్ కుమార్‌కు సూచించారు. సి.రాఘవాచారి మీడియా అకాడమి ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి ఆలపాటి సురేశ్ కుమార్‌కు ఎపియుడబ్ల్యూజె, ఎపిడబ్ల్యూజెఎఫ్ నేతలు ఇతర జర్నలిస్టు సంఘాల నాయకులు ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమ సుందర్ , హిందూ రెసిడెంట్ ఎడిటర్ రెడ్డప్ప, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్ స్వర్ణలత జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ ఉన్నారు.

## దంపతులు ఒకేచోట పనిచేసేలా వెసులుబాటు

### బదలీలపై వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్యారోగ్య శాఖలో సాధారణ బదిలీ ప్రక్రియలో ఐచ్ఛిక స్థానాల ప్రాధాన్యతలు తెలియచేసే గడువు ముగిసిన క్రమంలో తదుపరి కౌన్సిలింగ్‌తో పాటు బదిలీలు చేపట్టాల్సిన ప్రక్రియకు మంత్రిత్వ శాఖ స్పష్టతనిచ్చింది. ఈ విషయంపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు అందరు వి భాగాధిపతులతో బుధవారం నాడు రెండు గంటల పాటు చర్చించి రూపొందించిన కార్యాచరణ సూత్రాలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదించారు. జిల్లా స్థాయి విభాగాధిపతుల వరకు ఈ బదిలీ ప్రక్రియలో పాల్గొనే అధికారులంతా ఒకే స్పష్టమైన అవగాహనతో బదిలీలపై ఆయా స్థాయిల్లో పారదర్శకంగా, సహేతుకమైన నిర్ణయాన్ని తీసుకునేందుకు ఈ సూచనల్ని రూపొందించారు. ప్రస్తుతం ఒకే చోట పనిచేస్తున్న దంపతుల్లో ఒక్కరైనా అదే చోట ఐదేళ్ళలోపు పనిచేసి ఉంటే వారిని అదే చోట కొనసాగించవచ్చు..బదిలీల నిర్ణయాల్లో మొదట ఐదేళ్ళ పదవీకాలం పూర్తిచేసిన వారికి బదిలీ స్థానాలపై నిర్ణయాన్ని తీసుకోవాలి..ఆ తర్వాత 2 నుండి ఐదేళ్ళలోపు ఒకే చోట పనిచేసిన వారి బదిలీలపై వారి ఐచ్ఛికాల్ని బట్టి కొత్త స్థానాలపై నిర్ణయాలు తీసుకోవాలి..ఐదేళ్ళ సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి వారు సూచించిన స్థానాల్లో పోస్టింగ్ లభించకపోతే వారికి కౌన్సిలింగ్ చేపట్టాలి..2 నుండి ఐదేళ్ళ లోపు ఒకే చోట పనిచేసే వారు కోరుకున్న చోట బదిలీ దొరకకపోతే వారిని ప్రస్తుత స్థానంలో కొనసాగించాలి..కాంట్రాక్టు నియామకాలతో రెగ్యులర్ పోస్టుల్లో పనిచేస్తున్న వారు ప్రస్తుతానికి యథావిధిగా కొనసాగుతారు. ఆ రెగ్యులర్ స్థానాలు ఖాళీలుగా పరిగణించబడవు. వివిధ విభాగాల్లో వివిధ స్థాయిలో ప్రస్తుత సాధారణ బదిలీల నిమిత్తం ప్రకటించని ఖాళీల గురించి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు వాకబు చేశారు. ఇందుకు స్పందిస్తూ విభాగాధిపతులు (హెచ్‌వోడీలు)తెలిపిన వివరాలు మేరకు.వైద్య కళాశాలల్లో జాతీయ వైద్య సంఘం(ఎన్ఎంసి) నిబంధనల మేరకు వైద్య అధ్యాపకులను కొనసాగించేందుకు కొన్ని ఖాళీలను చూపలేదు. పిపిపి వాధానంలో నిర్వహించాల్సిన వైద్య కళాశాలల్లో గతంలో నియమించిన వారిని రీఎంప్లాయిమెంట్ చేయాల్సిన అవసరాల దృష్ట్యా మరికొన్ని ఖాళీలను ప్రకటించలేదు. ఒకే చోట ఐదేళ్ళ సర్వీసు పూర్తి చేసిన దాదాపు అందరికి కొత్త స్థానాల్లో బదిలీ చేసే వీలుంటుందని, అలా కుదరని కొన్ని సందర్భాల్లో తగు కారణాలను పరిశీలించి నిర్ణయాన్ని తీసుకుంటామని కృష్ణబాబు తెలిపారు.

## 28 హోంగార్డు పోస్టులకు 12,569 దరఖాస్తులు

**- ప్రాథమిక పరిశీలన అనంతరం 7,684 మంది ఎంపిక**

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి** ఆంధ్రప్రదేశ్ సిఐడీ విభాగంలో 28 హోంగార్డు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా...వాటి కోసం ఏకంగా 12,569 మంది ధరఖాస్తు చేసుకున్నారు. భారీ సంఖ్యలో ధరఖాస్తులు రావడంతో ప్రాథమిక పరిశీలన చేపట్టి తదుపరి పరీక్షలకు 7,684 ధరఖాస్తుదారులను సిఐడీ అధికారులు ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి మంగళగిరి లోని ఏపీఎస్పీ బెటాలియన్ మైదానంలో శారీరక కొలతల(ఫిజికల్ మెజర్‌మెంట్స్) పరీక్షలు, ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ చేపట్టనున్నారు. ఎవరెవరు ఏయే తేదీల్లో హాజరుకావాలనే విషయమై షెడ్యూల్‌ను సిఐడీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఇంటర్మీడియట్ కనీస విద్యార్హతగా కలిగిన ఈ హోంగార్డు పోస్టులకు బిటెక్, బీసిఎ, బిఎస్సీ కంప్యూటర్స్ పట్టభద్రులు సహా అనేక వృత్తి విద్యా కోర్సులు చేసిన వారూ ధరఖాస్తు చేసుకున్నారు. ఇవి శాశ్వత ఉద్యోగాలు కూడా కావు.

## శ్రీవారి ఆలయంలో 9నుండి జ్యేష్టాభిషేకాలు

**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి విగ్రహాలు అరిగిపోకుండా పరిరక్షణకు మూడురోజులపాటు జ్యేష్టాభిషేకాలు నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతి ఏడాది జూన్‌మాసంలో జ్యేష్టానక్షత్రానికి ముగిసేలా జరిపించే ఈ జ్యేష్టాభిషేకాల్లో ఉత్సవమూర్తులకు ఉన్న బంగారు కవచాలు తొలగించి రోజుకో కవచం ధరింపజేస్తారు. మళ్ళీ మూడవరోజు బంగారుకవచంలోనే ఉత్సవమూర్తులను అలంకరింపజేసి ఏడాది పూర్తిగా అలాగే ఉంచుతారు. దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ ఎన్నో రకాల సేవలు,కైంకర్యాలు నిర్వహిస్తారు. వీటివల్ల ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానస ఆగమోక్తంగా జ్యేష్టాభిషేకాలు జరిపిస్తారు. సంపంగి ప్రాకారంలోని కల్యాణోత్సవ మండపంలో జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఈనెల 9వతేదీ సోమవారం రుత్వికులు శాంతి హోమం నిర్వహిస్తారు.

**EASTERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LTD**
**OPERATION CIRCLE : VISAKHAPATNAM**

**TSP. No.26/25-26/SE/O/VSP**

Tenders are invited from the Registered Contractors for work of "Providing of labour charges towards Unloading of Indoor and Outdoor materials and stacking of various materials received from suppliers/ inter stores for the period from **01.05.2025** to **31.07.2025** at District Stores, Simhachalam in Operation Circle, Visakhapatnam. Sanctioned vide DR.NO. 15/2025-26". For detailed Tender Notice explore website **www.tenders.apeprocurement.gov.in** and **www.tenders.apeasternpower.com** last date for receipt of tenders on line is: **13.06.2025 at 15:00 Hrs.**

Ph: 0891-2718091-0891-2562258 Advt-43 Sd/- Superintending Engineer

**VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY**

**'e' Procurement Tender Notice**

VMRDA, Visakhapatnam invites tenders on "e" Procurement Platform for 5 No. of works with a total ECV of **Rs.128.81Lakhs** with last dates as on13-06-2025, 18-06-2025, 19-06-2025, 20-06-2025 & 23-06-2025, 3.30 pm. For further details logon **to www.apeprocurement.gov.in**

**Sd/-Metropolitan Commissioner, VMRDA**

వార్త

ఒక పనిని బాగా చేయడం మాత్రమే కాకుండా మరింత బాగా చేయాలన్న అదనపు కోరికను కలిగి ఉండడాన్ని సామర్థ్యం అంటారు.

-హెచ్.గిల్బర్స్

# పర్యావరణంతో పరాచికాలా?


విశ్వవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకు వస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణాలవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యమైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది, నిందించాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేశాయి, చేస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగి పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం అత్యంత దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు కూడా చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు నుంచి మొదలు పెడితే కొండలు తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలు, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంటపొలాలను జనవాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్నివిధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో చేసే కార్యక్రమం కోసం నిత్యం అన్వేషణ కొనసాగుతున్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత్ జనాభా 145 కోట్లకు చేరుకోవడానికి ఇంకా ఎక్కువ కాలం పట్టదని అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతున్నదని, ప్రధానంగా అటవీ సంపద వేగంగా హరించుకుపోతున్నదని స్పష్టం చేసింది. భారత్‌లో రోజుకు దాదాపు మూడువందల ముప్ఫైఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్యసమితి నివేదికలో వివరించింది. బొగ్గుగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీలోయ ప్రాజెక్టుల కోసం యథేచ్ఛగా అడవులు నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకం నియంత్రించలేకపోతున్నారు. దీనివల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. ఒక ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవికాగితాలకే పరిమితమైపోతున్నాయి. ఇక పెట్రోలు, డీజల్ వంటి ఇంధనాల్ వాడకం గూర్చి చెప్పక్కరలేదు. వాహన కాలుష్యనియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. వీటితోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ వాయుకాలుష్యాన్ని పెంచుతున్నది. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీర ప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాడో పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతీగా ప్రకృతి తీవ్రంగానే స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు పడకపోడం అకాలంలో భారీ వర్షాలు ఒకేసారి, ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం లాంటివి ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. వ్యవసాయరంగంపై తీవ్రప్రభావం చూపుతున్నది. అంతే కాదు వరదలు, తుఫాన్‌లతోపాటు భూకంపాలు లాంటి ఉపద్రవాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతంఈశాన్య రాష్ట్రాలను అధికవర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. సిక్కిం, అసొం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మిజోరం, నాగాలాండ్, మేఘాలయాల్లో కుంభవృష్టి కురిసింది. ఫలితంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ వర్షపు బీభత్సానికి ఇప్పటికే నలభై మందికి పైగా ప్రాణాలు కోల్పోగా వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. యేటాదాదాపు మూడువందల ఎనభైకిపైగా ప్రపంచ వ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార లెక్కలే వెల్లడిస్తున్నాయి. ఈ ఉపద్రవాలతో యేటా లక్షలాది మంది ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగపీడితులు అవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే ఇటీవల పాలకులు తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యల వల్ల ప్రాణ, ఆస్తుల నష్టం కొంతవరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా ప్రకృతి విజృంభణకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుండి బయటపడలేకపోతున్నారు. మొన్న ఆ మధ్య చైనాలో ప్రకృతి సృష్టించిన విలయం ఇందుకు సజీవ సాక్ష్యంగా చెప్పొచ్చు. ఆర్థికంగానో, సాంకేతిక పరంగానో ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని చైనీయులు కూడా ప్రకృతి ముందు తలవంచక తప్పలేదు. భారీ వరదలతో ఎల్లోనదీ ఉగ్రరూపం దాల్చి నగరాలకు నగరాలనే ముంచెత్తింది. ప్రజాజీవనం అస్తవ్యస్తమైంది. ఒక్క చైనాయే కాదు ప్రపంచంలోని అనేక దేశాలు ఈపరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చిన్నచితక వానలకే దేశంలోని అనేక నగరాల పరిస్థితి దారుణంగా తయారవుతున్నది. మొన్న బెంగళూర్ నగరం, నిన్న ముంబయి విపత్కరల పరిస్థితులు ఎదుర్కొన్నాయి. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు, పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాల్సి ఉంది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యంచేసినా ఇలాంటి ప్రళయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

గౌరవం అన్నది పదవులు హోదాలు పొందడంలో లేదు. పదవులు, గౌరవాలకు మనం అర్హులం అనే భావనలోనే గౌరవం ఉంటుంది.




అరిస్టాటిల్

ఓ మర్రిగింజ మహావృక్షమైనట్టే, చిత్తశుద్ధితో చేసే చిన్న సత్కార్యం మహాఫలితాలను ఇస్తుంది.



కె.స్టానిస్లావిస్కి

## ప్రజావాక్కు



### యువతను ఆకర్షిస్తున్న డిజిటల్ విప్లవం

ఆధునిక డిజిటల్ విప్లవంతో ప్రపంచం మన చేతిలోకి వచ్చింది. సమాచార మార్పిడిలో వేగం పెరిగింది. కానీ ఇదే డిజిటల్ ప్రపంచం నేటి యువతను, చిన్నారులను ప్రమాదకరమైన మార్గాలవైపు నడిపిస్తోంది. ముఖ్యంగా సోషల్ మీడియా, ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో అశ్లీల కంటెంట్ విపరీతంగా పెరిగిపోతుండటం ఆందోళనకరం. టీనేజర్ వయసులోనే లైంగిక ఆలోచనలు పెరగడం, అమ్మాయిలను వస్తువుల్లా చూడ దంవంటి పరిణామాలు ఆవిష్కృతమవుతున్నాయి. చిన్నా రులు కూడా మొబైల్ ద్వారా ఈ విషపూరిత కంటెంట్‌కు చేరువ అవుతుండటం మరింత భయంకరం. ఇది దేశ భవిష్యత్తుకు ముప్పు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పల్లెల్లో ఊపందుకోనున్న రాజకీయం

రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి. ఎన్నికల రంగంలోకి దూకేందుకు స్థానిక నాయకులు సిద్ధంగా ఉన్నారు. సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో పోటీ చేయాలనే ఔత్సాహికులు తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన వెంటనే పల్లెల్లో మళ్లీ రాజకీయం ఊపందుకోనుంది. ఒకవైపు ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నాయకులు, యువకులు చొరవ చూపుతున్నారు. గ్రామాలలో మహిళాసంఘాలు, స్వయం సహాయక బృందాలు, యువజన సంఘాలతో నిత్యం సమావేశమవుతున్నారు.

- సింగు లక్ష్మీనారాయణ, జయశంకర్ భూపాలపల్లి

### ఫీజుల పెంపు సమంజసం కాదు

ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో దడ మొదలైంది. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు ఇతరసామగ్రి కొనాలంటే తల్లిదండ్రులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పాఠశాలలపై నియంత్రణ లేకపోవడంతో ఫీజుల భారం పెరిగింది. ఏడాది సంపాదనంతా బడికే అని వాపోతున్నారు. కుటుంబంలో ఇద్దరు విద్యార్థులుంటే అంతే. దాదాపు రూ. లక్ష వరకు భారం పడుతోంది. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలపై నియంత్రణ విధించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లిజిల్లా

### ప్రభుత్వ కార్యాలయాలను ఆధునీకరించాలి

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేషన్ డివిజన్ వారు తహసిల్ పౌర సరఫరాల మొదలగు ప్రాథమిక పరిపాలన కార్యాలయాలు చాలా వరకు అధ్వాన్న స్థితిలో ఉన్నవి. ఈ భవనాలను శుభ్రపరచకపోవడం వలన అత్యంత భయంకర దృశ్యంగా కనిపిస్తుంటాయి. సున్నం రంగులు వేసినట్టు కనిపించడం లేదు. కిటికీలు తలుపులు మరీ దారుణంగా ఉన్నాయి. మూత్రశాలలు అధ్వాన్నస్థితిలో ఉన్నవి. కొన్ని కార్యాలయాలు పై అంతస్తులో ఉండడం వలన స్త్రీలు వయోధికులు మెట్ల మార్గం నుండి పోవడం గగనంగా మారుతున్నది. కార్యాలయాల ఫర్నిచర్ ఇక్ష్వాకుల కాలంనాటివి ఇంకా ఉపయోగిస్తున్నారు. ఫైల్స్ భద్రపరచడానికి సరైన వ్యవస్థ లేదు. కంప్యూటర్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు ఉపయోగించే కేబుల్స్ కరెంటు వైర్లు వేలాడుతుంటాయి. ప్రభుత్వాలకు ప్రజలకు ప్రధాన వారధులైన ఈ కేంద్రాల ఆలనాపాలన పట్టించుకోకపోవడం శోచనీయం.

-దండంరాజు రాంచందర్ రావు, పాత బోయినపల్లి

### సైనికులను ఆదుకోవాలి

యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు సర్వ లాంఛనాలతో ప్రభుత్వ ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించడం గౌరవప్రదమైన సంస్కారం. యుద్ధాలలో పాల్గొని ప్రాణాలతో బయట పడ్డవారిని పట్టించుకునేదెవరు? వీరికి ఠంచనుగా పెన్షను యిస్తున్నారు. వీరిలో చాలామంది బయటకు వచ్చిన తరువాత సరైన ఉద్యోగాలురాక చిన్నాచితక కొలువులు చేసుకుంటూ సంసారాలను ఇదుక్కొస్తున్నారు. యుద్ధ భూమిలో మరణించిన వారికి మాత్రం భార్యలకు ప్రభుత్వ పెన్షన్‌తోబాటు గుత్తగా అధికమొత్తం ఇవ్వడం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం, కొన్ని వందల గజాలస్థలాన్ని ఉచితంగా ఇస్తున్నారు. యుద్ధాల్లో వీరోచితంగా పోరాడి ప్రాణాలతో బయట పడినవారికి రిక్తహస్తాలే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ప్రజా ప్రతినిధులకు విద్యార్హతలు నిర్ణయించాలి

తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కార్పొరేషన్ మున్సిపాలిటీ ఎన్నికలలో ఎన్నికయ్యే ప్రజా ప్రతినిధులకు రిజర్వేషన్ సౌకర్యంతో పాటుగా విద్య అర్హతలను కూడా నిర్ణయించాలి. పదవతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వంటి విద్య అర్హతలను ప్రజా ప్రతినిధుల గ్రామస్థాయి, మండలస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, హోదాలను బట్టి విద్యా అర్హతలను నిర్ణయించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిందే

**విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల విధివిధానాలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపినప్పుడే ప్రభుత్వాలు విద్యాశాఖ విద్యార్థులకు అవసరమైన అనేక సదుపాయాలపై దృష్టి సారిస్తాయి. త్వరితగతిన నెరవేర్చడానికి కూడా కృషి చేస్తాయి. కానీ ప్రభుత్వ పాఠశాలలలో అవసరమైన విద్యార్థులు నమోదు లేనప్పుడు ప్రభుత్వాలు ఆచితూచి ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. ప్రత్యామ్నాయంగా రేషనలైజేషన్ లాంటి కార్యక్రమాలను చేపడుతున్నాయి. పాఠశాలలో పిల్లలను చేర్పించే బాధ్యత పూర్తిస్థాయిలో తల్లిదండ్రులకే కల్పించబడింది. కాబట్టి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత, విలువలను గుర్తించి స్వచ్ఛందంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించితే గానీ అన్నివర్గాల వారి విద్యాభివృద్ధికి జ్యోతులుగా ప్రభుత్వ పాఠశాలలు మనుగడ కొనసాగిస్తాయనడంలో సందేహం లేదు.**

దాడిశెట్టి శ్యామ్ కుమర్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ యాజమాన్యాల కింద పనిచేస్తున్న ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వాలు విద్యాశాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించిన స్థాయిలో తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించకపోవడం వలన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యా సంవత్సరం విద్యార్థుల నమోదు శాతం క్రమక్రమంగా తగ్గుతూ పోతున్నాయన్న విషయాన్ని విద్యాశాఖ గణాంకాలు చెప్పకనే చెబుతున్నాయి. కారణాలు ఏవైనా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక స్థాయి నుండి ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల స్థాయివరకు తరగతి గదికి అనువైనటువంటి విద్యార్థుల సంఖ్య లేని పాఠశాలలే ఎక్కువగా గోచరిస్తుండడం విశేషం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల్లోని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న విద్యార్థుల శాతమే ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువగా ఉంటుందనే భిన్న వాదనలు లేకపోలేదు. దీని కారణం గ్రామీణ, పట్టణ ప్రాంతాలు మొదలుకొని కనీస ఆర్థిక పరిస్థితులు ఉన్న కుటుంబాలు ప్రభుత్వ పాఠశాలల పట్ల అనాసక్తి చూపడం, ప్రభుత్వ బడిలో తమ పిల్లల్ని చదివించడం అంటే కొందరు తమ హోదాకు దర్పణంగా లేదనే భావించేవారు ఉన్నారంటే అతిశయోక్తి లేదు. మరికొందరిలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలపై అవగాహన లేకపోవడం, ప్రభుత్వ పాఠశాల ఆవశ్యకత గుర్తించలేకపోవడం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండడానికి కారణమైన ఉండొచ్చు అని భావన కొందరిలో లేకపోలేదు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత చదువులు కలిగి అత్యున్నతమైన అనుభవం కలిగినటువంటి ఉపాధ్యాయులు ఉండడం, విశాలమైన క్రీడా ప్రాంగణం క్రీడా సామాగ్రి, సైన్స్ ప్రయోగశాల పరికరాలు, ప్రయోగశాల గదులు సరిపడా, తరగతి బోధనా గదులతో, మంచినీటి సౌకర్యం, బాల బాలికలకు వేరువేరు సానిటేషన్ వ్యవస్థలతో పాటు మౌలిక వసతులను సాధ్యమైనంత త్వరితగతిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా గణనీయంగా ఉన్నతీకరించబడుతుండటం శుభ సూచకమే. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు విద్యావ్యవస్థకు పటిష్టమైనటువంటి విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలతో సమావేశాన్ని నిర్వహిస్తుండడం, ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక బడిబాట లాంటి కార్యాచరణను చేపట్టడం గమనార్హం. ఈ క్రమంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచే విధంగా విషయ బోధన అభ్యసనలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకునే విధంగా ప్రభుత్వం అనేక కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ సౌకర్యంతో పాటు తరగతి గదులకు ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేసిన సందర్భంలో వీటిని విషయ బోధనలో వినియోగించేందుకు ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని బోధన ఉపాధ్యాయులకు కావలసిన వృత్యాంతర శిక్షణ కార్యక్రమాలను



ఇటీవల ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహించింది. అంతేకాకుండా ప్రభుత్వం కోట్ల రూపాయల బడ్జెట్‌తో ఉపాధ్యాయుల కొరత లేకుండా ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నాణ్యమైన తెలుగు ఇంగ్లీష్ మాధ్యమాల్లో మెరుగైన విద్యా బోధనతో సహా పాఠ్యాంశాలతో పాటు పౌష్టికాహార విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీ, డాక్టర్లచే వైద్యపరీక్షలు నైతిక విలువలతో కూడిన మార్గదర్శకత యోగ అభ్యసనం, క్రీడలు సైన్సు సాహిత్య, సంస్కృతి కార్యక్రమాలలో అభిరుచి కలిగించడం, కంప్యూటర్ల వాడకం, అభ్యసనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కల్పించడం ఇలాంటి అనేక సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్నప్పటికీ, కారణాలేవైనా ప్రస్తుత పరిస్థితులు పరిశీలిస్తే స్థానికంగా ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత పాఠశాల స్థాయి వరకు విద్యార్థుల సంఖ్య మాత్రం ఒక్క సెక్షన్‌కే పరిమితమై ఉండడం గాని అంతకంటే తక్కువగానే ఉండడం శోచనీయం. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో మండలానికి ఒక మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలతో పాటు సంక్షేమ హాస్టల్ కూడా విస్తరించడంతో విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వీటిపైనే ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. అలాంటప్పుడు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు ఏవిధంగా నిలదొక్కుకుంటాయో అనే సందేహాలు కలగకమానవు. ముఖ్యంగా గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో సైతం ప్రైవేటు పాఠశాలలు ఎక్కువ అవుతుండడం ప్రాథమిక స్థాయి చదివే పిల్లలు ఎక్కువ శాతం ప్రవేట్ స్కూల్ వైపు ఆసక్తి చూపిస్తుండడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చాలావరకు విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నది. తద్వారా ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఉనికి అంతంత మాత్రంగానే ఉంటుంది. కారణాలేవైనా ప్రభుత్వ విద్యాశాఖ విద్యార్థులు చదువు కొరకు అనేక కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశాల ద్వారా, బడిబాట కార్యక్రమాల ద్వారా స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను తెలియచేయాలి. ఇందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు అన్ని వర్గాల వారితో పాటు ఉపాధ్యాయుల సహకారంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఏది ఏమైనప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల విధివిధానాలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపినప్పుడే ప్రభుత్వాలు విద్యాశాఖ విద్యార్థులకు అవసరమైన అనేక సదుపాయాలపై దృష్టి సారిస్తాయి. త్వరితగతిన నెరవేర్చడానికి కూడా కృషి చేస్తాయి. కానీ ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన విద్యార్థులు నమోదు లేనప్పుడు ప్రభుత్వాలు ఆచితూచి ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. ప్రత్యామ్నాయంగా రేషనలైజేషన్ లాంటి కార్యక్రమాలను చేపడుతున్నాయి. పాఠశాలలో పిల్లలను చేర్పించే బాధ్యత పూర్తిస్థాయిలో తల్లిదండ్రులకే కల్పించబడింది. కాబట్టి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత, విలువలను గుర్తించి స్వచ్ఛందంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించితే గానీ అన్నివర్గాల వారితో పాటు పేద, బడుగు, బలహీన వర్గాల వారి విద్యాభివృద్ధికి జ్యోతులుగా ప్రభుత్వ పాఠశాలలు మనుగడ కొనసాగిస్తాయనడంలో సందేహం లేదు. •

# ప్రభుత్వానికి భూములిస్తే రైతులకు లాభదాయకమే!

గరిమెళ్ల రామకృష్ణ

అమరావతి రాజధాని చుట్టూ మరింత భూసేకరణపై భిన్న వాదనలు చేస్తున్నారు. రైతుల కోణం నుంచి చూస్తే భూమిని ప్రభుత్వ అవసరాల కోసం ఇవ్వడమే ఉత్తమం! ఒక్క అమరావతి ప్రాంతంలోనే కాదు, రాష్ట్రంలో ఎక్కడ భూసేకరణ జరిగినా రైతులు తమకు ఆమోదయోగ్యమైన రీతిలో ప్రభుత్వానికి ఇవ్వడమే రైతులకు మేలు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. వ్యవసాయం గిట్టుబాటు కాక అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న వార్తలు నిత్యం పత్రికల్లో చూస్తున్నాం! వ్యవసాయం అంటే ప్రకృతితో జూదం. ఈ జూదంలో ఓటమే కానీ గెలుపు లేదు! ప్రభుత్వాలు ఎన్ని మారినా, ఎన్ని మాటలు చెప్పినా రైతుల తలరాతను మార్చే పరిస్థితి లేదు. విత్తనం దగ్గర నుంచి పండించిన పంట అమ్మే వరకు రైతులు కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన దుస్థితి నెలకొంది. పంటల బీమా వంటి పథకాల వలన రైతులకు పెద్దగా ఒరిగింది కూడా లేదు. ఏ పంట వేస్తే గిట్టుబాటు ధర వస్తుందో ముందస్తుగా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే ఒక సమగ్ర విభాగం మన వ్యవసాయ శాఖలో లేని పెద్దలోపం! ప్రభుత్వాలు కూడా రైతులకు న్యాయం చేసే పరిస్థితి లేదు. రాజకీయ పక్షాలు కార్పొరేట్ వర్గాలు ఇచ్చే విరాళాలతోనే మనుగడ కొనసాగిస్తున్న నేపథ్యంలో పాలకులు వాళ్లకు వ్యతిరేకంగా కానీ నష్టం కలిగే విధంగా కానీ నిర్ణయాలు చేయలేరు. చట్టాలు చేసినా, మద్దతు ధరలు ప్రకటించినా అమల్లో పూర్తిగా వైఫల్యమే! భూములు కోల్పోయిన రైతులు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించమని పాలకులను



కోరవచ్చు. అది కొంతవరకు సాధ్యం అవుతుంది కూడా. భూములు కోల్పోయిన రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా రైతులు షరతులు పెట్టవచ్చు. అలా ఉద్యోగాలు అవసరం లేనివారు, అవకాశం లేని కుటుంబాల వారు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకోవడానికి ప్రభుత్వ సహాయాన్ని కోరవచ్చు. వ్యవసాయంపై ఆసక్తి, చేయగల సత్తా కలవారు కొత్తగా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందే ప్రాంతాలను అధ్యయనం చేసి, గుర్తించి, చౌకధరల్లో భూములు కొనుగోలు చేసి వ్యవసాయం కొనసాగించవచ్చు. ఈ విధానం, ఒరవడి నిజాం నవాబు పాలన కాలం నుంచి ఉన్నదే! ఇక రాజధాని ప్రాంతంలోని రైతులు రాజధాని నిర్మాణం, అందుకు ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అనుమానాలు, ఆందోళన పడవలసిన అవసరం లేదు. జరుగుతున్న పరిణామాలు తమకు మేలు చేస్తాయన్న సానుకూల దృక్పథంతో ముందుకు రావాలి. ఈ సందర్భంగా రైతులు 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత అమరావతి రాజధానిగా ప్రకటించే వరకు తమ పిల్లలకు వివాహం జరిపించడం కూడా కష్టంగా ఉందన్న దైన్యస్థితి బహిరంగంగా చెప్పుకున్న వైనం మరచిపోకూడదు! ఇదే సందర్భంలో కొంతమంది దుర్బుద్ధి, దురాలోచనతో చెప్పే తప్పుడు మాటలను రైతులు నమ్మిమోసపోకూడదు! హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై నగరాల మాదిరి అమరావతి కూడా బహుముఖంగా అభివృద్ధి చెందుతుంది. అందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు తప్పనిసరి. ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గట్టిగా కృషి చేస్తున్న పరిస్థితి స్పష్టంగా కనబడుతోంది. పలు అంతర్జాతీయ సంస్థలు ఆయనపై నమ్మకం, విశ్వాసంతో ముందుకు వస్తున్నాయి. ఇందుకు రైతుల సహకారంతోడైతే అద్భుతాలు సృష్టించవచ్చు. అంతిమంగా అభివృద్ధి ఫలాలు రైతులకు కూడా దక్కుతాయి! •

# ట్రంప్ ఆర్థిక దోపిడి విధానాలతో ఆందోళన



డాక్టర్ కత్తి పద్మారావు

డొనాల్డ్ ట్రంప్ అధికారానికి వచ్చిన తర్వాత ఆయన దుందుడుకు చర్యలకు అమెరికా అంతర్గతంగానూ, అమెరికా బయట దేశాలు అతలాకుతలం అవుతున్నాయి. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రపంచానికి అమెరికా మరింత వేగంగా దూరమైపోతోంది. ఆర్థిక, విదేశాంగవిధానాలూ, సైనిక వ్యూహంలో మార్పులు వస్తున్నాయి. ట్రంప్ నేడు ప్రపంచ దేశాలన్నింటిపై ప్రతీకార సుంకాలు విధిస్తానంటున్నారు. పనామా కాల్వను, గ్రీన్లాండ్ను స్వాధీనం చేసుకుంటామన్నారు. కెనడా, మెక్సికోలు తమ దేశంలో కలిసిపోవాలనీ, గాజా నుంచి పాలస్తీనీయులు వెళ్లిపోవాలనీ వ్యాఖ్యానించారు. అమెరికా నుంచి వలసదారులను వెళ్లగొడతామంటూ గగ్గోలు రేపారు. ఇజ్రాయేల్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నందుకు ఏకంగా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపైనే ఆంక్షలు విధిస్తానని హెచ్చరించారు ట్రంప్! ఉక్రెయిన్‌కు సాయం చేస్తూపోతే మూడో ప్రపంచ యుద్ధం వస్తుందనడం, ఇంతవరకు చేసిన సాయానికి ప్రతిగా ఆ దేశంలోని అరుదైన ఖనిజవనరులను తనకివ్వాలని ఆయన డిమాండ్ చేయడం ప్రపంచాన్ని నివ్వెరపరచింది. అన్నిదేశాల మీద సుంకాలు విధిస్తున్న విధానానికి ప్రపంచ దేశాలు అన్నికూడా విస్తుపోతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ బాంబు పేల్చారు. అనుకున్నట్లుగా విదేశీ ఉత్పత్తులపై భారీగా సుంకాలువడ్డించారు. భారతదేశ ఉత్పత్తులపై 26శాతం టారిఫ్ వసూలు చేయనున్నట్లు ప్రకటించారు. వియత్నాం ఉత్పత్తులపై 46 శాతం, చైనాపై 34 శాతం, యూరోపియన్ యూనియన్ (ఈయూ)పై 20శాతం, స్విట్జర్లాండ్‌పై 31, తైవాన్‌పై 32, జపాన్‌పై 24, యూకేపై 10 శాతం సుంకాలను ఖరారు చేశారు. అన్ని దేశాల నుంచి దిగుమతి అయ్యే ఆటోమొబైల్స్‌పై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు తేల్చిచెప్పారు. ఏప్రిల్ 2వ తేదీని 'విముక్తి దినం'గా ప్రకటించారు. ఈ విషయంగా ఆయన పన్నులు ప్రకటించకముందే ప్రపంచ దేశాల ఆర్థిక శాస్త్రవేత్తలంతా అనేక రూపాల్లో ఈ విషయాలను వెల్లడిస్తూనే వచ్చారు. వారు ఈ విధానాల వల్ల అమెరికా కూడా ఒంటరైపోతుందని, అమెరికాలోని ప్రజలు కూడా సంక్షోభానికి గురవుతారని ఒక వారంగా అనేక విశ్లేషణలు ఇలా వెలువడుతూనే వచ్చాయి. ట్రంప్ ఈసారి 1.4 లక్షల కోట్ల డాలర్ల విలువైన సుంకాలను పెంచేందుకు రంగం సిద్ధం చేస్తుండటం ఇండియానే కాదు, మొత్తం ప్రపంచ ఆర్థిక రంగాన్నే తీవ్రంగా ప్రభావితం చేయనుంది! విదేశాల నుంచి అమెరికా చేసుకున్న మొత్తం దిగుమతుల విలువ నిరుడు 6.6శాతం మేర పెరిగి 4.1 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. అదే సమయంలో ఆ దేశ వస్తుసేవల ఎగుమతులేమో 3.2 లక్షల కోట్ల డాలర్లకే పరిమితమయ్యాయి. చైనా, వియత్నాం, మెక్సికో, తైవాన్, జపాన్, కెనడా, దక్షిణ కొరియా, ఇండియా, థాయ్‌లాండ్ తదితరాలతో పాటు యూరోపియన్ యూనియన్ దేశాలతోనూ అమెరికాకు భారీ వాణిజ్యలోటు ఉంది. దాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న డొనాల్డ్ ట్రంప్ దిగు



మతులపై ప్రతీకార సుంకాల ద్వారా వేలకోట్ల డాలర్ల అదనపు ఆదాయాన్ని రాబట్టాలని భావిస్తున్నారు. తన ఎన్నికల వాగ్దానమైన పన్నుల కోతలను అమలు చేయడానికి ఈ నిధులను వినియోగించుకోవాలన్నది ఆయన ఆలోచనగా చెబుతున్నారు. కానీ, ఆక్రమంలో ఆయన అమెరికాను ఏకాకిని చేస్తున్నారు. ఇప్పటికే ట్రంప్ విధించిన సుంకాలను ఎదుర్కోవడానికి చైనా, జపాన్, దక్షిణ కొరియా ఏకతాటిపైకి వస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈయూ దేశాలు సైతం గట్టిగా ప్రతిస్పందించడానికి సంసిద్ధమవుతున్నాయి. ఏతావతా అగ్రరాజ్య పరపతిని పణంగా పెట్టి మరీ ట్రంప్ ఆడుతున్న సుంకాల చదరంగం ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తుందో చూడాలి! దగ్గర దగ్గర ప్రపంచంలో ఉన్న ఏ ఆర్థిక మేధావి కూడా అమెరికాకు అనుకూలంగా ఒక్కవాక్యం కూడా రాయడం లేదు అనేది స్పష్టమైన అంశం. నిజానికి అమెరికాతో వాణిజ్యం సాగిస్తున్న 'పది' ప్రధాన దేశాల్లో ఇండియా ఒకటి. అంతేకాక ఇప్పుడు అమెరికా అధ్యక్షునిపై అక్కడ వాణిజ్య సంస్థల భాగస్వామ్యం ఒత్తిడి కూడా బలంగానే ఉంది. ఈవిషయంగా వాషింగ్టన్ ఒక కథనాన్ని కూడా ప్రచురించింది. ఆ కథనం ఇలా ఉంది. అమెరికా ఎగుమతులను పెంచేందుకు, టారిఫ్స్, నాన్ టారిఫ్ల, నియంత్రణ అడ్డంకులను తగ్గించాలని భారత్ను ఒత్తిడి చేయాల్సిందిగా అమెరికా పరిశ్రమ సంఘాలు, కంపెనీలు ట్రంప్ ప్రభుత్వాన్ని కోరాయి. యుఎస్ చాంబర్ ఆఫ్‌కామర్స్ (యుఎస్సిసి), కొలైషన్ ఆఫ్ సర్వీసెస్ ఇండస్ట్రీస్ (సిఎస్ఐఐ) ప్రముఖ బైక్ కంపెనీ హార్లే డేవిడ్సన్ వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. ఏప్రిల్ 2న పరస్పర సుంకాల విధింపు ప్రకటనకు ముందు అమెరికా వాణిజ్య ప్రతినిధి (యుఎస్ఆర్)కి ఈ మేరకు విజ్ఞప్తి చేశాయి. భాగస్వామ్య దేశాల చట్టవ్యతిరేక వాణిజ్య పద్ధతులపై యుఎస్టిఆర్ ఇటీవల సమీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. భారత వినియోగదారులకు అవసరమైన ఔషధాలను తక్కువ ధరలకు పొందేందుకు వీలుగా ఆరోగ్య సంరక్షణ రంగంలో వాణిజ్యాన్ని పెట్టుబడులను ప్రోత్సహించేలా ఔషధ తయారీ ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను తగ్గించాలని అమెరికాలోని అతిపెద్ద వాణిజ్య సంప్రదింపుల సంస్థ యుఎస్ఎస్సిసి కోరింది. ప్రపంచ సరఫరా గొలుసును బలోపేతం చేసే ఔషధ తయారీకి రెండవ స్థానంలోకి అనుమతించే నిబంధనలను చేర్చడానికి అవసరమైన వాణిజ్య ఒప్పందాన్ని కూడా కోరింది. పేటెంట్ పొందిన మందులు, స్టెంట్లు, వైద్య పరికరాలపై జాతీయ ప్రాముఖ్య మెడిసిన్స్ జాబితా కింద ధరల నియంత్రణను, భారత్లో మెడిసిన్ తయారీ ఉత్పత్తుల పెట్టుబడులను నిరోధించే వాణిజ్య విధానాలను, నకిలీ మెడిసిన్ ముప్పును కూడా యుఎస్సిసి ప్రస్తావించింది. సిటిస్కానర్లు, ఇతర అధునాతన శస్త్రచికిత్సకు అవసరమైన పునరుద్ధరించబడిన పునర్వినియోగించే వైద్య పరికరాల దిగుమతిని భారత్ అనుమతించాలని కోరింది. అమెరికన్ కంపెనీల లాభదాయకతను ప్రతికూలంగా ప్రభావితం చేసే సిన్ /డిమెరిట్ వస్తువుల వర్గీకరణ కింద ఆల్కహాల్ లేని పానీయాలపై 28 శాతం జిఎస్టిని తగ్గించాలని యుఎస్సిసి కోరింది. అమెరికా నిజానికి ప్రపంచ దేశాలకు ఎన్నో సాంకేతిక అంశాలను, సాంస్కృతిక విస్తృత అంశాలను నేర్పిందనే వాదన కూడా ఉంది. సాంకేతికంగా ప్రపంచానికి అనేక పరికరాలు అందించగలిగిన స్థాయిలో వుంది. అయితే నేడు ఇవన్నీ తిరగబడుతున్నాయి. ట్రంప్ పాలనలోని 'అమెరికా ఫస్ట్' విధానం అమెరికా ప్రయోజనాలనే అన్నింటికంటే ముందు ఉంచడానికి ప్రయత్నిస్తుంది. భారతదేశం ఇలాంటి ఒడిదుడుకులను ఎన్నింటినో ఎదుర్కొంది. ఎంతోమంది ప్రపంచనియంతలను చూసింది. భారతదేశం చేయాల్సిన పని దేశీయ సంపదను పెంచుకోవడం చైనా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, కెనడా వంటి దేశాలతో సంబంధాలను మరింతగా మెరుగుపరచుకోవడం భారతదేశంలో వున్న మేధావులకు, విద్యావంతులకు, సాంకేతిక పరిజ్ఞానులకు అవకాశాలు మెరుగుపరచుకోవడం. భారత దేశ ఔన్నతిని పునరుజ్జీవన శక్తితో అంబేద్కర్ నిర్మించిన రాజ్యాంగ స్ఫూర్తితో మహోజ్వలమైన జాతీయ భావనతో ముందుకు నడవవలసిన చారిత్రక సందర్భం ఇది. ఆ దిశగా ముందుకు నడుద్దాం. •

6-6Pg5exHEL.qxd:6-6Pg5exHEL.qxd 1/1/02 6:37 AM Page 1



# 19 దేశాల పౌరులపై అమెరికా కఠిన ఆంక్షలు

## ఉత్తర్వులు జారీచేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీకాలాన్ని గుర్తుకు తెస్తూ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. జాతీయ భద్రతను ప్రధానకారణంగా చూపుతూ, 19 దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించడంపై కొత్తగా కఠినమైన ప్రయాణ ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు.

ఈ ఉత్తర్వుల ప్రకారం, 12 దేశాల పౌరులు అమెరికాలో ప్రవేశించడంపై పూర్తి నిషేధం అమల్లోకి రానుండగా, మరో 7 దేశాల వారికి పాక్షిక పరిమితులు వర్తిస్తాయి. పూర్తిస్థాయి ప్రయాణ ఆంక్షలు ఎదుర్కొంటున్న దేశాల జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, బర్మా, చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్ ఉన్నాయి. అలాగే బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్క్మెనిస్థాన్, వెనిజులా దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించే విషయంలో పాక్షిక పరిమితులను ఎదుర్కోనున్నారు. 2025 జనవరి 20న ట్రంప్ తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు 14161 ప్రకారం ఈ చర్య తీసుకున్నట్లు శ్వేతసౌధం వెల్లడించింది. తీవ్రవాదం, జాతీయ భద్రతతో సహా వివిధ దేశాల వల్ల అమెరికాకు పొంచి ఉన్న ముప్పుపై సమగ్రమైన అంచనా వేసిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది.

సందర్శకులు, వీసా దరఖాస్తుదారుల నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం అసాధ్యంగా ఉన్న దేశాలను గుర్తించాలని, అలాంటి దేశాలు జాతీయ భద్రతకు ముప్పు కలిగించే అవకాశం ఉందని ఆ కార్యనిర్వాహక ఉత్తర్వు సంబంధిత ఏజెన్సీలను ఆదేశించింది. కాగా, 2017లో ట్రంప్ విధించిన ప్రయాణ నిషేధం, ముఖ్యంగా మెజారిటీ ముస్లిం దేశాలను లక్ష్యంగాచేసుకున్నప్పుడు అనేక న్యాయస్థానాల్లో సవాళ్లను ఎదుర్కొంది. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు నెలల తరబడి జాగ్రత్తగా ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఇటువంటి ఆంక్షలు విధించే అధికారం అధ్యక్షుడికి ఉందని ట్రంప్ వర్సెస్ హవాయి కేసులో సుప్రీంకోర్టు గతంలోనే సమర్థించిందని వైట్ హౌస్ విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్ గుర్తు చేసింది. అయితే, ఈ కొత్త ప్రయాణ నిషేధంనుంచి చట్టబద్ధమైన శాశ్వత నివాసితులు గ్రీన్ కార్డ్ హోల్డర్లు, ఇప్పటికే వీసాలు కలిగి ఉన్న వారు, కొన్ని ప్రత్యేక వీసా కేటగిరీల వారికి, అమెరికా జాతీయ ప్రయోజనాలకు అవసరమైన వ్యక్తుల ప్రవేశానికిమినహాయింపులు కల్పించారు. ఈ చర్యను అధ్యక్షుడు ట్రంప్ విదేశీ తీవ్రవాదులు, ఇతర జాతీయ భద్రత, ప్రజా భద్రతకు ముప్పు కలిగించే వారినుంచి అమెరికాను రక్షించడానికి ఉద్దేశించిన సాధారణ భద్రతా ప్రమాణాలు అని వివరించారు.

## బిఎస్ఎఫ్ జవాన్ కిడ్నాప్

**ముర్షిదాబాద్, జూన్ 4:** సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఓ జవాన్‌ను బంగ్లాదేశ్ వాసులు కిడ్నాప్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఓ బీఎస్ఎఫ్ జవాన్‌ను బంగ్లాదేశీయులు కిడ్నాప్ చేసి అతడిని బందీగా ఉంచారు. కొన్ని గంటల తర్వాత అతడిని విడుదల చేశారు. నుర్పుర్ జిల్లాలోని కథాలియా అనే గ్రామం దగ్గర ఉన్న అంతర్జాతీయ సరిహద్దు దగ్గర ఈ ఘటన చోటు చేసుకుంది. సుతిర బీఎస్ఎఫ్ క్యాంప్ సమీపంలోని చాందనిచౌక్ దగ్గర గల అంతర్జాతీయ సరిహద్దు నుంచి కొందరు బంగ్లాదేశీయులు అక్రమంగా భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. వారిని ఆ బిఎస్ఎఫ్ జవాన్ అడ్డుకున్నాడు. దాంతో అతడిని ఆ ముష్కరులు కిడ్నాప్ చేసి బందీ చేశారు. వారందరూ బంగ్లాదేశ్‌లోని చపాయ్ నవాబ్‌గంజ్ ప్రాంతానికి చెందిన వారేనని తెలుస్తోంది. బిఎస్ఎఫ్ జవాన్ కిడ్నాప్ అయిన విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కొన్ని గంటల్లోనే ఆ జవాన్‌ను ముష్కరులు విడిచిపెట్టేశారు. ప్రస్తుతం ఆ జవాన్ క్షేమంగానే ఉన్నాడని సౌత్ బెంగాల్ ఫ్రాంటియర్ బిఎస్ఎఫ్ వెల్లడించింది. అయితే ఈ కిడ్నాప్ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

## అమెరికాలో వలసదారుల అరెస్టులు

### ఒక్కరోజులోనే 2200 మంది

**వాషింగ్టన్, జూన్ 5:** అమెరికాలో వలసదారుల అరెస్టులు ప్రారంభమైనాయి. ఆ క్రమంలో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 2,200 మందిని అరెస్ట్ చేశారు. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహాయకులు స్టీఫెన్ మిల్లర్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ ఒక్క రోజులోనే 3 వేల మందిని అరెస్ట్ చేయాలని ఆదేశించారని పేర్కొనడంతో ఈ అరెస్టులు చోటు చేసుకున్నాయని తెలిపింది. అయితే ఒక్క రోజులోనే ఇంత మందిని అరెస్ట్ చేయడం దేశ చరిత్రలోనే ఇదే ప్రథమమని స్పష్టం చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐసిఇ అధికారులు అల్టర్‌నేటివ్ టు డిటెక్షన్ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకున్న వారిని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమం కింద పత్రాలు లేని వలసదారుల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా.. యాంకిల్ ద్వారా స్మార్ట్ యాప్స్‌తోపాటు జియోలోకేషన్ పరికరాల ద్వారా వారిని పర్యవేక్షిస్తుంటారు. అలాగే వారు తరచూ ఐసిఇ కేంద్రాలకు రావాల్సి ఉంటుందని ఇప్పటికే వారికి అధికారులు స్పష్టం చేశారు. అయితే ఎడిటిలో నమోదైన వలసదారులు ఐసిఇ కార్యాలయాలకు రావాలంటూ సందేశాలు పంపుతున్నారు. అలా వచ్చిన వారిని అరెస్ట్ చేసి కార్లలో తరలిస్తున్నారు. గతంలో ఐసిఇ పిలుపు వచ్చినా హాజరు కానీ వారిని దేశం విడిచి వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. గతంలో వలసదారులను వెనక్కి పంపిస్తామని ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# తల్లితండ్రులను పట్టించుకోని సంతానంపై కఠినచర్యలకు ప్రత్యేక చట్టం

## అసోం ప్రభుత్వం 2017 చట్టం పూర్తి స్థాయిలో అమలు



**గువాహతి, జూన్ 5:** అస్సాం రాష్ట్ర ప్రభుత్వం 2017లో తీసుకువచ్చిన ప్రాణం చట్టం అనేది ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులు, దివ్యాంగ సోదరుల సంరక్షణ కోసం తీసుకువచ్చిన ప్రత్యేక చట్టం. ఈ చట్టం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ ప్రాధాన్యత ఉన్న సంస్థలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు , కంపెనీ చట్టం ప్రకారం నిర్వచించిన ప్రభుత్వ కంపెనీలు వంటి సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై వర్తిస్తుంది. ఈ చట్టం ద్వారా ఉద్యోగులపై తల్లిదండ్రుల పట్ల బాధ్యతను చట్టబద్ధంగా విధించడం జరిగింది. ఈ చట్టం ఎందుకు అవసరమైంది, సామాజిక మార్పులు, పట్టణీకరణ పెరగడంతో కుటుంబ వ్యవస్థలో మార్పులు వస్తున్నాయి. పెద్దలు కొడుకులపై ఆధారపడే పరిస్థితుల్లో, కొంతమంది వారి బాధ్యతను తేలికగా తీసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు అనాథుల్లా మారకూడదన్న ఉద్దేశంతో అసోం ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇది కేవలం కుటుంబ విలువలను పరిరక్షించడమే కాదు, ఉద్యోగులను ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా చేస్తుంది. ఈ చట్టం అన్ని స్థాయి ప్రభుత్వ ఉద్యోగులకూ వర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో, ప్రభుత్వ అనుబంధం ఉన్న సంస్థల్లో, కంపెనీ చట్టం కింద ఉన్న సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఇది వర్తిస్తుంది. ఈ ఉద్యోగులపై ఆధారపడి జీవించే తల్లిదండ్రులు, వివాహం కాని దివ్యాంగ సోదరులు ఈ చట్టం ద్వారా రక్షణ పొందవచ్చు. ఉద్యోగిపై ఆధారపడే తల్లిదండ్రులు లేదా దివ్యాంగ సోదరులు ఈ చట్టం కింద ఫిర్యాదు చేయవచ్చు. ఉద్యోగి తన బాధ్యతలను నిర్వర్తించకపోతే, లేదా మౌలిక అవసరాలు కలిగించకపోతే, వారు అధికారుల వద్ద రాయితీగా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ చట్టం ప్రకారం "ఆధారిత తల్లిదండ్రులు" అంటే తమకు ఆదాయ మార్గాలు లేకపోయి, కొడుకు లేదా కుమార్తెపై ఆధారపడి జీవించే తల్లిదండ్రులు. వారు పెన్షన్ పొందకపోవడం, సొంత ఆదాయ మార్గం లేకపోవడం వంటి పరిస్థితుల్లో ఉంటే, వారిని ఈ చట్టం రక్షిస్తుంది. ఆధారిత దివ్యాంగ సోదరుడు/సోదరి అంటే వైకల్యం ఉన్న, వివాహం కాని వ్యక్తి. అటువంటి సోదరుడు/సోదరి తన జీవనాన్ని కొనసాగించడానికి తగిన ఆదాయం లేక, ఉద్యోగిపై ఆధారపడే వారిగా పరిగణించబడతారు.

వారిని తగిన విధంగా సంరక్షించడం ఉద్యోగి బాధ్యతగా ఈ చట్టం పేర్కొంటుంది. ఆధారిత తల్లిదండ్రులులేదా దివ్యాంగ సోదరులు ఫారమ్‌లో నియమిత అధికారికి ఫిర్యాదు ఇవ్వవచ్చు. ఇది రాతపూర్వకంగా ఉండాలి. ఎప్పుడు అయినా ఫిర్యాదు చేయొచ్చు. అధికారి దానిని స్వీకరించి విచారణకు తీసుకుంటారు. వారు ఫిర్యాదులను పరిశీలించి, 90 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

# న్యాయవిద్యార్థిని శర్మిష్ఠ పనోలికి బెయిల్



**కోల్‌కత్తా, జూన్ 5:** ఆపరేషన్‌సింధూర్‌పై అభ్యంతరకరపోస్టులుపెట్టిన న్యాయవిద్యార్థిని శర్మిష్ట పనోలికి కోల్‌కత్తా హైకోర్టు బెయిల్ మంజూరుచేసింది. మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉందని ఆమెపై కోల్‌కత్తాపోలీసులు కేసులు నమోదుచేసిన సంగతి తెలిసిందే. రూ.10 వేల పూచీకత్తుతో ఆమెకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. గురుగ్రామ్‌లో అరెస్టు అయిన పనోలి ఈనెల 13వ రకూ జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. ఆపరేషన్ సిందూర్‌పై బాలివుడ్ నటుల మౌనం ప్రశ్నిస్తూ ఆమె ఇన్‌స్టాలో విడియోను పోస్టు చేసింది. ఆపోస్టు ఉద్రిక్తతలకు తావిచ్చింది. అనేకమంది సోషల్‌మీడియా యూజర్లు ఆమెను హెచ్చరిస్తూ వ్యాఖ్యలుపెట్టారు. దీనితో ఆమె ఆ విడియోను తొలగించి బహిరంగ క్షమాపణలు చెప్పింది. బెంగాల్‌లోని వివిధ పోలీసు స్టేషన్లలో పనోలిపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని ఆమె తరపు న్యాయవాది వాదించారు. వజాఖత్ ఖాన్ ఖాద్రి అనే వ్యక్తి గార్డెన్ రీచ్ పోలీస్‌స్టేషన్‌లో ఆమెపై ఫిర్యాదుచేసారు. విచిత్రం ఏమిటంటే ఫిర్యాదుచేసిన ఖాద్రికూడా పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇపుడు అంశంపై ముమ్మర దర్యాప్తుచేస్తున్నారు. ఒక మతపరమైన ట్రస్టు శ్రీరామ్ స్వాభిమాన్ పరిషద్ సంస్థ గార్డెన్‌రీచ్‌పోలీస్ స్టేషన్‌లోనే ఫిర్యాదుచేసింది. ముంబయి, అస్సాం, దేశంలోని ఇతర ప్రాంతాల్లోకూడా ఖాద్రిపై కేసులు నమోదయ్యాయి. విద్వేషకర ప్రసంగాలు చేస్తున్నారని, దీనివల్ల ఉద్రిక్తతలు,హింస పెచ్చరిల్లే ప్రమాదం ఉందని ఫిర్యాదులు నమోదయ్యాయి.

# తొక్కిసలాట ఘటనను రాజకీయంచేస్తున్న బిజెపి

## కన్నీటి పర్యంతం అయిన కర్ణాటక డిప్యూటీ సిఎం



**బెంగళూరు, జూన్ 5:** ఆర్సీబీ విజయం సందర్భంగా బెంగళూరులో జరిగిన తొక్కిసలాటను ప్రతిపక్షం రాజకీయం చేస్తోందని, ఇది రాజకీయాలుచేసే సమయం కాదని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికెశివకుమార్ అన్నారు. మీడియాతో మాట్లాడుతు జరిగిన సంఘటనపట్ల క్షమాపణలు చెపుతున్నానని, ఇది ఎంతో ఘోరమని ఆయన కన్నీటి పర్యంతం అయ్యారు. బెంగళూరు ప్రతిష్టను ప్రతిపక్షాలు మరింత దిగజారుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. పోలీసులు అనుమతులివ్వలేదన్న వార్తలపై ఆయనస్పందిస్తూ బిజెపి నేతల విమర్శలపై తానుస్పందించబోనని నేను కర్ణాటక ప్రజలకు జవాబుదారీ అని దేశ ప్రజలకు జవాబుదారీ అని ఆయనఅన్నారు. బిజెపి నాయకులే ఇలాంటి విషప్రచారానికి కుట్రదారులని డికె ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు శవరాజకీయాలుచేసుకోనీయండి, ఎన్ని మృతదేహాలపై వారు శవరాజకీయాలు చేసారన్నదానిపై నేను జాబితారూపొందిస్తానని అన్నారు. ఎంతో బాధగాఉంది. బాధితులు మన రాష్ట్రంవారు, బెంగళూరువారు మన సొంతకుటుంబం వారే. బెంగళూరు, కర్ణాటక ప్రతిష్ట పూర్తిగా పోయిందని మేం బాధ్యత తీసుకుంటున్నాం, ఎవ్వరినీ నిందించడంలేదని ఈ సంఘటన అనూహ్యంగా జరిగిందని, ఇంత భారీస్థాయిలో అభిమానులు వస్తారని ఎవ్వరూ ఊహించలేదని ఆయన అన్నారు.

# నేరాల హబ్‌గా బీహార్!

## ఎఐసిసి నేత రాహుల్ ధ్వజం



**పాట్నా, జూన్ 5:** ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఆద్వర్యంలో బీహార్ నేరాల హబ్‌గా మారిపోయిందని, నిరుద్యోగం మరింతగా వృద్ధిచెందిందని దీనివల్ల ప్రజలంతా ఉపాధిలేక వలసలు పోతున్నారని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి ఆరోపించారు. గయలో ఇటీవల జరిగిన సంఘటనను పురస్కరించుకని ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. అత్యాచార బాధితురాలి తల్లి అస్వస్థతకు గురయితే చికిత్స చేసేందుకువెళ్లిన వైద్యుడిని చెట్టుకు కట్టి తీవ్రంగా కొట్టిన సంఘటనను పురస్కరించుకుని ఆయన సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలుచేస్తూ పోస్టుపెట్టారు. అంతేకాకుండా చెట్టుకు కట్టేసి డాక్టర్‌ను కొట్టిన విడియోను కూడా ఆయన జతచేసారు. డాక్టర్ జితేంద్ర యాదవ్‌ను చెట్టుకు కట్టేసి కొట్టారని ఈకేసులో నిందితులే ఈ ఘాతుకానికి పాల్పడినా ప్రభుత్వంనుంచి స్పందనలేదని ఆయన దుయ్యబట్టారు. అత్యాచార బాధితురాలు తల్లికి చికిత్సచేసినందుకే ఈ రేప్‌కేసు నిందితులు దారుణంగా డాక్టర్‌ను కొట్టారని రాహుల్ పేర్కొన్నారు. రాష్ట్రం నేరాలకు హబ్‌గా మారిందని, నిరుద్యోగం పెరిగిపోయిందని, వలసలు అందుకే పోతున్నారని ఆరోపించారు. ఇవే నితీష్‌కుమార్ బిజెపి ప్రభుత్వం వాస్తవ స్వరూపమని రాహుల్ ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రతినిధి షమా మహ్మద్ కూడా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై తీవ్ర స్థాయిలో విమర్శలుచేసారు. తొమ్మిదేళ్ల అత్యాచార బాధితురాలికి వైద్యం నిరాకరించడంవల్లనే ఆమె చనిపోయిందని ఆరో పించారు. బీహార్‌ను నేరస్తులే నడిపిస్తున్నట్లుగా కనిపిస్తోందని ఆరోపించారు. మోడీని తీష్‌కుమార్ ప్రభుత్వం పూర్తిగా నేరస్తులకు, నేరముఠాలకు, దౌర్జన్యకారులకు లొంగిపోయిందని విమర్శించారు.

## పినాకిమిశ్రాను వివాహమాడిన మహువామొయిత్రా

### ఇద్దరూ ఎంపీలే, రెండురాష్ట్రాల్లో ప్రాతినిధ్యం



**కోల్‌కత్తా, జూన్ 5:** తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మోయిత్రా బిజెడి ఎంపి పినాకి మిశ్రాను వివాహమాడినట్లు తెలిసింది జర్మనీ నగరం బెర్లిన్‌లో గతనెల మూడో తేదీ జరిగిన ఈ వివాహానికి సంబందించిన వారి ఫోటో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అయింది. రెండు పర్యాయాలు లోక్‌సభ ఎంపిగా కృష్ణనగర్ నియోజక వర్గంనుంచి ఎన్నికైన మొయిత్రా పినాకి మిశ్రాను వివాహమాడారు. ఒడిశాలోని పూరి నియోజకవర్గంనుంచి మిశ్రా ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో ఉన్న మొయిత్రా ఒంటినిండా బంగారు నగలతో మిశ్రాతో నడుస్తున్నట్లు కనిపించారు. 1974 అక్టోబరు 12వ తేదీ అస్సాంలో జన్మించిన మొయిత్రా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి ఆ తర్వాత 2010లో టిఎంసిలో చేరారు. కృష్ణనగర్‌నుంచి 2019లో మొదటిసారి ఎన్నికకాగా మళ్లీ 2024లో కూడా ఎన్నికయ్యారు. పార్లమెంటులో నియంత్రృత్వానికి సంబంధించిన ఆరు సూచనలు అన్న అంశంపై ఆమెచేసిన ప్రసంగంతో అందరిదృష్టిలోకి వచ్చారు. ఇక పినాకి మిశ్రా 1959 అక్టోబరు 23న ఒడిశాలోని పూరిలోజన్మించారు. సీనియర్ రాజకీయవేత్త, న్యాయవాదికూడా ఢిల్లీ వర్సిటీ నుంచి లా డిగ్రీ సాధించారు. మిశ్రా తన రాజకీయ ప్రయాణం ఐఎన్‌సినుంచే ప్రారంభించారు. 1996లో పూరి సీటును ఎన్నికయ్యారు. ఆ తర్వాత నవీన్ పట్నాయక్ బిజుజనతాదళ్‌లో ఎన్నికయి అనేకసార్లు అంటే 2009, 2024, 2019ల్లో కూడా ఎన్నికయ్యారు.

## ఆర్సీబీ విజయోత్సవాల వేళ విధుల్లో 1000 మంది పోలీసులు

### హైకోర్టుకు వెల్లడించిన కర్ణాటక ప్రభుత్వం

**బెంగళూరు, జూన్ 5:** ఆర్సీబి విజయోత్సవాల వేళ బెంగళూరులో సంభవించిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానానికి వివరించింది. ఘటన సమయంలో చిన్నస్వామి స్టేడియం పరిసర ప్రాంతాల్లో 1000 మందికి పైగా పోలీసులు మాత్రమే విధుల్లో ఉన్నట్లు తెలిసింది. అయితే అంతకుముందు ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ మాట్లాడుతూ ఆర్సిబి ఈవెంట్‌కు 5 వేల మంది పోలీసులులతో భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పడం గమనార్హం. తొక్కిసలాట ఘటనపై విమర్శలు రావడంతో ఈ వ్యవహారాన్ని హైకోర్టు సుమోటోగా పరిగణించింది. వేడుక కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం విషాదంగా మారింది.ఇలాంటి ఘటనలను మనం నివారించగలమా? భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే ఏం చేయగలం. అన్నవి ఆలోచించాలి అని కోర్టు అభిప్రాయపడింది. అనంతరం ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదిస్తూ ఈ స్టేడియం సామర్థ్యం 35 వేలు మాత్రమే. సాధారణ సమయాల్లో 30 వేల టికెట్లు మాత్రమే ఇస్తారు. కానీ నిన్నటి కార్యక్రమానికి దాదాపు 2.5 లక్షల మందికి పైగా అభిమానులు వచ్చారు. అందరినీ లోపలికి పంపిస్తారని వారు భావించారు. మధ్యాహ్నం నుంచే రద్దీ మొదలవగా సాయంత్రానికి కిక్కిరిసిపోయి పరిస్థితి చేయిదాటిపోయింది అని వివరించారు. తాము నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించలేదని ప్రభుత్వం ఈ సందర్భంగా తెలిపింది. వాదనలు విన్న ధర్మాసనం దీనిపై తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

## యుఎస్ వీసా కోసం సోషల్ మీడియా ఖాతాల తొలగింపు!

### 'వెట్టింగ్' ప్రభావం..





**వాషింగ్టన్, జూన్ 5:** వలసదారుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థులకు వీసాలు మంజూరు చేయడానికి ముందు వారి సోషల్ మీడియా ఖాతాలను తనిఖీ చేస్తామని అమెరికా ప్రభుత్వం చెప్పింది. ఈ పరిణామాలు అమెరికాలో చదవాలని కలలు కంటోన్న భారతీయ విద్యార్థుల్లో గుబులు రేపుతోంది. దాంతో వివాదానికి దారితీస్తాయని భావిస్తోన్న పోస్టులను వారి డిలీట్ చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా వారి సోషల్ మీడియా ఖాతాలను తొలగిస్తున్నారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

వీసా ఇంటర్వ్యూల సమయంలో వారి రాజకీయపరమైన అభిప్రాయాలు తప్పుగా అర్థం చేసుకుంటారేమోననే ఆందోళన ఇందుకు కారణమవుతోంది. మామూలుగా చేసే కామెంట్, ఎలాంటి హాని తలపెట్టని పోస్టును కూడా పరిగణనలోకి తీసుకొని వీసాను ఎక్కడ తిరస్కరిస్తారోనని వారు భయపడుతున్నారు. అమెరికా అధికారులు అనుమతించని కంటెంట్‌ను లైక్ లేక షేర్ చేయడం వల్ల ఇబ్బంది ఎదురవుతుందని, ఇలా ఆకస్మికంగా పోస్టులు, ఖాతాలు తొలగించడం కూడా అనుమానాలు రేకెత్తిస్తుందని వీసా కౌన్సిలర్లు హెచ్చరిస్తున్నారు. విద్యార్థి వీసాలకు దరఖాస్తు చేసుకునేవారు గత ఐదు సంవత్సరాల కాలానికి సంబంధించి సోషల్ మీడియా వివరాలు అందించాలని ఇమిగ్రేషన్ అధికారులు కోరతారని నిపుణులువెల్లడించారు. దాంతో వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేయడానికి వీలు కలుగుతుందన్నారు. వారినేపథ్యం వీసా లక్ష్యాలకు సరిపోతుందా లేదా?అని తనిఖీ చేస్తారు. చిన్నపాటి రాజకీయ కార్యకలాపాలు, వివాదాస్పద కామెంట్లను వీసా పరిశీలన సమయంలో అనుమానాస్పదంగానే పరిగణిస్తారని హెచ్చరిస్తున్నారు.

**ఏమిటీ సోషల్ మీడియా వెట్టింగ్..?**

వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్ని 'సోషల్ మీడియావెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. దీనిపై ప్రస్తుతం అమెరికా సన్నాహాలు చేపట్టింది. అప్పటివరకు విద్యార్థులకు వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను నిలిపివేశారు.

# పాక్ 'మేడమ్-ఎన్' వలలో భారత్ ఇన్‌ఫ్లూయెన్సర్లు!



**ఇస్లామాబాద్, జూన్ 5:** పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్) కింద పనిచేసే.. ఓ మహిళా వ్యాపారవేత్త భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను గూఢచర్యంలోకి లాగుతోంది. పాకిస్థాన్‌కు చెందిన నోషబ షెహజాద మసూద్ లాహోర్‌లో జయాన ట్రావెల్స్ అండ్ టూరిజం పేరిట ఓ సంస్థను నడుపుతోంది. షెహజాద భర్త పాక్ సివిల్ సర్వీసెస్‌లో పనిచేసి రిటైర్ అయ్యాడు. షెహజాదకు నిఘా సంస్థ ఐఎస్ఐతో బలమైన సంబంధాలున్నాయి. భారత్‌కు చెందిన జ్యోతి మల్హోత్రా వంటి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాకిస్థాన్‌లో పర్యటించేందుకు ఆమె సాయం చేస్తోంది. ఐఎస్ఐ ఆమెకు పెట్టిన కోడ్ నేమ్ 'మేడమ్ ఎన్'.

హిందూ, సిక్కు యాత్రికులకు పాకిస్థాన్‌లో పర్యటనలు ఏర్పాటు చేయించేది షెహజాదకు చెందిన సంస్థ ఒక్కటే. ఇది అక్కడి ప్రభుత్వానికి చెందిన ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డులో కలిసి పనిచేస్తోంది. దీనిని బట్టే ఆమెకు ఆ దేశ సైన్యం, ఐఎస్ఐతో ఉన్న బలమైన సంబంధాలు తెలుస్తాయి. ఈమె సంస్థ భారత్‌లోని ఢిల్లీ వంటి చోట్ల ట్రావెల్ ఏజెంట్లను నియమించుకొన్నట్లు తెలుస్తోంది. తాజాగా భారత్‌లో గూఢచర్యం ఆరోపణలపై పలువురు ఇన్‌ఫ్లూయెన్సర్లు అరెస్టయ్యారు. వారిని ప్రశ్నించగా.. షెహజాద పాత్ర వెలుగు చూసింది. భారత్‌లో ఆమె దాదాపు 500 మందితో స్లీపర్‌సెల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందుకు సంబంధించి పాక్ ఐఎస్ఐ, ఆర్మీనుంచి ఆమెకు స్పష్టమైన సూచ నలు వచ్చాయి. పాక్‌కు వచ్చిన భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను పాక్ సైనిక అధికారులు, ఐఎస్ఐకు షెహజాదనే పరిచయం చేస్తోంది. మన దేశంలోని దాదాపు 3,000 మంది ఈ సంస్థ నుంచి సాయం పొందినట్లు తెలుస్తోంది. వీరిలో దాదాపు 1500 మంది ఎన్నారైలు గత ఆరు నెలల్లోనే ఆ దేశాన్ని సందర్శించారు. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయంలో వీసా విభాగంలో ఈమెకు విశేషమైన పలుకుబడిఉంది. అక్కడి ఫస్ట్‌సెక్రటరీ (వీసా) సైహైల్‌కమర్,కౌన్సిలర్‌ఉమర్ ప్రేయర్‌తో బలమైన సంబంధాలున్నాయి. ఆమెనుంచి వచ్చే ఒక్క ఫోన్‌కాల్‌తో కోరుకున్న వారికి పాక్ వీసా లభించేది. అదే కార్యాలయంలో వీసా ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎహసాన్ ఉర్‌రెహ్మాన్ అలియాస్ డానిష్‌తో బలమైన పరిచయం ఉంది. 'మేడమ్ ఎన్' రికమండేషన్ ఉంటే భారతీయులకు విజిటర్ వీసావచ్చేసేది. జ్యోతి మల్హోత్రా వ్యవహారం వెలుగు చూడటంతో డానిష్‌ను భారత్‌నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే.

6-06pg6exHMNWJQE.qxd:6-06pg6exHMNWJQE.qxd 1/1/02 7:20 AM Page 1



# యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందిస్తాం

## - రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు

**విజయవాడ,మే5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించి, సమాజంలో ఆత్మవిశ్వాసంతో వారు ముందుకు సాగేలా చేయడమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ లక్ష్యమని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు తెలిపారు. తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ గా బూరుగుపల్లి శేషారావు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్ శేషారావు మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ కు అనుగుణంగా, ప్రభుత్వ, పరిశ్రమ మరియు విద్యా రంగాలు సమన్వయంతో పనిచేస్తాయన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్, మహిళల కోసం ప్రత్యేక నైపుణ్య కార్యక్రమాలు, గ్రామీణ యువత కోసం డిజిటల్ ఇంటర్న్ షిప్ మొదలైన కార్యక్రమాలను అమలు చేయనున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రజాహిత పాలన విధానం, ఈ సంస్థ పనితీరుకు మార్గదర్శకంగా ఉంటాయన్నారు. వారి మార్గనిర్దేశత్వంలో పనిచేస్తూ, యువతకు శిక్షణను అందించుట ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సమానత్వాన్ని కల్పించే లక్ష్యంతో మహిళలు, గ్రామీణ యువత మరియు టెక్నాలజీకి దూరంగా ఉన్నవారందరికి ఇంటింటికీ నైపుణ్యం తీసుకెళ్లేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ శేషారావును వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎండీ మరియు సీఈవో జీ. గణేష్ కుమార్, కార్యనిర్వాహక సంచాలకులు ,

సలహాదారులు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, పరిశ్రమల భాగస్వాములు మరియు విద్యా రంగానికి చెందిన ప్రముఖులు అభినందించారు.



ఉద్యోగుల సంఘ సమావేశంలోమంత్రి కందుల దుర్గేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

# ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం : మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి ఒక్కొక్కటిగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గురువారం విజయవాడ ఎస్ ఎస్ కన్వెన్షన్ హాల్ లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ మహాసభలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు తాము చేసిన పనికి ఏరోజు జీత మొస్తుందో తెలియని పరిస్థితి నుండి కూటమి ప్రభుత్వంలో ఒకటో తేదీనే జీతాలు అందించే పరిస్థితికి తీసుకు వచ్చామన్నారు. ఉద్యోగస్తులు కోరుకున్నట్లుగా ప్రతి నెలా మొదటి తేదీనే జీతం అందేలా చట్టబద్ధమైన ప్రక్రియకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగుల సమస్యపై స్పష్టమైన కార్యాచరణ ఏర్పాటు చేసి అమలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వం ముందుంట ుందన్నారు. ప్రభుత్వంతో చర్చించి ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన నిర్ణయం సుకుంటామన్నారు. పరిపాలనలో ఉద్యోగుల పాత్ర అమోఘం అని తెలిపారు. కూటమి ప్రభుత్వం దిగ్విజయంగా ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించిన ఉద్యోగ సంఘ నాయకత్వానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. గడిచిన ఐదేళ్ల కాలంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటే అరెస్ట్ ల భయం ఉండేదని గుర్తుచేశారు. ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి నూటికి నూరు శాతం సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సిట్టింగ్ జడ్జితో గానీ లేదా విశ్రాంత జడ్జితో గానీ సమస్యలపై అవగాహన తీసుకురావాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం లేవనెత్తిన డిమాండ్ ను ఏకీభవిస్తున్నానన్నారు. ఉద్యోగులు, ప్రభుత్వం పరస్పర సహకారంతో పని చేసి పాలనను మరింత ప్రజామోదంగా తీర్చిదిద్దుదామని తెలిపారు.



అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రైల్వే సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఆర్ఎం గుప్తా

# పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత అందరిది

### రైల్వేలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం

**గుంతకల్లు రైల్వే,జూన్ 5,ప్రభాతవార్త** వాయుకాలుష్యాన్ని నివారించే, పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. స్థానిక డివిజనల్ రైల్వే ఆసుపత్రి ప్రాంగణంలో గురువారం రైల్వే పర్యావరణ-గృహసంరక్ష విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం ఆడంబరంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిఆర్ఎం గుప్తా రైల్వే సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వాడకం జీవరాశి మనుగడకే పెను ప్రమాదమని, ఒకసారి ఉపయోగించిన ప్లాస్టిక్ వస్తువుల తయారీ,దిగుమతి, నిల్వ,సరఫరా, వినియోగాన్ని నిషేధిద్దామని ప్లాస్టిక్ వాడకం ద్వారా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. భావితరాలకు పచ్చని భూమి,స్వచ్ఛమైన గాలి,కలుషితం లేని మంచినీరు అందించడం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో చెట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు డిఆర్ఎం సుధాకర్, సిఎంఎస్ డాక్టర్ ఎన్వి గోపాల్‌రెడ్డి, సీనియర్ డిఇఎన్‌హెచ్ఎం పిఎస్ మణికుమార్, రైల్వే ఆసుపత్రి అదనపు సిఎంఎస్ డాక్టర్ మురళీమోహన్, వైద్యులు మధుకుమార్, అరుణ్‌కుమార్,హసీనా,రైల్వే అధికారులు మనోజ్,శ్రావణ్ కుమార్, మంగాచార్యులు,చంద్రశేఖర్,పి సింగ్,సి వీరయ్య,మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారానికి పరిమితమైన పర్యావరణ దినోత్సవం.. కాలుష్య కోరల్లో రాజమహేంద్రవరం

**రాజమహేంద్రవరం సిటీ జూన్ 5, ప్రభాతవార్త:** పర్యావరణ దినోత్సవం ప్రచారానికి మాత్రమే పరిమితం అవుతుంది. దీనిని కాపాడాల్సిన అధికారులు, నాయకులు ఫోటోలకు ఫోజులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా పల్లెలు, పట్టణాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయి. పర్యావరణం ముఖ్యంగా వాయువు నీటి కాలుష్యము వలన పాడైపోతుంది. కానీ నేటి పాలకులు, అధికారులు గాలి నీరు యదేచ్ఛగా కలుషితం చేసి ప్రజల ప్రాణాలు గాలికి వదిలేసి కోట్లు సంపాదించుకుంటున్నారు. పట్టణానికి సమీపంలో ఉన్న గ్రామాల్లో కార్పొరేట్ ఫ్యాక్టరీలు, ఆసుపత్రిలు వలన ఏర్పాటు చేస్తున్నారు. వీటి నుండి వచ్చే వ్యర్థాలు, కలుషిత నీరు, విషవాయువులు ఆ గ్రామాల పరిధిలో వదులుతున్నారు. దీని వలన వచ్చే దుర్గంధం వలన ప్రజలు అనారోగ్యం చెందుతున్నారు. ఇదేవిధంగా ఏళ్ళ తరబడి జిఎస్ఎల్ మెడికల్ కళాశాల జనరల్ ఆసుపత్రిలో ఉపయోగించిన వ్యర్థాలు రాజానగరం గ్రామం రావులచెరువు గట్టు ప్రక్కన ఆసుపత్రి ట్రాక్టర్లు, వ్యాన్ లో తీసుకుని వేస్తున్నారు.

రోగులు, వైద్యులు ఉపయోగించి రక్తం అంటున్న మాస్కులు, దుస్తులు, ఇంజెక్షన్లు, గాజు గుడ్డలు నేరుగా వేస్తున్నారు. ఇవి గాలికి ఎగిరి ఇళ్ళు లో కి వస్తున్నాయి. వర్షాకాలంలో నీరు వ్యర్థాలతో కలిసి పోయి గ్రామానికి మంచినీరు అందిస్తున్న రావులచెరువు లో వస్తున్నాయి. భారీ వర్షాలకు ఇళ్ళలోకి వ్యర్థాలు కొట్టుకు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థులు మృత్యువాత

## - వి.కోట మండలం మోట్లపల్లిలో ఘటన !



.చెరువులో నీటమునిగి మృతి చెందిన విద్యార్థులు

**వి.కోట, జూన్ 5 ప్రభాతవార్త** సరదాగా ఈత కొట్టేందుకు గాను చెరువుకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు నీట మునిగి మృత్యువాత పడిన సంఘటన గురువారం చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలం మోట్లపల్లిలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ కుమారుడు నిఖిల్ (13), రెడ్డెప్ప కుమారుడు కుశాల్ (11), ఆదెప్ప కుమారుడు జగన్ (9)లు గురువారం తమ తల్లిదండ్రులు కూలీ పనుల నిమిత్తం వి.కోట పట్టణానికి వెళ్లగా వీరు మరో బాలుడు పూర్ణేష్‌తో కలసి గ్రామ సమీపంలో ఉన్న చెరువులో ఈత నిమిత్తం వెళ్లారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో నీరు చేరింది. ఈ నేపథ్యంలో నలుగురు విద్యార్థులు చెరువులో దిగారు. పూర్ణేష్‌కు ఈత రావడంతో అతను ఈత కొడుతూ గట్టుపై వచ్చాడు. అయితే మిగతా ముగ్గురు నిఖిల్, కుశాల్, జగన్‌లకు ఈత రాకపోవడంతో పూర్ణేష్ వారిని తీగలతో లాగేందుకు యత్నించాడు. అయితే ఈత రాక ముగ్గురు బాలురు నీట మునిగారు. వెంటనే విషయాన్ని గ్రామస్తులకు తెలపగా గ్రామస్తులు హుటాహుటిన చెరువు వద్దకు చేరుకున్నారు. బురదలో కూరుకున్న వారిని పైకి తీశారు. ఓ బాలుడు శ్వాసతీసుకుంటుండగా అతన్ని ఆస్పత్రికి తరలించే యత్నంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పంచనామా నిమిత్తం పలమనేరు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# దుర్గమ్మ ఆలయంలో వనం మనం

## - కెబిఎన్ విద్యార్థుల సేవాకార్యక్రమాలు





మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు, మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, జూన్ 6, ప్రభాతవార్త** బెజవాడ దుర్గమ్మవారి ఆలయంలో గురువారం వనం మనం కార్యక్రమం ఇఓ వికె శీనా నాయక్ ప్రారంభించి మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేవస్థానం ఘాట్‌రోడ్డులో వివిధ రకాల మొక్కలు నాటిన అనంతరం ఇఓ మాట్లాడుతూ ఇంద్రకీలాద్రిపై పలు రకాల ఔషధ మొక్కలు, దేవతా వృక్షాలు, నక్షత్ర, రాశులకు చెందిన మొక్కలు విస్తృతంగా నాటే ప్రక్రియ మొదలైందన్నారు. ఆలయ ప్రాంగణం శోభాయమానంగా, ఆహ్లాదకరంగా కనిపించే రంగురంగుల పూల మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేవస్థానంలో ప్లాస్టిక్ రహితంగా వుంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దుర్గమ్మవారిని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మ ఆలయ ఇఓ వికె శీనా నాయక్ దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేద పండితులు వేదాశీర్వచనాలు పలికారు. మల్లేశ్వర స్వామివార్ల ఆలయ ప్రాంగణంలో గురువారం నవగ్రహ మండప పున: ప్రతిష్ట కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్, ఆలయ ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, మల్లేశ్వర శాస్త్రి, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, వేదపండితులు, అర్చకస్వాములు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఇఓ వికె శీనా నాయక్ రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వివరించారు. గురువారం ఇఓ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించగా రు. 4కోట్ల 11 లక్షల 96వేల 190లు లభించినట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. అలాగే 394గ్రాముల బంగారం, 8కెజిల 010 గ్రాముల వెండి కూడా భక్తులు శ్రీ అమ్మవారికి కానుకలుగా సమర్పించారని ఇఓ తెలిపారు. కార్యక్రమంలో భవానీ సేవాదారులు, దేవదాయ శాఖాధికారులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. పేరిట దుర్గమ్మవారి ఆలయంలో గురువారం కనకదుర్గానగర్, మహామండపం ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. మహామండపం పక్కన వున్న దేవతా వృక్షాల వద్ద శుభ్రం చేసి మొక్కలకు నీరు పెట్టారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దసరా, భవానీ దీక్షల్లో సేవలందించే ఎన్‌సిఇ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఈ సందర్భంగా ఇంద్రకీలాద్రిపై సేవలందించడం శ్రీ అమ్మవారి అనుగ్రహం వారికి పరిపూర్ణంగా అందుతుందని ఇఓ పేర్కొన్నారు.

# విద్య,మౌలికవసతుల కార్పొరేషన్‌ఛైర్మన్‌గా రాజశేఖర్ బాధ్యతలు

రాష్ట్ర విద్య, మౌలిక వసతుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా కుప్పం రాజశేఖర్ గురువారం విజయవాడ వడ్డేశ్వరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ప్రభుత్వ చీఫ్ విప్ జివి ఆంజనేయులు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జవహర్, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎండి షరీఫ్, పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ లో పరీక్షల తీరును పరిశీలిస్తున్న కన్వీనర్ ఆచార్య స్వామి

# ప్రశాంతంగా ఎడ్ సెట్ పరీక్ష- 21న ఫలితాలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూన్5, ప్రభాతవార్త:** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన ఎడ్ సెట్2025 పరీక్ష గురువారం ప్రశాంతంగా ముగిసిందని సెట్ కన్వీనర్ ఆచార్య ఎవివిఎస్.స్వామి తెలిపారు. మొత్తం 87 ఆన్‌లైన్ కేంద్రాలలో ఈ పరీక్షకు 14 609 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీన కీ విడుదల చేస్తామని వెల్లడించారు. ఫలితాలను 21వ తేదీన విడుదల చేస్తామని ప్రకటించారు.

# ఆర్డిటి విషయంలో ఢిల్లీ వీధుల్లో పోరాడుతా..

## - కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



**అనంతపురం, జూన్ 5 ప్రభాత వార్త బ్యూరో** ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆర్డిటి సేవలు వెల కట్టలేనివి. ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతులను కేంద్రం పునరుద్దరించే విధంగా అవసరమైతే ఢిల్లీకి వెళ్లి పోరాడుతామని, ఎమ్మెల్యేలు, ఎంపిలను ఢిల్లీకి తీసుకెళ్లేందుకు కూడా సిద్ధమని టిడిపి నేత, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వెల్లడించారు. మంత్రి పయ్యావుల కేశవ్‌తో కూడా చర్చించి ఢిల్లీలో కేంద్రం పెద్దలపై ఒత్తిడి తీసుకొచ్చి ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతులను వచ్చే విధంగా సర్వశక్తులు ఒడ్డుతానని ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్‌లు గట్టి ప్రయత్నం చేస్తున్నారని, అయితే కళ్యాణదుర్గంలో వైసిపి మాజీ ఎంపి తలారి రంగయ్య పాదయాత్ర పేరుతో రాజకీయ ఉనికి కోసం ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. దమ్ముంటే ఢిల్లీకి వెళ్లి ఆర్డిటి విషయంలో పాదయాత్ర చేయాలని వైసిపి నేత మాజీ ఎంపి తలారి రంగయ్యకు సవాల్ విసిరారు. స్థానిక రహదారులు, భవనాలు అతిథి గృహంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురంజిల్లాలో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డిటి)కి విదేశీ నిధులు రాకుండా ఎఫ్‌సిఆర్‌ఎ అనుమతులను 2021లోనే రద్దు చేసిందన్నారు. అప్పుడు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. తలారి రంగయ్య ఎంపిగా ఉన్నారని గుర్తు చేశారు. అప్పట్లోనే ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతులను పునరుద్దరించే విధంగా తలారి రంగయ్య ఎందుకు చర్యలు తీసుకోలేదు..? అప్పట్లో వైసిపి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఎందుకు ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతులను పునరుద్దరించలేదని ఎమ్మెల్యే సురేంద్ర బాబు ప్రశ్నించారు. అప్పట్లో కూడా వైసిపి వారికి కేంద్రం పెద్దలకు సంబంధాలు ఉన్నాయి కదా, అప్పట్లో ఎందుకు ఈ పనులు చేయలేకపోయారని ఆయన నిలదీశారు.

# పొలిటికల్ లీడర్స్‌లో జెంటిల్‌మెన్ నెట్టెం రఘురామ్

## -కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతల స్వీకరణలో నెట్టెంను ముక్తకంఠంతో శ్లాఘించిన కూటమి నేతలు

**జగ్గయ్యపేట, జూన్ 5, ప్రభాతవార్త :** నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితప్రస్థానంలో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా, జగ్గయ్యపేట తొలి మంత్రిగా పనిచేసి హుందాకు మరోపేరుగా రాజకీయాల్లో జెంటిల్‌మెన్‌గా అన్ని పార్టీల వారి అభిమానాన్ని చూరగొన్న మాజీమంత్రి, ఎన్‌టిఆర్‌జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్ గురువారం ఉమ్మడి కృష్ణాజిల్లా నుండి కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలను స్వీకరించారు. విజయవాడలో జరిగిన పదవీ బాధ్యతల స్వీకరణ, అభినందన సభలో కూటమి నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని రఘురామ్‌పట్ల తమకు గల ఆత్మీయ అనుబంధాలను నెమరువేసుకున్నారు. ఎన్‌టిఆర్ స్వయం నిర్ణయంతో పార్టీ టిక్కెట్టు ఇవ్వటం ద్వారా 1985 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన రఘురామ్ నాటి నుండి నేటి వరకు రాజకీయాల్లో విలువలు, హుందాతనానికి రోల్‌మోడల్‌గా నిలిచిన వైనాన్ని అభినందన సభలో నేతలు గుర్తుచేస్తూ సమకాలీన రాజకీయ నాయకులకు ఆదరా ్శన్ని రఘురామ్ అందిస్తున్నారని కొనియాడారు. గతంలో చంద్రబాబు కేబినెట్‌లో మద్యనిషేధ, ఆబ్కారీ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన రఘురామ్ తదనంతరం సుధీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్నా కేవలం కింగ్ మేకర్‌గానే వ్యవహరించారని పలువురు అభిప్రాయపడ్డారు. జగ్గయ్యపేట ఎంఎల్‌ఏగా శ్రీరాం రాజగోపాల్ మూడుసార్లు విజయం సాధించటంలో కూడా రఘురామ్ నిర్వర్తించిన పాత్ర మరువలేనిదని ప్రశంశించారు. హోదాకు తగిన పదవి కాకపోయినా సిఎం చంద్రబాబు, యువనేత నారా లోకేష్‌ల నిర్ణయాన్ని రఘురామ్‌ను అభిమానించే కేడర్ వ్యతిరేకించినా పార్టీ ఆదేశాన్ని శిరోధార్యంగా స్వీకరించిన రఘురామ్ ద్వారా ఆ పదవికే వన్నె వస్తుందని పలువురు నిస ్సంకోచంగా సభలో వ్యక్తంచేశారు.

# ఎటువంటి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధమై ఉండాలి : సిఎస్



కలెక్టర్‌ను, ఎమ్మెల్యే పరిటాల సునీతను సన్మానిస్తున్న దృశ్యం

**సచివాలయం, జూన్ 5,ప్రభాతవార్త :** రాష్ట్రంలో నైరుతీ రుతుపవన కాలంలో సంభవించే తుఫానులు,వరదలు ఎటువంటి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖలు తగిన కార్యాచరణ ప్రణాళికలతో సర్వసన్నద్ధమై ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆయా శాఖాధికారులను ఆదేశించారు. మాన్‌సూన్ సన్నద్ధతపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన వివిధప్రభుత ్వ శాఖలతోపాటు ఇండియన్ ఆర్మీ,నేవీ,ఎయిర్‌ఫోర్సు ్స,కోస్టుగార్డు,ఎన్డిఆర్ఎఫ్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ తుఫానులు,భారీ వర్షాలు,వరదలు వంటివి సంభవించినప్పుడు ఆస్తి,ప్రాణ,నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించే ప్రయత్నంతో పాటు సకాలంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పే విధంగా ఆయా శాఖల వారీ ప్రణాళికలతో సన్నద్ధమై ఉండాలని స్పష్టంచేశారు.మున్సిపల్ పరిపాలన శాఖ పట్టణ ప్రాంతాల్లోని డ్రైన్లు,కాల్వల్లో పూడిక తీత పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు.ఇంధన శాఖ తగిన సంఖ్యలో స్టాండ్‌బై జనరేటర్లు,ట్రీకట్టర్లు,విద్యుత్ స్థంభాలు సిద్దంగా ఉంచుకోవాలన్నారు.నీటి ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రభల కుండా తగిన ముందు జాగ్రత్త చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించే చర్యలు తీసుకోవాలని చెప్పారు.పౌరసరఫరాల శాఖ తగిన మేరకు వివిధ నిత్యావసర సరుకులను ఆయా ఎంఎల్‌సి పాయింట్లలో స్టాకులు అందుబాటులో ఉంచాలని చెప్పారు.ఆర్మీ,నేవీ,ఎయిర్‌ఫోర్సు ్స,కోస్టుగార్డు,ఎన్డిఆర్ఎఫ్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలతో వివిధ విపత్తులు సంభవించినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎనలేని సేవలు అందిస్తున్నాయని కొనియాడుతూ రాబోయే రోజుల్లో కూడా అదే

# టిడిపి నేత సుధాకర్ నాయుడు హత్యకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరుల కుట్ర!

**అనంతపురం, జూన్ 5 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులు టిడిపి నేత లిక్కర్ డాన్‌గా గుర్తింపు ఉన్న సుధాకర్‌నాయుడుని హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు తెలియవచ్చింది. సుధాకర్‌నాయుడుని హత్య చేసేందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు రెక్కి కూడా నిర్వహించినట్లు పోలీసులదర్యాప్తులో తేలినట్లు విశ్వసనీయ సమాచారం. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి నేత సుధాకర్‌నాయుడుని టిడిపి అధిష్టాన వర్గం అమరావతికి పిలిపించి బుధవారం రోజు ఇద్దరికి కోటింగ్ ఇచ్చింది. టిడిపి రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ రవీంద్ర ప్రత్యేకంగా ఇద్దరిని కూర్చోబెట్టుకుని ఇద్దరు విబేదాలు వీడనాడి పార్టీ కోసం కలిసి పని చేయాలని హెచ్చరికలు చేసి సర్ది చెప్పి పంపినట్లు తెలియవచ్చింది. ఈ సంఘటన భహిర్గతం కావడంతో ఆలస్యంగా జరిగిన గొడవలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. వివరాలలోకి వెళ్తే.. రాష్ట్రస్థాయి ఇంటెలిజెన్స్ అధికారుల బృందానికి విశ్వసనీయ సమాచారం అందింది. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులు అనంతపురం టిడిపి నేత సుధాకర్‌నాయుడుని హత్య చేసేందుకు కుట్ర పన్నుతున్నారని పక్కా సమాచారం అందింది. ఆ సమాచారాన్ని ఇంటెలిజెన్స్ ముఖ్యులు అనంతపురం జిల్లా ఎస్పీ డి.జగదీష్‌కు చేరవేయడంతో ఎస్పీ నేతృత్వంలోని అధికారుల బృందం అలర్ట్ అయింది. జిల్లా ఎస్పీ తాజా దర్యాప్తులో కూడా ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు భూదందాలకు, దౌర్జన్యాలకు దిగుతున్నారని, ఫిర్యాదుల్లో వచ్చినట్లు సమాచారం. ఇదే సమయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు, సమీప బంధువులు కొందరు మద్యం సేవించి సుధాకర్‌నాయుడుని హత్య చేసే విషయాన్ని చర్చించుకున్నట్లు ఆ విషయం ఇటు పోలీసులకు, అటు సుధాకర్‌నాయుడుకు సమాచారం లీకైనట్లు తెలియవచ్చింది. అయితే అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికార పార్టీలో ఉండటంతో భూ తగాదాల విషయంలో ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకునే విషయంలో పోలీసు అధికారులు నాన్చుతూ వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయి ఇంటెలిజెన్సీ అధికారులు తాజాగా ఇచ్చిన సమాచారం ప్రకారం ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు, టిడిపినేత సుదాకర్‌నాయుడును హత్యకు కుట్ర పన్నుతున్నారని సమాచారాన్ని చేరవేయడంతో జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేకంగా టిడిపి నేత సుధాకర్‌నాయుడుని, ఆయన సతీమణిని జిల్లా ఎస్పీ కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడినట్లు జరిగిన సంఘటనలను ఆరాతీసినట్లు తెలియవచ్చింది. ఇందులో భాగంగా తన దర్యాప్తులో వెల్లడైన విషయాలను రాష్ట్రస్థాయి పోలీసు ఉన్నతాధికారులకు చేరవేయడంతో టిడిపి అధిష్టాన వర్గం స్పందించి, టిడిపి రాయలసీమ ఇన్‌చార్జ్‌రవీంద్రద్వారా వారిద్దరిని పిలిపించి చర్చించినట్లు తెలియవచ్చింది. ఈ విషయంలో ఇటు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కానీ, అటు టిడిపి నేత సుధాకర్‌నాయుడుకానీ బహిరంగంగా వ్యాఖ్యలు చేయలేదు. గురువారం మీడియాలో, సోషల్‌మీడియాలో వార్తలు గుప్పుమన్నాయ

# వేరుసెనగ విత్తనం నాణ్యతగా ఉంటేనే తీసుకోండి

## - కలెక్టర్‌తో కలిసి వేరుసెనగ విత్తన పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే పరిటాల సునీత



: కలెక్టర్, ఎమ్మెల్యే సునీతకు సన్మానం

**అనంతపురం, జూన్ 5 ప్రభాతవార్త బ్యూరో** ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వేరుసెనగ విత్తనం నాణ్యతను ఒకటికి రెండు సార్లు పరిశీలించి తీసుకోవాలని.. ఎక్కడైనా నాణ్యత లోపిస్తే వెంటనే వెనక్కు ఇవ్వాలని రైతులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం, పంపనూరు రైతుసేవా కేంద్రంలో రైతులకు విత్తన వేరుశెనగ పంపిణీని ఆమె జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. ఇటీవల చెన్నేకొత్తపల్లిలో వేరుసెనగ విత్తనం గోదాంని పరిశీలించినప్పుడు.. ఒకే బస్తాలో ఐదారు రకాలు కలిసి ఉందని ఆలోడ్ వెంటనే వెనక్కు పంపినట్టు చెప్పారు. రైతులు కూడా నాణ్యత చూసుకుని తీసుకోవాలని ఈ విషయంలో ఎక్కడా రాజీపడవద్దని సూచించారు. జిల్లాకు ఇప్పటి వరకు 50వేల క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని రైతుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విత్తనం త్వరగా తెప్పించాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే వేరుసెనగ సాగు చేసే రైతులు మాత్రమే విత్తనం తీసుకోవాలని..

దానిని బయట మార్కెట్లో విక్రయించాలని చూడవద్దన్నారు. ప్రభుత్వం ఎంతో ఖర్చు భరిస్తూ సబ్సిడీ పై విత్తనం అందిస్తోందన్నారు. ఇలాంటి సమయంలో దీనిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మరోవైపు పలు అంశాల పై జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే సునీత వినతిపత్రం అందజేశారు. ఆత్మకూరు మండలంలో తోపుదుర్తి రిజర్వాయర్ కోసం 700 ఎకరాల భూసేకరణ చేయాలని గతంలో ప్రయత్నం చేశారన్నారు. కానీ అక్కడ రిజర్వాయర్ నిర్మించలేదన్నారు. ఆ రైతులకు బ్యాంకుల్లో లోన్ల విషయంలో బ్యాంకర్లు పెండింగ్‌లో ఉంచారన్నారు.

# అమృతపథకంలో అవినీతి జరిగిందని నిందలు వేయడం సరికాదు

## ఎమ్మెల్యే దగుమాటిపై విరుచుకుపడ్డ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

**కావలి, జూన్05 ప్రభాతవార్త** ప్రస్తుత కావలి ఎమ్మెల్యే, ఆనాటి కాంట్రాక్టర్ దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్‌కు సంబంధించి 350 కోట్ల రూపాయల పెద్ద కాంట్రాక్ట్ ఇప్పించా, ఈ కాంట్రాక్ట్‌కు సంబంధించి ఎంత కమీషన్ నాకు ఇచ్చావో నీ బిడ్డలపై ప్రమాణం చేసి బహిరంగంగా చెప్పాలని వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల ఎమ్మెల్యే దగుమాటి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ మండిపడ్డారు. గురువారం మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృతపథకంలో అవినీతి జరిగిందని, ఈ కాంట్రాక్ట్‌లో కమీషన్లు ముట్టాయని నిందలువేయడం సరికాదని దమ్ము, ధైర్యం ఉంటే విచారణ చేయించి నిరూపించాలని ప్రతాప్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ పథకానికి సంబంధించి నిధులు తెచ్చింది బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్రలు అని



# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి



8లో



8లో

## వీఎంఆర్డీయే చైర్మన్‌ను సత్కరించిన డిప్యూటీ మేయర్

# విశాఖ రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌ను నియమించిన కేంద్ర ప్రభుత్వం

## మరోసారి ఫలించిన ఎంపీ శ్రీభరత్ కృషి -నెరవేరుతున్న విశాఖ వాసుల కల



విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త

విశాఖ వాసులకు కేంద్ర ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. విశాఖ కేంద్రంగా ఏర్పడనున్నవిశాఖ రైల్వే జోన్ కు జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథూర్ ప్రస్తుత పీడీ (సిగ్నల్ మాడర్నైజేషన్)/రైల్వే బోర్డ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది.

**ఫలించిన ఎంపీ శ్రీభరత్ కృషి**

విశాఖ కేంద్రంగా ఏర్పడనున్నవిశాఖ రైల్వే జోన్ కు జనరల్ మేనేజర్ ను నియమించాలి అని జనవరి 21 వ తేదీన విశాఖ ఎంపీ శ్రీభరత్ రైల్వే మినిస్టర్ కు లేఖ ద్వారా వివరించారు. విశాఖ రైల్వే జోన్ కు సంబంధించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి అంటే ఖచ్చితంగా జనరల్ మేనేజర్‌ను నియమించాలి అని ఎంపీ శ్రీభరత్ లేఖ ద్వారా విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం లేఖ కు స్పందిస్తూ విశాఖ రైల్వే జోన్ కు జనరల్ మేనేజర్ ను ఈ సందర్భంగా నియమించింది.

**విశాఖ వాసుల కల తీరనుంది. - విశాఖ ఎంపీ శ్రీభరత్**

విశాఖ రైల్వే జోన్ ప్రతి విశాఖ వాసి కల అని, అది తీరేందుకు కృషి చేస్తున్నాను అని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. ఇప్పటికే వాల్తేరు డివిజన్ తో కూడిన రైల్వే జోన్ మనకు సాకారమైంది అని, అంతే కాకుండా త్వరితగతిన గజెట్ నోటిఫికేషన్ కూడా వచ్చేలా కృషి చేస్తానని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ డీఆర్యూసీసీ మెంబెర్ చలసాని గాంధీ, మరియు ఇతర రైల్వే సంఘ నాయకులు ఎంపీ శ్రీభరత్ కు తమ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలి

డిమాండ్ లేకుంటే ఉత్పాదన తగ్గుతుంది. అందువల్ల ప్రజలు ప్లాస్టిక్ వినియోగం నిషేధించాలి : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



8లో

## దక్షిణ కోస్తా రైల్వేకి మొదటి జిఎం నియామకం

8లో





# జూలై 09, 10వ తేదీల్లో సింహాచలం గిరి ప్రదక్షిణ





8లో

సీపీ, జేసీ ఇతర అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్ -ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని, బాధ్యతగా ఉండాలని హితవు -జాతీయ రహదారి దాటే చోట తాత్కాలిక ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని కలెక్టర్, సీపీ నిర్దేశం

## తూర్పు తీరంలో సముద్ర ఆహార విలువ జోడింపుపై అంతర్-రాష్ట్ర నైపుణ్య ఒలింపియాడ్ ప్రాథమిక రౌండ్



8లో

బల్క్ డ్రగ్స్ పనులను పరిశీలించిన

## పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి "యువరాజ్"



8లో

## జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దడంలో అందరి భాగస్వామ్యం

సచివాలయ స్థాయిలో సూక్ష్మ ప్రణాళికలు : జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ -త్వరలో అంతర్ రాష్ట్ర సమావేశం: డి.ఐ.జి గోపీనాథ్ జెట్టి



8లో

## పాలిథిన్ వాడకం విషం కంటే ప్రమాదం

-జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్



8లో

## విశాఖలో 14ఏళ్ల బాలుడికి కరోనా

8లో

జాతీయ రహదారిపై "ప్రాణాల"తో చెలగాటం..

# తప్పెవరిది??

..నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రజలదా? ..పట్టించుకోని పోలీసులుదా?

నిర్లక్ష్యం నిండు ప్రాణాలకు "పాశం"విసురుతోంది... ప్రమాదం చాటున కాటు వేసేందుకు మాటు వేస్తోంది... బద్ధకమో... బాధ్యతారాహిత్యమో? లేదా తమకేమీ కాదన్న టెంపరితనమో? వెరసి నిండు జీవితం అర్ధాంతరంగా ముగిసేందుకు దోహదం చేస్తున్న వైనంపై "ప్రభాతవార్త"అందిస్తున్న ప్రత్యేక కథనం...



8లో

## కూటమి ప్రభుత్వంలో అందరికీ సమన్యాయం..

వైసీపీ సర్పంచ్ నూకరాజుకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత... ముఖ్యమంత్రి వెన్నుపోటు అంటూ ర్యాలీ.. పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ అందుకున్న వ్యక్తి ఏమనాలి.. ఎమ్మెల్యే సుందరపు



8లో

# గీతంలో ఘనంగా పర్యావరణ దినోత్సవం



ప్లాస్టిక్ రహిత జీవన విధానం ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి..

## ప్రత్యేక ఆర్థిక మండలిలో పర్యావరణ దినోత్సవ వేడుకలు





8లో

## కూటమి ప్రభుత్వంలో అందరికీ సమన్యాయం..

ఎలమంచిలి, జూన్ 5, ప్రభాతవార్త

రాష్ట్రంలో గత సంవత్సరం సార్వత్రిక ఎన్నికల ముగిసేక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు అంతా ఒకటే అని పార్టీలకు సంబంధం లేకుండా ఎవరికైనా ఆపదలో ఉంటే ఆదుకునే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని ఎమ్మెల్యే సుందర్పు విజయకుమార్ అన్నారు. పట్టణములోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం తత్విక సమావేశాన్ని ఎమ్మెల్యే సుందర విజయకుమార్ ఏర్పాటు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందర్ విజయకుమార్ మాట్లాడుతూ బుధవారం వైసీపీ సర్పంచ్ అయిన నూకరాజు వెన్నుపోటు దినోత్సవం అంటూ ర్యాలీల నిర్వహించి రికార్డులు పట్టుకున్నాడని, ఇదే సర్పంచ్ నూకరాజుకు ఆరోగ్యం బాగోకపోతే చాలా దీన పరిస్థితుల్లో ఉన్నానంటూ వైద్యం చేయించుకోవడానికి డబ్బులు కూడా లేవంటే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకునే ప్రయత్నం చేశామని సీఎం రిలీఫ్ ఫండ్ అందుకున్నాక ఇప్పుడు వెన్నుపోటు దినోత్సవం అంటూ రోడ్డు ఎక్కడం ఏమిటి అంటూ ఎవరు ఎవర్ని వెన్నుపోటు పొడిచారు అనేది ఒకసారి గుర్తుంచుకోవాలని అన్నారు. నియోజవర్గంలోని గత ప్రభుత్వంలోని తెలుగుదేశం జనసేన బిజెపి కార్యకర్తలను ఎన్నో ఇబ్బందులు పాలు చేశారని వాటిని ఏమి దృష్టిలో ఉంచుకోకుండా అందరూ సమానం అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో అందరితో సమానంగా ఉంటున్నామని కానీ సీఎం రిలీఫ్ ఫండ్ అందుకున్న వ్యక్తి ఏమి అందుకోలేని వ్యక్తిగా వెన్నుపోటు దినోత్సవం లో పాల్గొనడం ఎంతవరకు సమంజసమని ఒక్కసారి అందరూ ఆలోచించాలని అన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో పదవులు అనుభవించిన వారు కూడా ఇప్పుడు మాకు ఈ పలానా పనిచేయండి అంటూ వస్తున్నారని వారిని ఎవరిని అవహేళన చేయడం లేదని అందరికీ ఒకే న్యాయమని నియోజకవర్గంలోనే అందర్నీ కలుపుకుంటూ వెళ్తున్నానని, కానీ సహాయం పొందిన వ్యక్తి ఇలా చేయడం ఏమిటని ప్రశ్నించారు. జనసేన పట్టణ పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు అన్నం బాబ్జి, మాజీ ఎంపీపీ పిట్టా శ్రీనివాసరావు, జనసేన నాయకులు ఉటకూటి రమేష్ నాయుడు, లాలం సోమనాయుడు, పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నర్సీపట్నం, జూన్ 5, ప్రభాతవార్త

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టం గ్రామంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ ఆధ్వర్యంలో, సోషల్ ఫారెస్ట్రీ విభాగం సహకారంతో, బలిఘట్టం నుండి ధర్మసాగరం వరకు రోడ్డు పక్కన 800 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డ్ కౌన్సిలర్ పద్మావతి పాల్గొని మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ "పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత. ప్రతి ఒక్కరూ తన నివాస పరిసరాల్లో కనీసం ఒక్క మొక్క నాటి, దానిని సంరక్షించాలి. నేటి తరానికి, రేపటి భవిష్యత్తు తరాలకు పచ్చదనం అందించేందుకు ఈ మొక్కలే ఆధారము అని పేర్కొన్నారు. గవిరెడ్డి వెంకటరమణ మాట్లాడుతూ "గ్రామంలోని ప్రతి వార్డులోనూ పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్ రేంజర్ సుబ్బారావు, తహసీల్దార్ రామారావు, మునిసిపాలిటీ డి.ఈ.కామేశ్ రావు, జనసేన పట్టణ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ పాల్గొన్నారు.

## గీతంలో ఘనంగా పర్యావరణ దినోత్సవం

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గీతం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా పాల్గొని గీతం ఆవరణలో మొక్కలు నాటారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే హాని గమనించి ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలన్నారు. హరిత ప్రాంగణంగా గీతం కు గల జాతీయ స్థాయి పేరును పెంచేలా సౌర విద్యుత్ ఉత్పత్తి, వాన నీటి సంరక్షణ, వ్యర్థాల శుద్ధి సమర్ధంగా చేపడతామన్నారు. పర్యావరణ పరిరక్షణకు పరిశ్రమలతో పాటు ప్రజలు ముందుకు రావాలని అలాగే ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం అవసరమన్నారు. గీతం సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత జీవన విధానం ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలన్నారు. భవిష్యత్తు తరాలు సురక్షిత ఆవరణ వ్యవస్థలో జీవనం సాగించాలంటే ప్లాస్టిక్ వాడకం క్రమేపి తగ్గించుకోవా లన్నారు. గీతం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరెక్టర్ కె.నాగేంద్రప్రసాద్, జీవశాస్త్ర విభాగాల అధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, గీతం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.సురేష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్మయిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

## ప్రత్యేక ఆర్థిక మండలిలో ..

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త

విశాఖపట్నం ప్రత్యేక ఆర్థిక మండలంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని వీఎస్ఈజెడ్ యూనిట్లు, సీనియర్ అధికారులు, సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. జ్యాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్, రోష్ని అపరంజి కొరటి, యూనిట్ల అధిపతులు, యూనిట్ల ప్రతినిధులు, వీఎస్ఈజెడ్ సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనేక ప్రభావవంతమైన మొక్కలను నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా అన్ని యూనిట్ల ప్రాంగణంలో మొక్కలు నాటాలని మరియు మొక్కలను సరిగ్గా సంరక్షించాలని కోరారు. ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణం యొక్క ప్రాముఖ్యత మరియు మానవులపై పర్యావరణ క్షీణత ప్రభావం గురించి ఆమె నొక్కి చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె నొక్కి చెప్పారు. ఈ సంవత్సరం "బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్" అనే థీమ్ గురించి కూడా జ్యాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడటానికి, రక్షించడానికి యూనిట్లకు పిలుపునిచ్చారు. చెత్త తొలగింపు, పొడి, వ్యర్థాలను విభజన/ప్రమాదకరం/ప్రమాద రహిత కాని వాటిని వేరు చేయడానికి మరియు వాటిని సరిగ్గా పారవేయడానికి యూనిట్లు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాలని కూడా ఆమె కోరారు. జోన్ను గ్రీన్ అండ్ క్లీన్ జోన్‌గా మార్చడానికి అభివృద్ధి కమిషనర్ గొప్ప ప్రయత్నాలు చేస్తున్నారని ఆమె అన్నారు. ఆమె యూనిట్లు మరియు నిర్వహణకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు."

## జాతీయ రహదారిపై "ప్రాణాల"తో చెలగాటం..

గోపాలపట్నం, జూన్ 5, ప్రభాతవార్త

విశాఖ నగరంలోని హైవే ప్రయాణం ఎంత స్పీడ్‌గా, మరెంత రద్దీగా ఉంటుందో చెప్పనక్కర్లేదు. సుమారుగా 70 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లే వాహనాల వల్ల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేలా కొన్ని ప్రామాణికాలను నిర్దేశించి రహదారులను ఏర్పాటు చేశారు. అయితే కొందరు ద్విచక్ర వాహనదారులు ఈ ప్రామాణికాలను యదేచ్ఛగా ఉల్లంఘించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వాస్తవానికి హైవే రహదారి ఇరుపక్కలను (సర్వీసు రోడ్లను) అనుసంధానం చేస్తూ పాదాచారుల సౌలభ్యం కోసం కొన్ని ప్రాంతాలలో డివైడర్లను అలాగే ఉంచి వాటి పైన ఒక ఇనుప నిరోధకాలను ఏర్పాటు చేశారు. హైవేపై జీబ్రా క్రాసింగ్ మార్గలను కూడా ఏర్పాటు చేశారు. ఈ విధంగా పాదాచారులు మరే దూరం నడవాల్సిన అవసరం లేకుండా ఉండేలా ఈ చర్యలు చేపట్టారు. కానీ కొందరు ద్విచక్ర వాహనదారులు ఈ డివైడర్ల పైనుంచి వాహనాలను పోనిస్తూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. డివైడర్ల అంచులను పతనం చేస్తూ తమ వాహనాలను అడ్డదిడ్డంగా పోనిస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై అతి వేగంగా వచ్చే వాహనాలకు వీరు అడ్డుపడుతున్నారు. అకస్మాత్తుగా, ఊహించని విధంగా హైవేపై దూసుకొస్తున్న ద్విచక్ర వాహనదారుల వల్ల భారీ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రాణ నష్టం సంభవించిన దుర్ఘటనలు అనేకం. వేగంగా జాతీయ రహదారిపై ప్రయాణించే భారీ వాహనాలు వీరిని తప్పించబోయి బోల్తాపడిన సంఘటనలు కోకొల్లలు. ఈ తరహా ప్రమాదాలు బిర్లా జంక్షన్ నుంచి తాటి చెట్ల పాలెం జంక్షన్ మధ్యలో విరివిగా చోటు చేసుకోవడం గమనార్హం.

### ఉక్కు నిరోధకాలను తొలగించేస్తున్న వైనం...

పాదాచారుల సౌలభ్యం కోసం ఏర్పాటుచేసిన ఈ తరహా డివైడర్లపై ద్విచక్ర వాహనదారులు ప్రవేశించకుండా ఉండేలా అడ్డంగా ఉక్కు నిరోధకాలను ఏర్పాటు చేశారు. అయితే కొందరు స్థానిక వాహన చోదకులు స్టీల్ రాడ్లను తొలగించేయడం అత్యంత దారుణం. రాకపోకలకు అడ్డుగా ఉన్న రాడ్లను తొలగించి స్క్రాప్ కు అమ్ముకుంటున్న సదరు స్థానిక ద్విచక్ర వాహనదారులు తామెంత తప్పుడు పని చేస్తున్నామన్న గ్రహించలేకపోతున్నారు. అందువల్ల మరొకరి ప్రాణాలకు ముప్పు వాటిల్లేందుకు కారణమవుతున్నామన్నది ఆలోచించకపోవడం అమానవీయం.

### నివారణ మార్గాలు...

సదరు ఓపెన్ డివైడర్ల వద్ద భారీ బరువు ఉన్న కాంక్రీట్ దిమ్మలను ఏర్పాటు చేయడం శాశ్వత పరిష్కారానికి ఏకైక మార్గం. లేదా కేవలం పాదాచారులకు మాత్రమే వెసులుబాటు కలిగేలా పక్కపక్కనే సిమెంట్ గోడలను నిర్మించడం సరైన చర్యన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాహన చోదకులను అదుపు చేయాలంటే [illegible] ఈ విధంగా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

## పాలిథిన్ వాడకం విషం కంటే ప్రమాదం

నక్కపల్లి, ప్రభాతవార్త

ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు ఉపయోగించడం వలన మనం చాలా ప్రమాదకరమైన పరిస్థితులను కొని తెచ్చుకుంటున్నామని, పర్యావరణానికి తీవ్ర విఘాతం కల్గిస్తాయని, వీటిని వాడటం వలన విషం కంటే ప్రమాదకరమైన పరిస్థితులను తెచ్చుకుంటున్నామని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ అన్నారు. మండలంలోని పెదబోదిగల్లం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ దినోత్సవ కార్యక్రమం ఘనంగా ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పరిశ్రమలశాఖ రాష్ట్ర సెక్రటరీ (సీనియర్ ఐఏఎస్) యువరాజ్, కలెక్టర్ విజయ్ కృష్ణన్‌లు కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మార్కెట్లకు వెళ్లినప్పుడు చేతి సంచి, లేదా నూలుతో తయారు చేసిన బ్యాగులు తీసుకెళ్లాలని సూచించారు. సూసైడ్ చేసుకున్న వారు ఒక్కరే చనిపోతారని, పాలిథిన్ కవర్లు ఎక్కువ గా వినియోగిస్తే స్లో పాయిజన్ ఆ భూతం మానవాళిని కబళిస్తుందని చెప్పారు. ఉమ్మడివిశాఖ జిల్లాపూర్వపు కలెక్టర్ యువరాజ్, కలెక్టర్ విజయ్ కృష్ణన్ లను సర్పంచ్ మున్నీషా బేగం, ముస్లిం మత పెద్దలు సత్కరించారు. కార్యక్రమంలో డీ ఎఫ్ వో లక్ష్మణ్, సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సునీల్ కుమార్, రేంజ్ ఆఫీసర్ అనిల్ కుమార్, నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, ఆర్డీవో వీవీ రమణ, తహసీల్దార్ ఆర్. నర్సింహమూర్తి, ఎంపీడీవో డీ సీతారామరాజు, ఫారెస్ట్ సిబ్బందితోపాటు గార్డ్ లు తదితరులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటిన కలెక్టర్

పెదబోదిగల్లం వద్ద కారిడార్ నిర్వాసిత రైతులకు కేటాయించిన లే -అవుట్ల వద్ద కలెక్టర్ విజయ్ కృష్ణన్, పరిశ్రమలశాఖ రాష్ట్ర సెక్రటరీ యువరాజ్, డీఎఫ్ వో లక్ష్మణ్, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, కూటమి నాయకులు వెలగా శ్రీను, వైబోయిన రమణ, వెలగా సుధాకర్, కోసూరి శ్రీను, దార్ల కృష్ణ, పెదపూడి శంకరరావు తదితరులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. విరివిగా మొక్కలు పెంచాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ మొక్కలను పెంచే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని కలెక్టర్‌తో పాటు నర్సీపట్నం ఆర్డిఓ వీవి రమణ గ్రామస్తులకు కోరారు. వీరితోపాటు మండల స్థాయి అధికారులు శ్రీనివాసరావు, నాగభూషణం, భాగ్యలక్ష్మి, డిటి నారాయణరావు, ఎంపీటీసీ గొర్ల దుర్గ, గోవిందు మత పెద్దలు ఉన్నారు.

## ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలి

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త

పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం స్థానిక ఆర్కే బీచ్ కాళీమాత టెంపుల్ వద్ద నుండి ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకు గ్రీన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశముల మేరకు అటవీశాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, జీవీఎంసీ తదితర శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా విశాఖ జిల్లాలో దాదాపు 5 లక్షల మొక్కలను నాటే కార్యక్రమం ప్రారంభించి చేపట్టబోతున్నామన్నారు. జిల్లాలో మిలియన్ ప్లస్ మొక్కలను నాటడం టార్గెట్‌గా నిర్ణయించుకున్నామని, అందులో భాగంగా విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్, వీఎంఆర్డీఏ, అటవీశాఖ, జీవీఎంసీ, హార్టికల్చర్, డ్రామా తదితర ప్రభుత్వ శాఖల ద్వారా 10 లక్షల మొక్కలను నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ అన్నారు. మొక్కలను నాటడంతో పాటు వాటిని పరిరక్షించే బాధ్యత కూడా చేపట్టాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా స్వస్తి పలికి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని కోరారు. గుడ్డ లేదా నార సంచులను వినియోగించాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల మన కళ్ళకు కనపడని హాని జరుగుతుందని, అంతేకాకుండా క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులకు మూల కారణం కూడా అవుతుందని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రంలో పడటం వలన సముద్ర జీవరాసులకు ఎంతో నష్టం జరుగుతుందన్నారు. జీవీఎంసీ నుండి 6,000 మంది శానిటరీ సిబ్బంది నిరంతరం నగర పరిశుభ్రతకు కృషి చేస్తున్నారని తెలిపారు. డిమాండ్ లేకుంటే ఉత్పాదన తగ్గుతుందని అందువల్ల ప్రజలు ప్లాస్టిక్ నిషేదించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. మొక్కలు నాటేందుకు భాగస్వామ్యం అయిన దివీస్, లారా, కోరమండల్, మాట్రిక్స్, అలోవెరా తదితర పరిశ్రమల తో పాటు, వివిధ స్వచ్ఛంద సంస్థలు,వివిధ పరిశ్రమలకు చెందిన సభ్యులకు ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. గ్రీన్ ర్యాలీ ప్రారంభానికి ముందు పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఏయూ కన్వెన్షన్ సెంటర్లో జిల్లా కలెక్టర్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ అండ్ జూక్యూరేటర్ మంగమ్మ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, జీవీఎంసీ, అటవీ శాఖ, పోలీస్ శాఖ, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జూలై 09, 10వ తేదీల్లో సింహాచలం గిరి ప్రదక్షిణ

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త

ఆషాఢ పౌర్ణమి శుభ ముహర్తాన శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి గిరి ప్రదక్షిణ జూలై 09, 10వ తేదీల్లో నిర్వహించనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని, సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని గిరి ప్రదక్షణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలన్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై గురువారం సాయంత్రం జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులకుదిశానిర్దేశం చేశారు. ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తుల గిరి ప్రదక్షిణకు, స్వామి వారి దర్శనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త వహించాలన్నారు. భక్తులు జాతీయ రహదారిని దాటే చోట తాత్కాలిక ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్, సీపీ శంకబ్రత బాగ్చీ అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎన్.హెచ్.ఎ.ఐ. వారిని సమన్వయం చేసుకొని తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. క్యూలైన్లను పక్కాగా ఏర్పాటు చేయాలని, గాలి, వానలకు ఇబ్బంది లేకుండా చూడాలని పేర్కొన్నారు. సమీక్షలో భాగంగా జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై మాట్లాడారు. జూలై 09వ తేదీ తెల్లవారు ఝాము నుంచి 10వ తేదీ సాయంత్రం వరకు దర్శనాలు ఉంటాయని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొండదిగువ తొలిపావంచా వద్ద భక్తులను, ట్రాఫిక్ ను క్రమబద్దీరించేందుకు పోలీస్ బందోబస్తు, పోలీస్ శిబిరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, తోపు లాటలు లేకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగు దొడ్లు, ద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, ముందుగానే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ ఈఓ సూచనల మేరకు అవసరమైన అంబులెన్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు ఒక వైద్యుడు, ఏఎన్ఎం లేదా ఆశా వర్కర్లను శిబిరాల వద్ద ఉంచాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. భక్తులు ప్రదక్షిణ చేసే ప్రాంతాలతో పాటు రద్దీ ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ కొనసాగాలని, అవసరమైన మేరకు జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అప్పుఘర్ వద్ద అధిక సంఖ్యలో భక్తులు స్నానాలు చేయు సమయంలో ఏ విధమైన నీటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు మైక్ ద్వారా జాగ్రత్తలు చెప్పాలని, గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచాలన్నారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన బస్సులను నడపాలని ఆర్.టి.సి అధికారులకు సూచించారు. స్వామి వారి కొండపై అగ్ని మాపక యంత్రం, ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని చెప్పారు. అదనపు టిక్కెట్ కౌంటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యుదీకరణ చేయాలని, ఎల్ఈడీ లైట్లను అమర్చాలని, జనరేటర్లను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారు లను కలెక్టర్ ఆదేశించారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. సూచిక బోర్డులను పెట్టాలన్నారు. బస్ ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు భక్తులకు ఇబ్బంది లేకుండా బారికేడింగ్ తో కూడిన క్యూలైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. మ్యాన్ హోల్స్ ఉంటే గుర్తించి చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. స్టాల్స్ పెట్టుకునే వారికి ముందుగానే అనుమతి ఇచ్చి.. సంబంధిత మార్గదర్శకాలు జారీ చేయాలని, భక్తులు నడవడానికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో భాగంగా ప్రధాన అర్చకులు వైదిక కార్యక్రమాల షెడ్యూల్ ను వివరిం చారు. జూలై 09వ తేదీ ఉదయం నుంచి దర్శనాలు మొదలవుతాయని, ఆ రోజు మధ్యాహ్నం 2.00 గంటలకు ప్రచార రథయాత్ర ప్రారంభమవుతుందని, తొలి పావంచా వద్ద కొబ్బరి కాయ కొట్టడం ద్వారా గిరి ప్రదక్షిణ మొదలవుతుందని పేర్కొన్నారు. 10వ తేదీ సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగుతాయని, ఆ రోజే స్వామి వారికి నాలుగో విడత చందనోత్సవం జరుగుతుందని వివరించారు.

### 32 కి.మీ. మేర గిరి ప్రదక్షిణ... భక్తులకు ఇబ్బంది లేకుండా వసతులు

ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావు మాట్లాడుతూ యంత్రాంగం సహకారంతో కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం తరపున చర్యలు చేపడుతున్నామని దానిలో భాగంగా గుర్తించిన 28 ప్రదేశాల్లో 290 తాత్కాలిక టాయిలెట్లు, 129 శాశ్వత టాయిలెట్లు, జీవీఎంసీ ఆధ్వర్యంలో మరొక 29 శాశ్వత టాయిలెట్లు, 31 వైద్య శిబిరాలు, 6 ప్రధాన ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కొండపైన 170, దిగువన 58 సీసీ కెమెరాలు ఉన్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మరిన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. తొలి పావంచా వద్ద అవసరానికి తగిన విధంగా కొబ్బరి కాయలు కొట్టేందుకు కౌంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ఏడీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, సింహాచలం దేవస్థానం ఆలయ ఈఓ త్రినాథరావు, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవో సంగీత్ మాథుర్, వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో 14ఏళ్ల బాలుడికి కరోనా

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త

విశాఖలోని కేజీహెచ్ న్యూరోసర్జరీ వార్డులో చికిత్స పొందుతున్న 14ఏళ్ల బాలుడికి బుధవారం కొవిడ్ పాజిటివ్గా తేలింది అనుమానాస్పద లక్షణాల నేపథ్యంలో పరీక్షలు జరిపిన వైద్యులు ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నారు. బాలుడి ఆరోగ్యం ఆరోగ్యం ప్రస్తుతం మెరుగ్గా ఉందని వైద్యులు ప్రస్తుతం మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు. 50పడకల ఐసోలేషన్ వార్డుతో పాటు కిట్లు మందులు సిద్దంగా ఉన్నాయని వెల్లడించారు.

## తూర్పు తీరంలో సముద్ర ఆహార విలువ జోడింపుపై..

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త

విశాఖపట్నంలో సముద్ర ఆహార ప్రాసెసింగ్ నిపుణుల కోసం ఎం.పి.ఈ.డి.ఎ మొట్టమొదటిసారిగా అంతర్-రాష్ట్ర నైపుణ్య ఒలింపియాడ్ ఆన్ సీఫుడ్ వాల్యూ అడిషన్ ప్రిలిమినరీ రౌండ్‌ను తూర్పు తీరంలో నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ఎంపిఇడిఎ కార్యదర్శి అనిల్‌కుమార్ పి.దీపం వెలిగించి ప్రారంభించారు. భారతదేశ సముద్ర ఆహార రంగాన్ని అభివృద్ధి చేయడంలో నైపుణ్యాభివృద్ధి మరియు విలువ జోడింపు కీలక పాత్రను ఆయన నొక్కి చెప్పారు. ఇది భారత ప్రభుత్వ విక్షిత్ భారత్ 2047 దార్శనికతకు అనుగుణంగా ఉందని అన్నారు. సముద్ర ఆహార ప్రాసెసింగ్‌లో నైపుణ్యాలను పెంపొందించడం, శిక్షణ పొందిన నిపుణుల సమూహాన్ని నిర్మించడం మరియు సముద్ర ఆహార ఉత్పత్తులలో నాణ్యత, విలువ జోడింపు గురించి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయవాడ ఎం.పి.ఈ.డి.ఎ జాయింట్ డైరెక్టర్ విజయ్ కుమార్ యారగల్ స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా ప్రసంగించిన వి. పద్మనాభం ఎం.డి. ఎస్.ఎస్.ఎఫ్, మాజీ సెయిల్ జాతీయ అధ్యక్షుడు, వైజాగ్ ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి. లక్ష్మణరావు, మహేశ్ నెక్కంటి సీఫుడ్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, విశాఖపట్నం ఆర్సీ సీఎంఎఫ్ఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్ డాక్టర్ జో కె.కిజకుడాన్ మరియు నాగహనుమాన్ ఫిష్ ప్యాకర్స్ సీఈవో యు.వి. రామకృష్ణ ఈ కార్యక్రమంలో అభినందనలు తెలిపారు. ప్రాసెసింగ్ టెక్నాలజిస్ట్ డాక్టర్ రమ్య కుమారి అండ్ కోటేశ్వర్, ఎం.పి.ఈ.డి.ఎ, రాష్ట్ర మత్స్య శాఖ, ఆంధ్రప్రదేశ్ నుండి ప్రధాన విలువ ఆధారిత ఎగుమతిదారుల నిర్వహణ అధికారులు పాల్గొన్నారు. తూర్పు తీరానికి చెందిన ఇరవై మంది నైపుణ్యం కలిగిన సముద్ర ఆహార నిపుణులు వైజాగ్‌లో జరిగిన ఇంటర్-స్టేట్ స్కిల్ ఒలింపియాడ్‌లో పాల్గొని రొయ్యలు, స్క్విడ్ అండ్ తిలాపియా నుండి 10 విలువ ఆధారిత సముద్ర ఆహార ఉత్పత్తులను తయారు చేశారు. సముద్ర ఆహార పరిశ్రమ మరియు మత్స్య సంస్థల నిపుణులతో కూడిన నలుగురు సభ్యుల ప్యానెల్ ఈ నైపుణ్య ఒలింపియాడ్‌ను మూల్యాంకనం చేసింది. ఈ ఒలింపియాడ్‌ను మత్స్య శాఖ, నియంత్రణ అధికారులు, పరిశోధకులు, ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ కార్మికులు మరియు విద్యార్థులు సహా కేంద్ర మరియు రాష్ట్ర సంస్థల అధికారులు వీక్షించారు. సీఫుడ్ వాల్యూ అడిషన్, ప్రిలిమినరీ రౌండ్ (జోన్ అండ్ ఈస్ట్ కోస్ట్) పై జరిగిన మొదటి ఇంటర్-స్టేట్ స్కిల్ ఒలింపియాడ్ విజేతలను ఎంపిఇడిఎ కార్యదర్శి ముగింపు కార్యక్రమంలో ప్రకటించారు. తరుణ్ కిషోర్ బెహెరా, అతాను చౌదరి, సంధ్యా రాణి పాలపర్తి, ప్రోబింగ్ చంద్ర గోష్, డి.అనిత మొదటి, ఇంటర్-స్టేట్ స్కిల్ ఒలింపియాడ్‌లో రెండవ, మూడవ, నాల్గవ మరియు ఐదవ స్థానాలను గెలుచుకున్నారు. సర్టిఫికెట్లు, మెమెంటోలు మరియు నగదు బహుమతిని అందుకున్నారు. స్కిల్ టెస్ట్‌లో పాల్గొన్న అన్ని సీఫుడ్ నిపుణులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌లను అందజేశారు. విలువ ఆధారిత సముద్ర ఉత్పత్తులను రుచి చూసే సెషన్‌తో ఈ కార్యక్రమం ముగిసింది. భారతదేశంలో తొలిసారిగా మత్స్య విలువ జోడింపు రంగంలోని నిపుణులను గుర్తించడానికి స్కిల్ ఒలింపియాడ్‌ను నిర్వహించినందుకు ఎం.పి.ఈ.డి.ఎకి పాల్గొన్నవారు. కృతజ్ఞతలు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎం.పి.ఈ.డి.ఎ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి నైపుణ్య శిక్షణల శ్రేణి దేశంలోని మత్స్య నిపుణులలో విలువ జోడింపు నైపుణ్యాన్ని మెరుగుపరచడంలో ప్రభావవంతంగా ఉందని, నైపుణ్య ఒలింపియాడ్‌ను నిర్వహించడానికి ఎం.పి.ఈ.డి.ఎ చొరవ నిపుణుల నైపుణ్యాన్ని పెంపొందించడంలో మరింత సహాయకరంగా ఉంటుందని మూల్యాంకన ప్యానలిస్టులు అభిప్రాయపడ్డారు. సముద్ర ఆహార నిపుణులు సంపాదించిన నైపుణ్యాలను సముద్ర ఆహార రంగం సంక్షేమం కోసం తరం నుండి తరానికి అందించాలని కార్యదర్శి ఎం.పి.ఈ.డి.ఎ తన ముగింపు వ్యాఖ్యలలో నొక్కి చెప్పారు. విలువ ఆధారిత సముద్ర ఉత్పత్తులను రుచి చూసే సెషన్‌తో ఈ కార్యక్రమం ముగిసింది.

## దక్షిణ కోస్తా రైల్వేకి మొదటి జిఎం నియామకం

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త

దక్షిణ కోస్తా రైల్వే మొదటి జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్ నియమితులయ్యారు. ఉత్తరాంధ్రవాసుల కల విశాఖ రైల్వే జోన్ రైల్వే జోన్ ప్రకటించిన తర్వాత గత ప్రభుత్వంలో స్థలం కేటాయించకపోవడంతో రైల్వే జోన్ ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైల్వే జోన్‌కి కావలసినంత భూమి ఏర్పాటు చేయడంతో పనులు వేగవంతం అయ్యాయి. ఇందులో భాగంగా జనరల్ మేనేజర్ నియామకం జరిగింది.

## బల్క్ డ్రగ్స్ పనులను పరిశీలించిన..

నక్కపల్లి, జూన్ 5, ప్రభాతవార్త

మండలంలోని రాజయ్యపేట, పెదతీనార్ల, కాగిత గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి పరిశ్రమలశాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి యువరాజ్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌తో కలిసి ఆ ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. బల్క్ డ్రగ్ సంబంధించి రాజయ్యపేట పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పలు నిర్మాణపనులను పరిశీలించారు. పెదతీనార్ల పరిసర గ్రామాల్లో ఏపీఐఐసీ సేకరించబోయే కొన్ని భూములను యువరాజ్ పరి శీలించారు. అవసరమైన అదనపు భూముల గురించి ఆరా తీశారు. ఆర్డీవో వీవీవీ రమణ వారికి పూర్తి స్థాయి వివరాలను తెలియజేశారు. తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి మండలంలో పలు వివరాలు మాట్లాడారు. ఇందుకు సంబంధించి మ్యాప్‌లను పరిశీలించారు. రాజయ్యపేట నుంచి అమలాపురం మీదుగా కాగిత హైవే వరకూ నిర్మిస్తున్న కారిడార్ నూతన రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన భూములతో పాటు, మరికొన్ని మిగులు భూములను కూడా సిద్ధంగా వుంచుకోవాలని అధికారులకు వారు ఆదేశించారు. బల్ డ్రగ్స్ నిర్వాహకులు రమేష్, ఉప తాసిల్దార్ నారాయణ రావు, సర్వేరు పొడగట్ల సత్తిబాబు, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

## జిల్లాను గంజాయి రహితంగా..

పాడేరు,జూన్5, ప్రభాతవార్త

జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ సూచించారు. గంజాయి సాగును జీరో స్థాయికి తీసుకు వెళ్ళడమే అందరి లక్ష్యం కావాలని స్పష్టం చేసారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్, వ్యవసాయ, అటవీ, ఉద్యానవన, వైద్య ఆరోగ్య, విద్యా, ఐసిడిఎస్, డ్వామా, డి.ఆర్.డి.ఏ శాఖల అధికారులతో గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలు, రవాణా, పంపిణీ, వినియోగం, వ్యసన విముక్తి మొదలగు అంశాలపై లోతుగా చర్చించారు. గంజాయి సాగు నిర్మూలనపై అధికారులకు దిశా నిర్దేశం చేసారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలు, వసతి గృహాల విద్యార్థులకు గంజాయి వినియోగంపై కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. గంజాయి సాగు చేసే రైతులు, సరఫరాదారులుపై ప్రత్యేక దృష్టి పెట్టి అటువంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. గంజాయి విడిచి పెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, స్వయం ఉపాధి పథకాలు, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. అన్ని సమావేశాలలో గంజాయి నిర్మూలనపై చర్చించాలని సూచించారు. గంజాయి పూర్తి స్థాయి నిర్మూలనకు సచివాలయం యూనిట్ గా తీసుకుని గంజాయి సాగుదారులను గుర్తించి వారికి గంజాయి సాగు నుండి విముక్తికి అవసరమైన అంశాలతో సూక్ష్మ ప్రణాలికలు సిద్ధం చేసి అమలు చేయాలని వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, బ్యాంకు శాఖలను ఆదేశించారు. అదేవిధంగా గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు.

### త్వరలో అంతర్ రాష్ట్ర సమావేశం

డి.ఐ.జి గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ జిల్లాలో గంజాయిని సమూలంగా అరికట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రోన్ ల ద్వారా గుర్తించిన గంజాయి సాగును ధ్వంసం చేసినా తిరిగి అదే సాగు చేస్తున్న వారిని గుర్తించి కటిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి నిర్మూలనలో భాగమైన ప్రభుత్వ శాఖలు లక్ష్యాలను నిర్దేశించుకుని పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేసారు. సమాజంలో గంజాయి నిర్మూలనపై పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంత చేయాలని చెప్పారు. జిల్లాలో గంజాయి నిర్మూలన జరిగినప్పటికీ ఇతర రాష్ట్రాల నుండి మన జిల్లా మీదుగా రవాణా జరుగుతుండడం గుర్తించామన్నారు. త్వరలోనే ఆంధ్ర, ఒరిస్సా, చతిష్ఘర్ రాష్ట్రాలతో అంతర్ రాష్ట్ర సమావేశాలు ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుండి గంజాయి రవాణాను అరికట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆంధ్రా ఒరిస్సా సరిహద్దుల వెంట 26 చెక్ పోస్టులు నిర్వహిస్తున్నామన్నారు. సిసి టివిల ద్వారా గంజాయి రవాణాదారులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సాగు, రవాణాలో పట్టుబడిన వారికి ప్రభుత్వ పథకాలు అందడం కష్టమని, విధ్యార్థులైతే ఉపాధి అవకాశాలు దుర్లభం అవుతాయని హెచ్చరించారు. ఇటీవల ఏడు కేసులలో వారి ఆస్తులను సుమారు రూ.10 కోట్ల వరకు జప్తు చేయడం జరిగిందన్నారు. గత పదేళ్ళలో సుమారు 60 కేసుల వరకు పది సంవత్సరాలకు తక్కువ కాకుండా శిక్షలు పడ్డాయన్నారు. 45 అంతర్ రాష్ట్ర గంజాయి ముటాలను గుర్తించామని, వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసామని డిఐజి వివరించారు. గంజాయి బానిసలను 20 మందిని గుర్తించి వారికి వ్యసన విముక్తి కేంద్రాలలో చికిత్స అందిస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ ఇటీవల గత ఆరు నెలలుగా పోలీస్ శాఖ చేపట్టిన చర్యల వల్ల గంజాయి సాగు, రవాణా తగ్గుముఖం పట్టిందన్నారు. 18 కేసులు గుర్తించి 9,500 కేజీల గంజాయి సీజ్ చేయడం, 280 మందిపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. గత ఏడాది సుమారు 348 ఎకరాలలో గంజాయి సాగు జరిగినట్లు గుర్తించడం జరిగిందని, ఈ ఏడాది కేవలం 93 ఎకరాలలో మాత్రమే సాగు జరుగుతున్నట్లు డ్రోన్‌ల ద్వారా గుర్తించి ధ్వంశం చేయడం జరిగిందన్నారు. ఆధునిక సాంకేతికత ఉపయోగిస్తున్నామన్నారు. డ్రోన్లు, సాటిలైట్ సాంకేతికత, డాగ్స్ వినియోగిస్తున్నామని వివరించారు.

### వనం - మనం, ప్రపంచ పర్యావరణ దినం, మాదక ద్రవ్యాల పోస్టర్ల ఆవిష్కరణ

కార్యక్రమంలో భాగంగా వనం-మనం, ప్రపంచ పర్యావరణ దినోత్సవం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ అదనపు ఎస్పీ ధీరజ్, జిల్లా వ్యవసా యాధికారి ఎస్.బి.ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.జమాల్ భాషా, ఆసుపత్రి పర్యవేక్షకులు డా.విశ్వమిత్ర, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రో.హేమలతా దేవి, ఐసిడి ఎస్ పి.డి సూర్యలక్ష్మి డ్వామా పిడి విద్యాసాగర్, డిఇఓ పి బ్రహ్మాజి రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వీఎంఆర్డీయే చైర్మన్‌ను సత్కరించిన డిప్యూటీ మేయర్

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త

విశాఖ వీఎంఆర్డీయే చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్‌ని నగర డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ రెడ్డి, జనసేన కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంత లక్ష్మి మర్యాద పూర్వకంగా కలిసారు. డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన తర్వాత చైర్మన్ ప్రణవ్ గోపాల్‌ని డిప్యూటీ మేయర్ హోదాలో కలిసి ఘనంగా సత్కరించారు. డిప్యూటీ మేయర్ ఎంపికలో తనకు సహకరించిన చైర్మన్ ప్రణవ్‌కి అభినందనలు తెలిపారు.


వార్త VAARTHA CLASSIFIEDS — CLASSIFIEDS — వార్త VAARTHA CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ నేను, బుడపాన వంశీకృష్ణ S/o పద్మావతి, Dr.No. 5-698, S.I.G నగర్, వినాయక దేవాలయం దగ్గర, రవీంద్ర నగర్ , ఓల్డ్ డైరీ ఫామ్, విశాఖపట్నం. ఇప్పుడు నేను నా తల్లి పేరును పద్మ నుండి మార్చాను **పద్మావతి.** అందుకే ఆమె అన్ని ప్రయోజనాల కోసం పద్మావతి అని పిలువబడుతుంది.
(Ro.No.8775)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda బ్యాంక్ ఆఫ్ బరోడా**
సీతమ్మధార బ్రాంచ్, డి.నెం.50-53, 11/8, రవి ప్లాజా, నార్త్ ఎక్స్‌టెన్షన్, సీతమ్మధార, విశాఖపట్నం-530013, ఆంధ్రప్రదేశ్, ఫోన్: 0891-2552472, 2726035, ఇ మెయిల్: savsee@bankofbaroda.com, www.bankofbaroda.com

**(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క 8 (6) రూలు SARFAESI చట్టం 2002 నందు నిర్ధారించిన పరిధిలో 30 రోజుల నోటీసు.**

బ్యాంక్ ఆఫ్ బరోడా, సీతమ్మధార బ్రాంచ్ తరపున ఈ దిగువ తెలిపిన సంబంధిత రుణఖాతాలకు సంబంధించి సంబంధిత ఋణగ్రహీతలు, హామీదారులు, తనఖాదారులకు క్రింద తెలియజేసిన మొత్తములు చెల్లించవలసినదిగా దిగువ ఇవ్వబడిన తేదీలలో సీతమ్మధార బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి డిమాండ్ నోటీసు జారీ చేసినారని మీ అందరూ గమనించగలరు.
అటు తర్వాత, బ్యాంక్ ఆఫ్ బరోడా, సీతమ్మధార బ్రాంచ్ కు చెల్లించవలసిన బకాయిలకు సంబంధించి చట్టంనకు లోబడి 13(4) విభాగం నియమావళి పరిధిలో సెక్యూర్డ్ ఆస్తులను బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీనత తీసుకోవటమైనది మరియు SARFAESI చట్టం పరిధిలో ప్రాంతీయ భాష మరియు ఇంగ్లీషు వార్తా పత్రికలలో ఆయా తేదీలలో సదరు స్వాధీనతా ప్రకటన కూడా ప్రచురించటమైనది.
కనుక, చట్టంనకు లోబడి మరియు అందలి రూల్సు యొక్క నియమావళి ననుసరించి, అమ్మకమునకు ముందుగా దిగువ వివరించిన సంబంధిత తేదీలలో పూర్తి బకాయి మొత్తములు చెల్లించవలసినదిగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 8(6) నిబంధన క్రింద నేను 30 రోజుల నోటీసు కూడా పంపటమైనది.
మీ అందరికీ ఈ నోటీసు తేదీ నుండి 30 దినములలోగా దిగువ తెలిపిన పూర్తి బకాయి మొత్తమును + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి, బ్యాంకు స్వాధీనంలో నున్న ఆస్తులను విడిపించుకోవలసినదిగా చిట్ట చివరి అవకాశం ఇవ్వటమైనది. అట్లు చేయుటలో విఫలమైనచో, ఏదైన ఈ క్రింది పద్ధతి ద్వారా ఆస్తులు విక్రయించబడతాయి. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులతో లావాదేవీలు చేస్తున్న వ్యక్తులు లేదా ఆస్తులు కొనుగోలు చేయుటలో ఇతరత్రా ఆసక్తి కల వ్యక్తులు నుండి కొటేషన్లు పొందుట ద్వారా లేదా (బి) పబ్లిక్ నుండి టెండర్లు కోరుట ద్వారా లేదా (సి) ఇ-వేలం పద్ధతి ద్వారాతో పాటు బహిరంగ వేలం నిర్వహించుట ద్వారా లేదా (డి) ప్రైవేటు ఒప్పందం ద్వారా.
చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగంవాటిల్లకుండా పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీ చేయటమైనది.

**ఋణగ్రహీతల వివరములు : శ్రీమతి శ్రీముసురి లక్ష్మి, భర్త : శ్రీముసురి మహేష్,** డి.నెం. 6-173, ఫ్లాట్ నెం.102, ఉమా నిలయం, నారావు శివారు దగ్గర, జగ్గయ్యపాలెం గ్రామం, విశాఖపట్నం - 530027. **వేరొక చిరునామా: శ్రీమతి శ్రీముసురి లక్ష్మి, భర్త : శ్రీముసురి** మహేష్, డి.నెం.6-173/8, ఫ్లాట్ నెం.302, కల్పన ఎన్‌క్లేవ్, అయ్యప్పన్ నగర్, అయ్యప్పస్వామి గుడి దగ్గర, షీలా నగర్, విశాఖపట్నం - 530012. **(హోమ్ లోన్).**

| డిమాండ్ నోటీసు తేది: | స్వాధీనత నోటీసు తేది: | స్వాధీనత నోటీసు ప్రచురించిన తేది: | రూల్ 8(6) నోటీసు తేది: |
| --- | --- | --- | --- |
| 07-02-2023 | 19-05-2023 | 25-05-2023 | 28-05-2025 |

**తేది.30.01.2023 నాటికి చెల్లించవలసిన మొత్తం: రూ.13,50,698/-** (అక్షరాల పదమూడు లక్షల యాభై వేల ఆరు వందల తొంభై ఎనిమిది రూపాయలు మాత్రమే) + **అన్‌సర్వ్‌డ్ వడ్డీ రూ.34,046.09 పై** (అక్షరాల ముప్పై నాలుగు వేల నలభై ఆరు రూపాయల తొమ్మిది పైసలు మాత్రమే) + **వర్తించని వడ్డీ రూ.1,05,667.18 పై** (అక్షరాల ఒక లక్ష ఐదు వేల ఆరు వందల అరవై ఏడు రూపాయల పద్దెనిమిది పైసలు మాత్రమే) + **తేది.30.01.2023 నుండి వడ్డీ మరియు లీగల్ మరియు ఇతర ఛార్జీలతో సహా..**

**స్థిరాస్తి వివరములు:**
గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మరియు గాజువాక రిజిస్ట్రేషన్ సబ్ డిస్ట్రిక్ట్ పరిధిలో, జగ్గయ్యపాలెం గ్రామం, నారావు శివారు సర్వే నెం.8/1 లోని ప్లాట్ నెం.17 (ప్రస్తుతం సుమతి నగర్ ఏరియా వద్ద కలదు)లో 360 చ॥గ॥లు లేదా 301.28 చ॥మీ॥ల మొత్తం విస్తీర్ణంలో 36.50 చ॥గ॥లు లేదా 30.51 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా స్థల విస్తీర్ణంతో నిర్మించిన ఉమా నిలయం క్రింది అంతస్తు నందు 1025 చ॥అ॥లు (కామన్ ఏరియాలు మరియు బాల్కానీలతో సహా) మరియు స్టిల్ట్ ఫ్లోర్ నందు 80 చ॥అ॥ల కార్ పార్కింగ్ విస్తీర్ణంతో గల ఫ్లాట్ నెం.102. **ఆస్తికి హద్దులు: తూర్పు :** ప్లాట్ నెం.18 లోని కల్పన రెసిడెన్సీ, **దక్షిణం :** రోడ్డు, **పడమర :** ప్లాట్ నెం.16, **ఉత్తరం:** బి. అప్పారావు నాయుడు గారికి చెందిన ఆస్తి. **క్రింది అంతస్తులోని ఫ్లాట్ నెం.102కు హద్దులు: తూర్పు :** ఓపెన్ స్పేసెస్, **దక్షిణం :** ప్రవేశం, వరండా, **పడమర :** ఓపెన్ స్పేసెస్, **ఉత్తరం:** ఓపెన్ స్పేసెస్.

తేది : 28-05-2025 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విశాఖపట్నం — బ్యాంక్ ఆఫ్ బరోడా




## జనసేన పార్టీలో చేరిన 20 వైసిపి కుటుంబాలు



**నర్సీపట్నం,జూన్ 05,ప్రభాతవార్త** నాతవరం మండలం చెర్లోపాలెం గ్రామానికి చెందిన వైసిపినాయకులు మాకిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో వైసిపికి చెందిన 20 కుటుంబాలు గురువారం జనసేన పార్టీలో చేరాయి. వీరికి జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై జనసేన పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారు పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో నడుచుకొని పార్టీ బలోపేతమై లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గన్నారు.

## కమ్యూనిటీ మేనేజ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ..

### మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం...





**ఎలమంచిలి, జూన్ 05 ,ప్రభాతవార్త:** పట్టణంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో కమ్యూనిటీ మేనేజ్ ట్రైనింగ్ సెంటర్ వెలుగు శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించినప్పుడే అభివృద్ధి అనేది స్పష్టంగా కనబడుతుందని అన్నారు. ఈ కమ్యూనిటీ మేనేజ్డ్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా మహిళలు రోజుకి ఒక్క గంట విధులు నిర్వహిస్తే చాలు అని అన్నారు. ప్రతి ఐదు కిలోమీటర్ల కి ఒక సెంటర్ ని ఏర్పాటు చేసి మహిళలకు విశ్రాంతి భవనాలను ఏర్పాటు చేసే ఆలోచనలు కూడా ఉన్నట్లు తెలియజేశారు. ఆ విశ్రాంతి భవనంలో ఒక పోలీస్ మహిళా అధికారులు కూడా ఏర్పాటు చేసే ఉద్దేశం కూడా ఉన్నట్లు తెలిపారు. అనంతరం వెలుగు శిక్షణా కేంద్రం వద్ద 45 రోజులు పాటు మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహించే విధంగా శిక్షణా తరగతులను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా కేంద్రాన్ని కూడా ఎమ్మెల్యే సుందర విజయకుమార్ ప్రారంభించారు. మహిళలకు అందుబాటులో ఉండే విధంగా శిక్షణా సమయాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శేషు,ఎంపీడీవో కొండలరావు,ప్రాజెక్ట్ డైరెక్టర్ కె శశిదేవి,, శ్రీను, డిపిఎం వరప్రసాద్, సత్యవేణి, ఏపీఎం రాణి మహిళా సంఘ సభ్యులు, పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, లాలం సోమనాయుడు, రమేష్ నాయుడు, ఎక్స్ ఎంపీపీ పి.శ్రీనివాసరావు ,పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

### పిడిఎం కోర్టు జడ్జ్ జి స్పందన...



**ఎలమంచిలి ,జూన్ 05, ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పట్టణములోని కోర్టు ఆవరణలోని పిడిఎఫ్ కోర్టు జడ్జి జీ స్పందన మొక్కల నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జ్ స్పందన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటే కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని, మొక్కల వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ లభ్యమవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు సంబంధిత వస్తువులను పూర్తిగా నిషేధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఫారెస్ట్ అధికారులు, జ్యూడిషియల్ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడండి.. ప్లాస్టిక్‌ను నిరోధించండి..

### ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



**ఎలమంచిలి, జూన్ 05, ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడి ప్లాస్టిక్ నిరోధించండి అని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందర విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని నాటిన ప్రతి ముక్కు వృక్షంలో తయారయ్యే వరకు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. స్వచ్ఛమైన ఆక్సిజన్ చెట్లు ద్వారానే లభ్యమవుతుందని దీనివలన ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచే కార్యక్రమాన్ని ఒక విధిగా చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రాజాన శేషు, జనసేన నాయకులు ఉటకూటి రమేష్ నాయుడు, లాలం సోమనాయుడు, మాజీ ఎంపీపీ పిట్టా శ్రీనివాసరావు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## రేబాకలో పర్యావరణ దినోత్సవం



**నక్కపల్లి, జూన్ 5:ప్రభాతవార్త** మండలంలోని రేబాక గ్రామంలో గురువారం పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు.గ్రామ పెద్ద సాదిరెడ్డి చిన వెంకన్న, సాదిరెడ్డి వర ప్రసాద్, సెక్రటరీ అర్జియ్య ఎంపీటీసీ సభ్యుడు వెల్లంకి కాసుబాబు, కరణం సూరిబాబు, సాదిరెడ్డి బాబూరావు, శ్రీను, శానాపతి విజయ్ కుమార్, గరగ రాజేశ్, వీఆర్పీ శానాపతి ఆదినారాయణ, కరణం చిన రమణ తదితరులంతా కాలువ గట్లపై మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటాలని వీరంతా పిలుపునిచ్చారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి లక్ష్యం కావాలి

## ఎమ్మెల్యే సుందరపు



**ంఅనకాపల్లి, జూన్ 5, ప్రభాత వార్త :** పర్యావరణ పరిరక్షణ అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. బి.సి. టి కృషి విజ్ఞాన కేంద్రం, ఆధ్వర్యంలో మెలుపాక గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం మరియు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన సభ్యులు పాల్గొని గ్రామ సచివాలయం నందు మొక్కలు నాటారు. అలాగే పర్యావరణ పరిరక్షణ గురించి, ప్లాస్టిక్ వాడకం తగ్గించమని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాసరావు, వై వి వి ఎస్ మాధవరావు, కాండ్రేగుల నాయుడు, కర్రి రామ నాగేశ్వరరావు, కాళ్ళ చంద్రమోహన్, సరగడం యోగి నాగేశ్వరరావు, ఆడారి కుమార్, ఆడారి గణేష్, పొలమరశెట్టి మురళి, గగనం సాయ వళ్ళు ఉమా మహేష్, ప్రగడ రాజు, రౌతు వెంకటరమణ, యాదగిరి గణేష్ రాము నాయుడు లోవ కాయల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గోవాలో జరిగే జూనియర్ ఉమెన్ బాక్సింగ్ టోర్నమెంట్‌కు జ్యోతి ఎంపిక



**నర్సీపట్నం,జూన్ 05,ప్రభాతవార్త** ఈ నెల 5 నుండి 10 వరకు గోవాలోని ఇండోర్ స్టేడియంలో జరిగే జూనియర్ బాలికల బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో నర్సీపట్నంకు చెందిన బాక్సర్ గండి జ్యోతి 52 కేజీల విభాగంలో ఎంపికయ్యారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు జ్యోతిని సెలక్ట్ చేసి తీసుకువెళ్లడం జరిగింది. జ్యోతి తల్లిదండ్రులు స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద ఫాస్ట్ ఫుడ్ దుకాణం నడుపుతున్నారు. జ్యోతిని ఇప్పటికే నాలుగు సార్లు నేషనల్స్ కి పంపించారు. ఆర్థిక ఇబ్బందుల వలన ఇలా ఎంతో మంది క్రీడాకారులు నేషనల్ కి వెళ్లలేని పరిస్థితులలో ఉన్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పోర్ట్స్ కోటా ద్వారా ఉన్నత చదువు ఉద్యోగం పొందాలనే తపనతోనే ఖర్చుతో కూడుకున్న పని అయినా పంపిస్తున్నారని కోచ్లు పేరెంట్స్ తెలిపారు. శాప్ బాక్సింగ్ సెంటర్ ఉండటం వలన ఫ్రీగా శిక్షణ ఉందని లేకపోతే ఫీజులు కూడా కట్టలేక ఎంతో మంది బాకర్స్ మన నర్సీపట్నంలో తయారయ్యే వారే కాదని తెలిపారు. జ్యోతి గోవాలో మెడల్స్ సాధించాలని పలువురు కోరుతున్నారు.

## చోడవరంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

### మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి ఎమ్మెల్యే రాజు



**చోడవరం, జూన్ 5, ప్రభాతవార్త:**
చోడవరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో చోడవరం కోపరేటివ్ కాలనీ ఇందిరా పార్కులో చోడవరం ఎమ్మెల్యే రాజు పర్యావరణాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణంలో పేను మార్పులు వస్తున్నాయని ఓజోన్ పోర దెబ్బ తినడం వలన ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయని తదనగుణంగా మొక్కలు ఎక్కువగా నాటి పెద్దయ్యే వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అందువలన వాతావరణం చల్లగా ఉంటుందని అలాగే ప్రస్తుత మానవుని సగటు జీవితం 60 సంవత్సరములు ఉండగా మొక్కలు ఎక్కువగా పెంచడం వలన సగటు జీవితం 80 సంవత్సరముల వరకు పెరగవచ్చునని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఆంజనేయులు, ఈవోపీఆర్డి మహేష్, పంచాయతీ కార్యదర్శి నారాయణరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు దేవరపల్లి వెంకట అప్పారావు, ఎంపీటీసీ రామలక్ష్మి నాయుడు, గునూరు ప్రభాకర్, ఎంపీటీసీ రూపా దేవి చిన్న, వార్డు మెంబర్లు పట్నాల సంతోష్, రొంగలి దివ్య, సకురు కోటేశ్వరరావు, ఈర్లే శ్రీనివాస్, గొర్రె సుధాకర్, పనస రెడ్డి, పార్థు, ఎర్రం శెట్టి చిన్న, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో 82 లక్షల మొక్కల పెంచేందుకు చర్యలు..

## డీఎఫ్ఓ "లక్ష్మణ్"



**(నక్కపల్లి, ప్రభాతవార్త)** ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో అనకాపల్లి జిల్లా పరిధిలో పర్యావరణ పరి రక్షణే ధ్యేయంగా 82 లక్షల మొక్కలను నాటి వాటి పెంపకం చేపట్టాలని నిర్ణయించమని అందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అటవీశాఖాధికారి జీ. లక్ష్మణ్ చెప్పారు. గురువారం నక్కపల్లి వచ్చిన ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. 2047 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో అటవీ భూముల శాతం పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జిల్లా వ్యాప్తం గా 90 నర్సరీలు ఏర్పాటు చేసి, పంపిణీకి మొక్కలను సిద్ధంగా వుంచామన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయం గా పేపర్ మిల్స్, ఉద్యానవనశాఖ.డుమా, అటవీశాఖల సమన్వయంతో మొక్కలు పెంచేందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నాటే 82 లక్షల మొక్కల్లో సరుగుడికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇది తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక లాభాలిస్తుందన్నారు. దాదాపు 70 లక్షల మొక్కలు సరుగుడు నాటుతామని, మిగిలిన 12 లక్షల మొక్కలు పలు రకాల జాతులుంటాయని చెప్పారు. రైతుల పొలాల్లో కూడా సరుగుడు పెంచుకోవడానికి ఉచితంగా నారు ఇస్తామని చెప్పారు. ఎప్పటికప్పుడు నర్సీపట్నం, అనకాపల్లి, యలమంచిలి, చోడవవరం రేంజ్ కార్యాలయాల పరిధిలో ఎప్పటికప్పుడు మొక్కల పెంపకంపై పర్యవేక్షణ చేస్తామని చెప్పారు. ప్రతీ ఒక్కరూ కాలుష్య నివారణకు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటడం ఆరోగ్యకరమైన మార్గమని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని డీఎఫ్ వో లక్ష్మణ్ సూచించారు. ప్రతి గ్రామం లో మొక్కలు చేపట్టడం వలన గ్రామంలో నివసిస్తున్న ప్రజలు ఆరోగ్యం ఉంటారని ఆయన చెప్పారు. మొక్కలు పెంపకం పై ప్రజల్లో చైతన్యం నింపేందుకు పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు.

## 85 వార్డులో ఘనంగా జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**అగనంపూడి ప్రభాత వార్త.**
జీవీఎంసీ 85 వార్డ్ డొంకాడ గ్రామంలో జాతీయ రహదారి పక్కన శానిటరీ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు, అనంతరం పర్యావరణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి అని ప్రతిజ్ఞ కార్యక్రమం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో 85 వార్డు ఇంచార్జ్ ఇల్లపు ప్రసాదు మాట్లాడుతూ మానవ జనజీవనంకు విఘాతం కలిగించే కాలుష్యం ను నివారించాలంటే మొక్కలు, ఇండ్లు దగ్గర, పాఠశాలలో దేవాలయాల దగ్గర, కమ్యూనిటీ హాల్ వద్ద, మొక్కల నాటి పర్యవరణాన్ని కాపాడుతూ సుఖమైన జీవితాన్ని పొందాలని అన్నారు. ఏ డి సి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మానవకోటి జనజీవనానికి సంజీవిని లాంటి పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత అందరి పైన ఉందని అన్నారు. 85 వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ బి సీతారామయ్య సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 85వ వార్డు టిడిపి నాయకులు గంతకోరు అప్పారావు, కో ర్రాయి జగదీష్ ,ఇల్లపు ఈశ్వరరావు ,తలారి వెంకటరమణ, గొల్లవిల్లి నూకరాజు, అండబోయిన మంగరాజు,మొల్లి కోటేశ్వరరావు, దామరోతి ప్రసాద్, శ్రీమతి గంతకోరు సత్యవతి బిజెపి నాయకులు కోసూరి తాతారావు, వీ రవీంద్ర కుమార్ 85 వార్డు సచివాలయాల పర్యావరణ శానిటరీ కార్యదర్శిలు సిహెచ్ కనకేశ్వర్ రావు ఎన్ భవాని జై నరేష్ ఎస్ శివ గణేష్ ఎం శ్రీను శానిటరీ సూపర్వైజర్లు సిహెచ్ నాగమణి, భాను మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## కొప్పిశెట్టి వెంకటేష్‌ను సత్కరించిన రాజయ్యపేట కూటమి నాయకులు..!



**(నక్కపల్లి, ప్రభాతవార్త)** టిడిపి పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ గా నియమితులైన కొప్పిశెట్టి వెంకటేష్ ను రాజయ్యపేట తెలుగుదేశం, జనసేన పార్టీ కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పిక్కి రాంబాబు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి), సొసైటీ అధ్యక్షులు పిక్కి కోదండరావు, పిక్కి దేముడు, వాసపల్లి శివాజీ, చోడిపల్లి నగేష్, తాతీలు,రాము, తాతాజీ, శ్రీను, చిన్నారి, కిరణ్, రాము, ప్రసాద్, కాశి, బంగారి, దార్ల, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**(నక్కపల్లి, ప్రభాతవార్త)**
ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మండలంలోని రాజయ్యపేట గ్రామంలో చెత్త నుండి సంపద తయారు కేంద్రం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గోసల కాసులమ్మ, సర్పంచ్ పిక్కి అప్పలనర్స, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి), టిడిపి పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, అంగన్వాడి టీచర్ పిక్కి పైడితల్లి, విఆర్పి మైలపల్లి సత్తిబాబు, ఏఎన్ఎం నాగమణి, సచివాలయం సిబ్బంది విజయ్, హైమ, మహేష్, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన 'దేవర'




**(నక్కపల్లి, ప్రభాతవార్త )**
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పాయకరావుపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ దేవవవరం గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంకి దేవవరం టీడీపీ పార్టీ అధ్యక్షులు శ్రీ కొరిమి సూర్య గణేష్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు , సచివాలయం సిబ్బంది , చెల్లపు శ్రీను యలమంచిలి అప్పలరాజు, దేవర బాబ్జీ, వెలుగు సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ఏపీ రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్‌గా 'ఉషారాణి'



**( నక్కపల్లి, ప్రభాతవార్త)**
నక్కపల్లి లో ఉన్న ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ గా యు. ఉషారాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఊహించిన విధంగా ఇన్చార్జి ప్రిన్సిపాల్ గా బాధ్యతలు నిర్వహించిన సువర్ణ ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఊహించిన ఫలితాలు ఆమె సొంతం చేసుకోవడమే కాకుండా గురుకుల పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సువర్ణ నుంచి ఉషారాణి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన ఉషారాణి లను సువర్ణ ఆధ్వర్యంలో పలు ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

## పర్యావరణానికి ప్రాణవాయువు చెట్లు

### వన మహోత్సవంలో మొక్కలు నాటిన అధికారులు



**గొలుగొండ జూన్ 5, ప్రభాతవార్త**
పర్యావరణానికి ప్రాణవాయువుగా ఈ భూ మండలాన్ని చెట్లు రక్షిస్తూ వస్తున్నాయని కృష్ణాదేవిపేట రేంజ్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. ఎంపీడీవో మేరీ రోజు తో కలిసి గురుకుల పాఠశాల, చీడిగుమ్మల, కొత్త ఎల్లవరం లో కూడా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విరుగుగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. మొత్తం పచ్చదనం పెంపొందించాలని ప్రాణకోటికి జీవనాడిగా మారుతుంది అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగానే ఈ మూడు నెలలు మొక్కలు నాటే కార్యక్రమం వారంలో ఒకరోజు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ రామారావు, ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, సెక్షన్ అధికారి లక్ష్మణ్,డిపో ఫారెస్ట్ కెవి రమణ, సర్పంచ్ కొల్లు రాంబాబు, ఎన్ఆర్జిఎస్ సిబ్బంది, తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఆదివాసి విద్యార్థినిని అభినందించిన అల్లూరి కలెక్టర్

రంపచోడవరం. జూన్ 5 ప్రభాతవార్త.



ఇటీవల విడుదలైన జాతీయ స్థాయిలో జరిగిన జేఈఈ అడ్వాన్స్ 2025 పరీక్షా ఫలితాలలో జాతీయ స్థాయి లెవెల్లో 125 ర్యాంక్ తో సత్తా సాటిన ఆదివాసీ విద్యార్థి కింటుకూరి జై కిసాన్. అల్లూరి సీతారామరాజు జిల్లా వైరామవరం మండలం మారుమూల ప్రాంతమైన కోట గ్రామానికి చెందిన కింటుకూరి లక్ష్మణరావు కుమారుడు ఈ విజయాన్ని సాధించి జాతీయస్థాయిలోనీ ప్రముఖ ఐఐటీలలో ప్రవేశం కొరకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసి విద్యార్థులు ఈ విధంగా ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరుతూ విద్యార్థిని, మరియు తల్లిదండ్రులను అభినందించారు.




## రెండో వైద్యాధికారిగా క్రాంతి సౌజన్య



**రాజవొమ్మంగి, జూన్ 05, ప్రభాతవార్త** రాజవొమ్మంగి పి.హెచ్.సి కి రెండో వైద్యాధికారిగా డా. క్రాంతి సౌజన్య ను నియమించడం జరిగిందని అడి షినల్ డి. యం. అండ్ హెచ్. ఓ శిరీష తెలిపారు. సీతపల్లి ఆసుపత్రి నుండి డిప్యూటేషన్ పై సౌజన్యను వేసినట్లు వెల్లడించారు. బర్త్ వెయిటింగ్ హాలు ఉన్నా పి హెచ్. సి పరిధిలో ప్రసవాలు జరుగకపోవడం, రోగులు సంఖ్య ఎక్కువగా ఉండి ఒకే వైద్యాధికారి ఉండటంతో ఈ నియామకం జరిగిందని శిరీష వివరించారు. ఇద్దరు వైద్యులు అందుబాటులో స్థానికంగా నివాసం ఉండి వైద్య సేవలను అందిస్తారన్నారు.



## మట్టి రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ సంతోష్ కుమార్ శంకుస్థాపన

**వి.ఆర్.పురం,జూన్ 5, ప్రభాతవార్త** మండల పరిధిలోని శ్రీరామగిరి గ్రామంలో రూ.10 లక్షల రూపాయల ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధులతో మంజూరైన గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు, గురువారం స్థానిక సర్పంచ్ పులి.సంతోష్ కుమార్ టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పూసం.రవివర్మ, పిసా కమిటి కార్యాదర్శి కారం.రాముడు,గ్రామ పెద్దలు గుండిపుడి.లక్ష్మణ్ రావు, కమ్మచిచ్చు.సత్య నారాయణ, నాళ్ళరపు.రాజేశ్వరి,కమ్మచిచ్చు.చిన్న వెంకటయ్య, ఎన్.బాలాజీ, అయినాల.గోపి, సోడి.శ్రీను, తోడం.వెంకటేష్, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ- పరిరక్షణ అందరి బాధ్యత

### అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్.



**డుంబ్రిగుడ రూరల్, జూన్ 05ప్రభాత వార్త:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని కొర్ర పంచాయతీకి చెందిన (అంజోడా) అరకు ఫైనరీ అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్య లింగం, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వేరు వేరుగా మొక్క నాటి పోస్టల్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్క యువతీ యువకులు ప్రజాప్రతినిధులు బాధ్యతగా తీసుకొని ప్రతి గ్రామంలో పర్యావరణంపై అవగాహన కల్పించాలని చెప్పారు. మానవ మనుగడ ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని అడవిని రక్షణగా ఉండాలని చెప్పారు. ఒక్కరోజు కార్యక్రమంలో భాగంగా మూడు లక్షల 45 వేల మొక్కలను అన్ని శాఖల నుంచి బాధ్యత తీసుకొని నాటడం నాటడం జరిగిందన్నారు. వనం మనం మన అందరి బాధ్యత అని అందరి బాధ్యతతోనే వనం రక్షణగా ఉంటాయని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 27 లక్షల మొక్కలు 11 యాక్టర్లలో నాటడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరు ఇతరులకు అవగాహన కల్పించాలని చెప్పారు. అవగాహనతోనే ప్లాస్టిక్ నివారణ చేయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ జిల్లా అధికారి సందీప్ రెడ్డి, అరకు డివిజన్ రేంజ్ అధికారి శ్రీనివాసరావు, పీడి విద్యాసాగర్, విజయనగరం ఏపీ ఆర్టీసీ జోనర్ చైర్మన్ దొన్ను దొర, మండలం ఎంపీపీ ఈశ్వరి, జడ్పిటిసి జానకమ్మ, జనసేన అరకు ఇన్చార్జి చిరంజీవి, టిడిపి మండల అధ్యక్షులు ఆనందరావు, సర్పంచ్ కొమ్ములు,నాయకులు మాజీ సర్పంచ్ పాంగి చిన్నారావు, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, ఎంపీటీసీ దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం ప్రపంచ పర్యావరణ ఆరోగ్యాన్ని కాపాడుకుందాం..

### టీడీపీ డివిజన్ నాయకుడు పాంగి పాండురంగ స్వామి..



**ముంచంగిపుట్టు జూన్ 5 (ప్రభాతవార్త):** అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీలో సర్పంచ్ పాండురంగ స్వామి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా పాడేరు టిడిపి డివిజన్ నాయకులు దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి మాట్లాడుతూ పర్యావరణం దినోత్సవం సందర్భంగా మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో పెదపేట గ్రామంలో చెరువుకు అనుకోని మొక్కలు నాటడం జరిగిందని అదేవిధంగా కాఫీ అధికారుల ఆధ్వర్యంలో మాలిపుట్ గ్రామంలో పాత బడ్డ కాఫి తోటలో కాఫి మొక్కలను నాటడం జరిగిందని ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం వల్ల పర్యావరణం కాపాడటమే కాకుండా 83వేల జీవారసులకు ఆక్సిజన్ అందిస్తున్నామని ఆయన అన్నారు. కాలుష్యాన్ని నివారించే మొక్కల వల్ల ప్రతి ఒక్క జీవికి మంచి ఆక్సిజన్ అందుతుందని పర్యావరణం లేకపోతే జీవారసులు మనుగడ ఉండదని పర్యావరణం లేకపోతే భూగర్భ జలాలు ఇంకిపోయే ప్రమాదం ఉందని పర్యావరాణన్ని కాపాడటం వల్ల ప్రపంచ ఆరోగ్యన్ని కాపాడుకోవచ్చు అన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటలని తద్వారా ఆర్థికంగా కూడ మెరుగుపరుచుకోవచ్చని దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లికార్జున,వి ఆర్ పి గణపతి,కాఫీ లైజక్ వర్క్ యుగంధర్,త్రినాద్, పద్మసేన్, జనసేన నాయకుడు నాగేష్ హార్టికల్చర్ అసిస్టెంట్ చంద్రుబాబు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక బాధ్యతతో మొక్కలు నాటండి

### ఐటిడిఏ ఇంచార్జి పిఓ, జెసి డా. ఎం.జె. అభిషేక్ గౌడ

**పాడేరు,జూన్5, ప్రభాతవార్త:** సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఐటిడిఏ ఇంచార్జి పి ఓ, జెసి డా. ఎం.జె. అభిషేక్ గౌడ పిలుపు నిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐటిడిఏ కార్యాలయం ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయ ఆవరణ, పాఠశాలల్లోను, అంగన్వాడీల కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని అన్నారు. అడవులను సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఏజెన్సీని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రకృతి రక్షణకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకలు ఎల్.రజని, పరిపాలనాధికారి ఎం. హేమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జమాల్ బాషా, అకౌంట్స్ అధికారి శ్రీనివాస కుమార్, మేనేజర్ పరంజ్యోతి, పియంయు అధికారి రాజేష్ ఐటిడిఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణాన్ని కాపాడాలి

### జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్ జి.గౌరీ శంకర్



**పాడేరు,జూన్5, ప్రభాతవార్త:** జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ వారి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనమచిట్టబ్బాయి ఆదేశాల మేరకు పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్ జి. గౌరీ శంకర్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న సహజ మానవ నిర్మిత అంశాలన్నీ కలిపి ఒక జీవి యొక్క జీవితాన్ని ప్రభావితం చేసే వాతావరణమే పర్యావరణము. నేల నీరు గాలి మానవ మనుగడకు అత్యంత ఆవశ్యకాలు. ఈ మూడు ఇప్పుడు కలుషితం కాకుండా చూడవలసిన బాధ్యత యువతపై ఉందని. మరియు ప్రపంచ దేశాలన్నీ ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కొందాం అనే నినాదంతో 2025 సంవత్సరం పర్యావరణ దినోత్సవం ను జూన్ 5న జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి కోరింది. దీనిలో భాగంగా కళాశాల ఆవరణలో ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ ఎస్ .నూకరాజు, ఆఫీస్ సిబ్బంది వర్ధన్ ,సబిత విద్యార్థినీ విద్యార్థులు వాలంటీర్లు పాల్గొన్నారు.

## పంట రుణాలు చెల్లించి తిరిగి పొందండి..

### మేనేజర్ అరుణ్ కుమార్

రాజవొమ్మంగి, జూన్ 05, ప్రభాత వార్త



జడ్డంగి బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ద్వారా పంట రుణాలు. పొందిన రైతులు సకాలంలో వడ్డీ తో చెల్లించి తిరిగి రుణాలను పొందాలని బ్రాంచ్ మేనేజర్ అరుణ్ కుమార్ తెలియజేసారు. ఈసందర్బంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ గత ఏడాది 150 మంది రైతులకు రూ. 5 కోట్లు పంట సాగుకు రుణాలను ఇచ్చామన్నారు. బంగారం పై రుణాలను కూడా తక్కువ వడ్డీకి ఇస్తున్నామన్నారు. గ్రాముకు రూ. 5,500లు, వడ్డీ 0.75 పైసలని అన్నారు.ఈకార్యక్రమంలో అరుణ్ కుమార్, క్యాషియర్ అప్పన్నబాబు, ఆఫీసర్ చక్రధర్ బాబు పాల్గొన్నారు.

## కాఫీ తోటల విస్తరణకు కృషి

### ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ



**పాడేరు,జూన్5, ప్రభాతవార్త:** ఏజెన్సీలో కాఫీ తోటలను మరింత విస్తరించడానికి కృషి చేస్తానని ఐటిడి ఇన్చార్జి ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ అన్నారు. గురువారం పాడేరు మండలం గురవుగరువు గ్రామంలో జరిగిన వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని కాఫీ మొక్కలను నాటారు.ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం వెంకటేశ్వరరావు, పాడేరు ఎంపీపీ సోనారీ రత్నకుమారి , ఏఈఓ రూడీ అప్పారావు, కాఫీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం, పర్యావరణాన్ని కాపాడుదాం, భవిష్యత్తును రక్షిద్దాం..

### మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో. సన్యాసమ్మ (సంధ్య)...



**ముంచంగి పుట్టు జూన్ 5 (ప్రభాతవార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గల అంబేద్కర్ పార్కు ఆవరణలో అటవీ శాఖ అధికారులు సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ అరిసెల సీతమ్మ, టిడిపి మండల పార్టీ అధ్యక్షురాలు కిల్లో. సన్యాసమ్మ (సంధ్య) పాల్గొని పార్కు ఆవరణలో పర్యావరణానికి మేలు చేసే పలు రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా, ఎంపీపీ అరిసెల సీతమ్మ, టిడిపి మండల పార్టీ అధ్యక్షురాలు సన్యాసమ్మ మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకొని భవిష్యత్తును రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని ఉన్నారు. సన్యాసమ్మ మాట్లాడుతూ మానవుడు తన స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతి వనరులను విచక్షణారహితంగా వాడుకోవడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నా రు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ ముఖ్య లక్ష్యం పర్యావరణ పరిరక్షణ, కాలుష్యం తగ్గింపు, సుస్థిర జీవనంపై ప్రజలలో అవగాహన కల్పించడమన్నారు. అడవుల నరికివేత, నీటి కొరత వంటి అనేక సమస్యలు జీవరాశి మనుగడకు ముప్పుగా పరిణమిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ దినోత్సవం పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తు చేస్తోందని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కాబట్టి పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు నాటడం, వాటిని సంరక్షించడం, మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమం లో ముంచంగిపుట్టు ఎస్సై జె రామకృష్ణ,డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాయుడు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సిహెచ్ నారాయణ పడాల్, కార్తీక్, స్రవంతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పి రుక్మిణి, కే శ్రీను, ఎం రామారావు, వైస్ ఎంపీపీ పి సత్యనారాయణ, టిడిపి నాయకులు బాబుజి, రొయ్యల కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ అభ్యర్థులతో అధికారులు చెలగాటం..

### ఇంటర్వ్యూలు ముగిశాక కొత్త రూల్స్‌తో ఆటంకం



**రాజవొమ్మంగి, జూన్ 05, ప్రభాత వార్త** అంగన్వాడి పోస్టులకు ఇంటర్వ్యూ లు నిర్వహించి నెలరోజులు తరువాత మరలా ఐసీడియస్ అధికారులు మరలా క్రొత్తగా కులధ్రువ పత్రాలు కావాలని జాప్యం చేస్తున్న అధికారులపై తక్షణం చర్యలు తీసుకొని అర్హులు అయిన వారికి ఆదేశాలు ఇవ్వాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. రాజవొమ్మంగి, రంపచోడవరం, అడ్డతీగల, గంగవరంమారేడుమిల్లి మండలాల్లో గల అంగన్ వాడీ హెల్పర్ పోస్టులకు ఏప్రిల్ 25 తేదీన రంపచోడవరం లో సబ్ కలెక్టర్సమక్షంలో ఇంటర్వ్యూ లను నిర్వహించారు. అర్హులను ఎంపిక చేసి ఆదేశాలను ఇవ్వాలి. కాని ఇప్పుడు కొత్తగా కులధ్రువపత్రం పై భర్త ఇంటిపేరుతోను, భర్త గ్రామం ఉండాలని అదే విధంగా సర్టిఫికెట్ కావాలని అర్జీ దారులకు చెప్పడం ఎంతవరకూ సమంజసమన్నారు. ధరకాస్తులకు ముందు మార్గదర్శకాలు వస్తాయని అన్నారు. ధరకాస్తులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు యు. డి. సి, సూపర్ వైజర్ పరిశీలన చేసి అర్హులు కాకపోతే దరకాస్తులు వెనక్కి ఇవ్వాలన్నారు. ఆతరువాత సి. డి. పి. ఓ పరిశీలన చేసి ఇంటర్వ్యూ లకు ఒరిజినల్ సర్టిఫికెట్ లు తీసుకొని రమ్మని చెప్పి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇప్పుడు నెలరోజులు తరువాత కులాధ్రువ పత్రాలు కొత్తపద్ధతి లో అడగటం ఆంతర్యం ఏమిటని అన్నారు. ఇప్పుడు జిల్లా పి. డి బదిలీ అయ్యారు. ఐసీడియస్ అధికారులు కూడా బదిలీలపై వెళ్ళిపోతే గిరిజన మహిళలకు జరిగిన నష్టానికి బాద్యులు ఎవరని, తక్షణమే జిల్లా కలెక్టర్ విచారణ చేసి న్యాయం చేయాలని రామారావు కోరుతున్నారు. ఈవిషయంపై రాజవొమ్మంగి సి. డి. పి. ఓ. దేవమణి ప్రభాతవార్త ఫోన్ లో వివరణ కోరగా నోటిఫికేషన్ లో ఉన్న ప్రకారం పాత పద్ధతిలో దరఖాస్తులు చేసుకోవడం, ఇంటర్వ్యూలు జరిగాయన్నారు. తదుపరి జిల్లా పి. డి. దరఖాస్తు చేసుకొన్న గ్రామంలో భర్త ఇంటిపేరుతో ధరకాస్తు దారులు నుండి మరలా కులధ్రువపత్రం తీసుకోమంటున్నారని అన్నారు.

## వనాలతో మానవునికి విడదీయని బంధం....

### ఎంపిపి జి. వెంకటలక్ష్మి



**రాజవొమ్మంగి, జూన్ 05, ప్రభాతవార్త** వనాలతో మానవులకు విడదీయరాని బందమని రాజవొమ్మంగి ఎంపిపి గోము వెంకటలక్ష్మి అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా రాజవొమ్మంగి అటవీ సంక్షేమాధికారి ఉషారాణి. ఆధ్వర్యంలో రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల ప్రాధమికొన్నత పాఠశాలలో ప్రజాప్రతినిధులు మొక్కలను నాటా రు. పర్యా వరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో ఉపయోగకరమని సి. ఐ సన్యాసినాయుడు అన్నారు. ఈకార్యక్రమంలో అటవీ సంక్షేమాధికారి ఉషారాణి, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, అరకు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు దంతులూరి శివరామచంద్ర రాజు,తహసీల్దారు అల్లు సత్యనారాయణ, యం. ఇ. ఓ సూరయ్యరెడ్డి, మండల బిజెపి అధ్యక్షులు తాము సూరిబాబు, ఉపాధి ఏ. పి. ఓ రెడ్డిబాబు, మధు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు. రాజవొమ్మంగి ఐ. సి. డి. ఎస్. ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సి. డి. పి. ఓ ఎల్ దేవమణి మొక్కలను నాటారు. ప్రతీ అంగన్వాడీ కేంద్రం వద్ద మొక్కలను నాటడం జరిగిందని సి. డి. పి. ఓ అన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు చాలా అవసరమని సి. డి. పి. ఓ దేవమణి అన్నారు. ఈకార్యక్రమంలో సి. డి. పి. ఓ దేవమణి, సూపర్ వైజర్లు అరుణలత, అమ్మిరాజు, నాగజయలక్ష్మి, అమ్మాజీ, సత్య కుమారి, చక్రవేణి, సోను, పాల్గొన్నారు. జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయం వద్ద సెక్షన్ ఆఫీసర్ సుబ్బయ్యమ్మ ఆధ్వరంలో సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, డా. నాగార్జున మొక్కలను నాటారు. ఈకార్యక్ర మంలో సెక్షన్ ఆఫీసర్ సుబ్బయ్యమ్మ, బీట్ ఆఫీసర్ నరేష్, ఆసుపత్రి సిబ్బంది రమణ, చిన్నయ్యమ్మ, సిబ్బంది పాల్గొన్నారు. శరభవరం సచివాలయం వద్ద సర్పంచ్ లోతా రాజ్యలక్ష్మి, కార్యదర్శి శివ మొక్కలను నాటారు. ఈకార్యక్ర మంలో పంచాయతీ సెక్రటరీ శ్రీ పి. శివ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జయ చందు, మహిళా పోలీసు భూలక్ష్మి, డిజిటల్ అసిస్టెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత ..

### ఎంపీపీ అరిసెల. సీతమ్మ.....



**ముంచంగిపుట్టు జూన్ 5 (ప్రభాతవార్త):** అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు ఎంపీడీవో కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం,వన మహోత్సవం సందర్భంగా ముంచంగిపుట్టు మండల పరిషత్ అధ్యక్షురాలు అరిసెల సీతమ్మ, టిడిపి మండల పార్టీ అధ్యక్షురాలు కిల్లో. సన్యాసమ్మ తో పాటు వివిధ పార్టీల నాయకులు, అధికారులు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు.పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని,ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ప్రతి ఇంటి ఆవరణలో ఒక మొక్కలను నాటాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వి. సూర్యనారాయణ మూర్తి, తాసిల్దార్ నర్సమ్మ, ఈవోపీఆర్డి వి. చిన్నన్న, పంచాయతీ కార్యదర్శి టి సూర్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ వై వెంకటేశ్వరరావు, మండల ఇంజనీరింగ్ అధికారి మురళీకృష్ణ తో పాటు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది, వైస్ ఎంపీపీ పాటు బోయ్ సత్యనారాయణ, టిడిపి నాయకులు బాపూజీ, రొయ్యల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## పశువులు అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు



**రాజవొమ్మంగి, జూన్ 05, ప్రభాత వార్త** పశువుల అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే తన దృష్టికి తెస్తే పట్టుకొని చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జడ్డంగి ఎస్. ఐ. చిన్నబాబు అన్నారు. బుధవారం జడ్డంగి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎస్. ఐ చిన్నబాబు ఆధ్వర్యంలో వాహన తనిఖీలను నిర్వహించారు. బోలోరో వాహనం లో ఐదు పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్. ఐ తెలిపారు. పశువుల అక్రమ రవాణా చేస్తున్న అడ్డతీగలకు చెందిన నేకూరి కళ్యాణ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పశువులను పులిగోగులపాడు గోశాలకు తరలిస్తున్నట్లు చిన్నబాబు వెల్లడించారు. ఈకార్యక్రమంలో కానిస్టేబుల్ లు సురేష్, రామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ బదిలీ

**రాజవొమ్మంగి, జూన్ 05, ప్రభాత వార్త** జడ్డంగి పోలీస్ స్టేషన్ లో ఐదు సంవత్సరాలు పాటు కానిస్టేబుల్ గా పని చేసిన దుర్గారావు అడ్డతీగల బదిలీ అయినట్లు జడ్డంగి ఎస్. ఐ చిన్నబాబు తెలిపారు.

## వేలాడుతున్న విద్యుత్ వైర్లు.. భయాందోళనకు గురవుతున్న ప్రజలు..!





(నక్కపల్లి, ప్రభాతవార్త) ప్రజలు నిత్యము రాకపోకలు కొనసాగించే రహదారిపై క్రిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు చూసిన ప్రజలు వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని నక్కపల్లి నుంచి ఉపమాక గ్రామానికి వచ్చే రహదారి మార్గంలో చెట్టు కొమ్మలు విరిగిపడి విద్యుత్ వైర్లు పై పడటంతో వచ్చే ప్రయాణికులు ఆ వైర్లు ఎప్పుడు తెగిపడతాయ అనే ఆందోళనలో ఉన్నారు. నెల రోజులు అవుతున్న విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకుండా వ్యవహరించడం వలన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ఉన్నతాధికారులకు, రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత ద్వారా తెలియజేసినప్పటికీ నేటి వరకు చర్యలు చేపట్టలేదని ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. అధికారులు స్పందించి తొలగిస్తారో.. చూస్తూ వదిలేస్తారు వేచి చూడాల్సిందే.!

## భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిద్దాం

### పీసా కమిటీ సభ్యులు - రంజిత్ కుమార్



**అరకులోయ, జూన్ 5, ప్రభాతవార్త:-** అరకులోయ మండలంలోని చినలబుడు పంచాయతీ కేంద్రంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న పెసా కమిటీ సభ్యులు రంజిత్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేసే వస్తువులను వీడనాడి, భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిద్దామన్నారు. ప్రకృతిని మనం కాపాడితే అదే మనల్ని కాపాడుతుందని, మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ బురిడి ఉపేంద్ర మాట్లాడుతూ ఆకుపచ్చని ఆశయాలతో స్వచ్ఛ హరితాంధ్ర అభివృద్ధికి కలసికట్టుగా అడుగులు వేసి మంచి ఫలితాలు సాధిద్దామని చెప్పారు. ప్లాసిక్ వస్తువులు, క్యారీ బ్యాగులు వాడకానికి ఫుల్ స్టాపు పెట్టి గన్ని, గుడ్డ సంచులు మాత్రమే వినియోగించి అందరికీ ఆదర్శంగా నిలుద్దామని గ్రామపంచాయతీ ఎంపీటీసీ సభ్యురాలు గరం సీత ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా నాయకులు రంజిత్ కుమార్, జగబంద్, మధు, సర్పంచ్ ఉపేంద్ర తదితరులు మొక్కలను నాటారు. అలాగే మొక్కలు నాటుదాం - పర్యావరణాన్ని కాపాడుదాం అని గ్రామపంచాయతీ కార్యదర్శి బి మహేశ్వరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీ సీనియర్ నాయకుడు గరం పూర్ణచంద్ర, లక్ష్మణ్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు భగత్ రామ్, కీల్లో గాసి, తాంగుల దొంబు నాయుడు, చినలబుడు గ్రామ సచివాలయం సిబ్బంది కొర్ర దశరథ్ రామ్, సాగర సౌజన్య, రాజేశ్వరి, కీర్తి, ప్రవీణ్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోటి మొక్కలు నాటడమే లక్ష్యం

### ఏపీ ఎఫ్ డి సి రీజినల్ మేనేజర్ డాక్టర్. టి .జ్యోతి.



**చింతపల్లి జూన్ 5 ప్రభాతవార్త.** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ ఎఫ్ డి సి చింతపల్లి డివిజన్ లో ఘనంగా మొక్కలు నాటింపు కార్యక్రమాన్ని చేపట్టారు . గురువారం మండలంలోని కొమ్మంగి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏపి ఎఫ్ డి సి రీజనల్ మేనేజర్ డాక్టర్. టి. జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం 2025-26 కార్యక్రమంలో భాగంగా చింతపల్లి డివిజన్ ఆంధ్ర ప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏ పీ ఎఫ్ డి సి) మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటి మొక్కలు నాటడం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యానికి అనుగుణంగా 75 వేల మొక్కలను చింతపల్లి డివిజన్లో నాటడం జరిగిందన్నారు. మొక్కల సంరక్షణ ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం శుభ్రత పై దృష్టి పెట్టడం అందరు బాధ్యత అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పర్యవనం పట్ల అవగాహన పెరిగి, మరియు పచ్చదనానికి ప్రాధాన్యతను ఇస్తారన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ పి రత్నదీప, ఆర్ వి నగర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ ఏ త్రిమూర్తులు రెడ్డి, సర్పంచ్ పి లక్ష్మి, సెయింట్ డాన్స్ స్కూల్ సిబ్బంది, కొమ్మంగి గ్రామ పెద్దలు , మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డోమిని కుటుంబానికి దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి పరామర్శ



**ముంచంగిపుట్టు జూన్ 5 ప్రభాతవార్త** అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం దారెలా పంచాయతీ డింగూడ గ్రామంలో బోండా డోమిని అనారోగ్యంతో గురువారం మృతి చెందడంతో విషయం తెలుసుకున్న దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి డింగూడ గ్రామంలో చేరుకొని బోండా డోమిని పార్థివా దేహాన్ని నివాళి అర్పించిన అనంతరం డోమిని కుటుంబాన్ని పరామర్శించి దైర్యంగా ఉండాలని ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని దైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాణిక్యం, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత.....

### ముంచంగిపుట్టు కాఫీ ఎఈఓ కే శ్రీరాములు.



**ముంచంగిపుట్టు, జూన్ 5 ప్రభాతవార్త::** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ, చోటముఖిపుట్టు గ్రామంలో కాఫీ శాఖ ఏ ఈ ఓ కె. శ్రీరాములు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు వన దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టమన్నారు. పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు అందరూ సమిష్టి బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలు నాటి సంరక్షిస్తే పర్యావరణాన్నికి, మానవజాతికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. మండలంలో దారెల పంచాయితీలో పేటమాలిపుట్ గ్రామంలో, కిలగడ పంచాయతీలో చెరుపాకలు, బంగారుమెట పంచాయితీలో మెట్ట బాదిపుట్, కరిముఖిపుట్ పంచాయితీలో మెరకచింత, కించాయిపుట్ పంచాయతీలో వరకుగుమ్మి, పెద్దగూడ పంచాయతీలో పనస, బాకుబేడ గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టమన్నారు. గురువారం జరిగిన వన మహోత్సవంలో ముఖ్యఅతిథిగా కాఫీ ఏడి పాల్గొన్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగు రాయి సర్పంచ్ నరసింగరావు, సుజనకోట ఎంపిటిసి సుబ్బలక్ష్మి, వివిధ పంచాయితీల సర్పంచ్లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, కాఫీ డిపార్ట్మెంట్ ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలల్లో దోమల మందు పిచికారి



**రాజవొమ్మంగి, జూన్ 05 ప్రభాతవార్త** గురువారం లోదొడ్డి, వాతంగి గ్రామాల్లో గల గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలో జడ్డంగి పి.హెచ్. సి డా. నాగార్జున పర్యవేక్షణలో దోమల మందు పిచికారి చేశారు. పాఠశాలలు ప్రారంభానికి ముందు అన్ని ఆశ్రమ పాఠశాలలో దోమల మందు పిచికారి జరుగుతుందని సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్ తెలియజేశారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా దోమల వల్ల వచ్చే వ్యాధులు, నివారణలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చీడిపల్లి ప్రసాదు, హెల్త్ అసిస్టెంట్ కంచెం శామ్యూల్, ఏఎన్ఎంలు పి వి వి లక్ష్మి, లీలావతి, ఆశ వర్కర్లు మల్లేశ్వరి, లోవకుమారి, అక్కమ్మ, చంద్రకళ, యేసమ్మ పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

### ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 11152 మొక్కలు రైతులకు పంపిణీ



**కొయ్యూరు జూన్ 5 ప్రభాతవార్త** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలో పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఎంపీడీవో జీడివి ప్రసాదరావు, ఏపీవో అప్పలరాజు, పలువురు వీఆర్పీలు రైతులకు కొబ్బరి, మామిడి, నిమ్మ తదితర 11152 మొక్కలను పంపిణీ చేశారు. ఫారం ఫాండ్స్ గల ఒక్కో రైతుకు 16 మొక్కలు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాలలో మొక్కలు నాటారు. పెదమాకారంలో రేంజర్ శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజర్ సత్యనారాయణ, గార్డు ఎరుకులమ్మ, సర్పంచ్ నూకాలమ్మ, మాజీ సర్పంచ్ లోత భీమరాజు, హెచ్ఎం దేవేశ్వరరావు, విఆర్ఓ నూకరత్నం మొక్కలను నాటారు. కొయ్యూరు బాయ్స్1 ఆశ్రమ పాఠశాలలో ఎస్బివి మూర్తి, జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్ తదితర పాఠశాల సిబ్బంది మొక్కలను నాటారు. అలాగే మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫారెస్ట్ సిబ్బందితో కలిసి పాఠశాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు ఎంపిటిసి బిడిజన అప్పారావు, సర్పంచ్ వెంకటలక్ష్మి మొక్కలను నాటారు. పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని పలువురు నేతలు, అధికారులు అభిప్రాయపడ్డారు.

# పెదమాకవరంలో డిఆర్ డిపో ప్రారంభం



**కొయ్యూరు జూన్ 5 ప్రభాతవార్త** గురువారం మండలంలోని పెద మాకవరంలో డిఆర్డిపోను ప్రారంభించి, వినియోగదారులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ డిఆర్ డిపో ప్రారంభ కార్యక్రమంలో సర్పంచ్ సెగ్గే నూకాలమ్మ, వైస్ ప్రెసిడెంట్ సాతా మనోహర్. టిడిపి జిల్లా రైతు సంఘం నాయకుడు లోత భీమరాజు, వీఆర్వో రత్నం, గ్రామ పెద్దలు అచ్చులు, గాలి రవి, కృష్ణంరాజు, నడిగట్ల శ్రీను, జుర్రా రమేష్ కుమార్, అనంత్ మరియు సేల్స్ మేన్ జుంబు ప్రసాద్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. వృద్ధులకు, వికలాంగులకు ఇంటింటికి నిత్యవసరుకులు అందించనున్నట్టు సేల్స్ మాన్ ప్రసాద్ తెలిపారు.

## కూటమి పాలనలో జరుగుతున్న అవినీతి.. అక్రమాలు...

### అరాచకాలను ప్రజలలోకి తీసుకెళ్లి చైతన్య పరచాలి

కార్యకర్తలకు గాజువాక వైకాపా ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి పిలుపు



**గాజువాక,జూన్ 05,ప్రభాతవార్త:** ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అవినీతి.. అక్రమాలు...అరాచకాలను ప్రజలలోకి తీసుకెళ్లి చైతన్య పరచాలని వైకాపా శ్రేణులకు గాజువాక వైకాపా ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి పిలుపునిచ్చారు. పెదగంట్యాడ గాజువాక వైఎస్ఆర్ కాంగ్రెస్ క్యాంప్ ఆఫీస్ వద్ద గాజువాక నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మారిటిపూడి పరదేశీ ఆధ్వర్యంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి గాజువాక నియోజవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గాజువాక నియోజవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ పార్టీని బలోపేతం చేసి కూటమి పార్టీ ప్రభుత్వం అవనీత అక్రమాలను ప్రజల్లో తీసుకువెళ్లాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం అవుతున్నప్పటికీ ఎన్నికల్లో మేనిఫెస్టో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజలలోకి తీసికెళ్లి చైతన్యపరిచే విధంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అవినీతి అక్రమాలను ఇంటింటా ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీలో కష్టపడే ప్రతీ ఒక్కరికి ప్రాధాన్యత ఉంటుందని ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో గాజువాక నియోజవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని తిప్పల దేవన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మారేడుపూడి పరదేశి, గంగులూరి రోజా రాణి, గంట్యాడ గోవిందరాజు, కటికని కల్పన, కొల్లి దేవుడు, ములకలపల్లి వెంకటేష్, ధనాల ఉమా, పెద్దాడ కనకరాజు, వంగలపూడి శ్రీను, చీరాల సురేష్, ముప్పిడి రాజేష్, పెద్దాడ రాము, పెట్లా రెడ్డి, ప్రభాకర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రెయినేజీ పూడికతీత పనులకు శంకుస్థాపన

### ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త** కొమ్మాది నుంచి పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వరకూ రూ. 74.50 లక్షలతో నేషనల్ హైవేకి ఇరువైపులా డ్రైనేజీ పూడిక తీసే పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లగా డ్రైనేజీ పూడిక తీయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వర్షాలు పడినా డ్రైనేజీ పొండినా కాల్వలో మురుగంతా రోడ్డు మీదకి చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు. జీవీఎంసీ 5, 6, 7 వార్డులకు ఉపయుక్తంగా ఉండే ఈ పనులను వర్షాకాలంలో పే త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ఈకార్యక్రమంలో భీమిలి జనసేన ఇంచార్జ్ పంచకర్ల సందీప, కార్పొరేటర్లు మెఉల్లి లక్ష్మణరావు, అచ్యుతరావు, జోనల్ కమిషనం కనక మహాలక్ష్మీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతిరాజు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### వార్డ్ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ



**ఆరిలోవ, జూన్ 5, ప్రభాతవార్త** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక 13 వ వార్డు అన్నా క్యాంటీన్ వద్ద ప్లాస్టిక్ వాడుక నివారణకు సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వార్డ్ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రజలు గుడ్డ సంచులను వాడాలని, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ బదులుగా స్టీల్, రాగి వాటర్ బాటిల్స్ వాడుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ వాడటం వలన ఎన్నో జీవరాసులు అంతరించిపోతున్నాయని, పర్యావరణ పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు పాత్రికొండ ధర్మారావు, కార్యదర్శి, వై. సురేష్ , క్లస్టర్ ఇంచార్జ్ బాలస్వామి, సానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

## పద్మనాభం జంక్షనులో ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠా.



**పద్మనాభం, జూన్ 5, ప్రభాతవార్త:** పద్మనాభం జంక్షనులో వేంచేసియున్న అభయాంజనేయస్వామి ఆలయ శిఖర పునః ప్రతిష్ఠా కార్యక్రమంను ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అర్చకులు ఆలయం ప్రాంగణంలో హెూమాలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆలయ శిఖరంను సుమూహూర్తం ప్రకారం ఎనిమిది నుండి తొమ్మిది గంటల మధ్య అర్చకులు వేదమంత్రాలతో ప్రతిష్ఠా మహోత్సవం ను నిర్వహించారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహంను గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో బారీ అన్న సంతర్పణ చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, సర్పంచ్ పాప,ఎంపీటీసీ లక్ష్మీనాయుడు, నాయకులు గాడు అప్పలరాజు, ఎర్రినాయుడు,పద్దు, ఆటో సంఘ నాయకులు పాల్గొన్నారు.

## కొయ్యూరు బాయ్స్1 పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

### హెచ్ఎం ఎస్ బి వి మూర్తి ప్రకటన



**కొయ్యూరు జూన్ 5 ప్రభాతవార్త** 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలాల్లోని కొయ్యూరు బాయ్స్ 1 ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలను ఆహ్వానిస్తున్నట్టు హెచ్ఎం ఎస్ బి వి మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాలుగవ తరగతిలో 6, ఐదవ తరగతిలో 12, ఆరవ తరగతిలో 24, ఏడవ తరగతిలో 48, ఎనిమిదవ తరగతిలో 31, 9వ తరగతిలో 60, పదవ తరగతిలో 40 మొత్తం 221 సీట్లు ఖాళీగా ఉన్నట్టు, అర్హులైన విద్యార్థుల నుండి ప్రవేశ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు హెచ్ఎం ఎస్ బి వి మూర్తి వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో వనమహోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంబటి రాము, అంబటి నూకరాజు, జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

### పర్యావరణం పదిలంగా ఉంటేనే...

# మానవజాతి మనుగడ...!

### పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి : డీఎఫ్ఓ బబిత

### కూనవరంలో ఘనంగా పర్యావరణ దినోత్సవ వేడుకలు



**కూనవరం, జూన్ 5, ప్రభాతవార్త :** పర్యావరణం పదిలంగా ఉంటేనే.. మానవ జాతి మనుగడ అని, పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని చింతూరు డీఎఫ్ఓ బబిత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా అల్లూరి జిల్లా కూనవరం మండలంలో పలు గ్రామాలలోనూ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, వైద్యశాలల వద్ద, వివిధ కూ డళ్ళలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం జరిగింది. చింతూరు డివిజన్లోని 5 రేంజ్ లలో ఒక్కొక్క రేంజ్ లో 7వేల మొక్కలను నాటాలన్న లక్ష్యాన్ని నిర్ణయించడం జరిగిందని రేంజ్ అధికారి కరుణాకర్ అన్నారు. పెది గూడెం, రేపాక, భగవాన్, బొడ్డుగూడెం గ్రామాలలో ఫారెస్ట్ శాఖధికారులు పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని తలపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ బబిత పాల్గొనడం జరిగింది. పెది గూడెం గ్రామంలో నూతనంగా నూతనంగా వివాహం అయిన నవ వధూవరులతో కూడా మొక్కలు నాటించడం జరిగింది. మండలంలో కోతుల గుట్ట వద్దనున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద ఘనంగా వనమహోత్సవ%శీ% కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ బాబు ఆధ్వర్యంలో మొక్కలను నాటడం జరిగింది. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ తేజ, ఫార్మాసిస్టు తుష్టి జోగారావు, వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, రమేష్, తులసి, తేజ, ప్రసాద్ మరియు ఆరోగ్య మిత్ర సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో అడవుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్లక్ష్యంగా వేయవద్దని, బాధ్యతగా గుర్తేరగాలని ఫారెస్ట్ అధికారులు అన్నారు. అనంతరం రహదారుల చెంతన ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలను సమీకరించి తదుపరి చర్యల నిమిత్తం వాటిని సచివాలయాలకు తరలిస్తామని తెలిపారు. పైదిగూడెంలో జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో ఫారెస్ట్ శాఖ అధికారులతో పాటు జడ్పిటిసి గుజ్జా విజయ, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## మారుమూల కునుకూరులో 'గ్రౌండింగ్ మేళా '

### పక్కాఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎంపీడీవో



**కొయ్యూరు జూన్ 5 ప్రభాతవార్త** మండలంలోని మారుమూల బూదరాళ్ల పంచాయతీ కునుకూరు గ్రామంలో హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో గ్రౌండింగ్ మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జీడివి ప్రసాద్ రావు పాల్గొని గ్రామంలోని 12 ఇళ్లకు గాను భూమి పూజ చేసి, పనులను ప్రారంభించారు. జన్మాన్ ఇళ్ల నిర్మాణాల గూర్చి పివిటిజి లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ గోవింద్ మాట్లాడుతూ - బూదరాళ్ల పంచాయతీకి 277 ఇళ్ళు మంజూరైనట్టు, అందులో కునుకూరు గ్రామానికి 12 ఇళ్ళు మంజూరైనట్టు వివరించారు. లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డ్ మెంబర్ సంజీవ్, స్థానిక పంచాయతీ సెక్రెటరీ, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 23వ రోజుకు జేఏసీ రిలే నిరాహార దీక్షలు..



**పాడేరు,జూన్5, ప్రభాతవార్త:** షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలను డిమాండ్ చేస్తూ జేఏసీపాడేరు ఐటిడిఎ ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్షలు ఎదుట గురువారంతో 23 వ రోజుకు చేరుకుంది, 23వ దీక్ష శిబిరాన్ని దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్రకమిటీ సభ్యులు సమరెడ్డి మాణిక్యం పాల్గొని సంపూర్ణ మద్దతు తెలియజేసారు. ఉద్యమం మరింత ఉధృతం చేసే విధంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, అలాగే షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేసేంతవరకు ఎటువంటి విరమణ ను ప్రకటించే అవకాశం లేదని జేఏసి ప్రభుత్వాన్ని హెచ్చరించింది.ఈ దీక్ష శిబిరంలో జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర,డీ ఎల్ ఓ ప్రతినిధులు ధనుంజయ్,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## చెరువును తలపించిన ఐసిడిఎస్ కార్యాలయం

### వర్షపు నీరు లోపల చేరడంతో తడిసి ముద్దైన రికార్డులు.



**చింతపల్లి జూన్ 5 ప్రభాతవార్త.** అల్లూరి జిల్లా, చింతపల్లిలో గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో భారీ కుండ పోత వర్షం కురిసింది. దీంతో హనుమాన్ జంక్షన్ సాయిబాబా గుడి గొప్పు నుండి హైవే రహదారి సైడ్ కాలువ గుండా జోరుగా వర్షపు నీరు రావడంతో వరద నీరు ఉద్రిక్తతో ప్రవహించి ఐసిడిఎస్ ఆఫీసు రూమ్ లో నీరు చేరి ఆఫీసు మొత్తం దీనివల్ల సిస్టమ్స్, ఆఫీస్ రికార్డ్స్, ఫర్ని చర్ తదితర వస్తువులన్నీ తడిసి ముద్దయి పోయాయి.అలాగేహైవే అనుకోని ఉన్న దుకాణాలు కిరాణా సామాన్లు మొదలగు తడిసిపోయి భారీ నష్టం వాటిల్లింది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి వరదనీరు క్రింది భాగానికి వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## మొక్కలు నాట్టుద్దాం, పర్యావరణం కాపాడుద్దాం

### రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



**అనంతగిరి: జూన్ 5 ప్రభాతవార్త.** మండలం చిలకలగెడ్డ పంచాయతీ కేంద్రంలోని అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమంలో రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.. అనంతరం రాష్ట్ర కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు, జిల్లాలో మూడు లక్షల నాటాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మానవుడు తన స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతి వనరులను విచక్షణారహితంగా వాడుకోవడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. మనం చేసే పనులే మన ఆరోగ్యాన్ని సూచిస్తాయన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ ముఖ్య లక్ష్యం పర్యావరణ పరిరక్షణ, కాలుష్యం తగ్గింపు, సుస్థిర జీవనంపై ప్రజలలో అవగాహన కల్పించడమన్నారు. కాలుష్యం (గాలి, నీరు, భూమి), వాతావరణ మార్పులు (గ్లోబల్ వార్మింగ్), అడవుల నరికివేత, నీటి కొరత వంటి అనేక సమస్యలు జీవరాశి మనుగడకు ముప్పుగా పరిణమిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ దినోత్సవం పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తు చేస్తోందని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం కేవలం ఒక రోజు వేడుక కాదు, ఇది పర్యావరణం పట్ల మన బాధ్యతను నిరంతరం గుర్తు చేసే ఒక ముఖ్యమైన అవకాశమన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం మన గ్రహాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోందని, పర్యావరణ వ్యవస్థలు,శ్రేయస్సు వాతావరణానికి హాని కలిగిస్తుందని, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నదులు మూసుకుపోతాయని, సముద్రాన్ని కలుషితం చేస్తాయని, వన్యప్రాణులను ప్రమాదంలో పడేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి ప్రపంచంలోని అన్ని దేశాలు ఒకే మాటపై ఉండాలన్నారు. కాబట్టి ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు ప్లాస్టిక్ కాలుష్యాన్ని శాశ్వతంగా ఓడిరచడానికి మనమందరం నిబద్ధత కలిగి ఉందామని పిలుపునిచ్చారు. పర్యవరణ పరిరక్షణ కోసం చెట్లు నాటడం, వాటిని సంరక్షించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, పునర్వినియోగం రీసైక్లింగ్ చేయడం, నీటిని పొదుపుగా వాడటం, విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం, ప్రజా రవాణాను ఉపయోగించడం లేదా సైక్లింగ్ చేయడం, వ్యర్థాలను సరిగ్గా పారవేయడం, సేంద్రీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం తదితర వాటిని మనం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుబ్బారావు మాజీ మండల అధ్యక్షులు బుజ్జిబాబు, మాజీ ప్రధాన కార్యదర్శి ఆనందరావు, మండల ప్రధాన కార్యదర్శి భీమరాజు, ఉపాధ్యక్షుడు జగన్, క్లస్టర్ ఇంచార్జ్ నిర్మల, యూనిట్ ఇంచార్జి లక్ష్మణ్, సుందరరావు, నరేంద్ర, ఎంపీటీసీ మిథుల, టీడీపీ నాయకులు సన్నీ బాబు, తిరుపతిరావు, వెంకటి తదితరులు ఉన్నారు.

## కూనవరం జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రతిభా అవార్డులు...!



**కూనవరం, జూన్ 5, ప్రభాతవార్త:** కూనవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన ఇరువురు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. ద్వితీయ ఇంటర్లో ఉత్తమ మార్కులు సాధించిన వడ్లపాటి ఉదయ్ కుమార్, రా చమళ్ళ హదస్సా ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సిద్దా శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈ అవార్డుకు ఎంపికైన వారికి మెడల్ సర్టిఫికెట్ తో పాటు 20వేల రూపాయల నగదు బహుమతి అందజేయడం జరుగుతుందన్నారు. ఈనెల 9న జిల్లా కేంద్రం పాడేరులో ఈ అవార్డులను అందుకోనున్నారని ఆయన తెలిపారు. ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర ప్రతిభా అవార్డులకు ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులకు కళాశాల అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది, మరియు తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

# జయ జయహే అక్షర దేవళ్ల !



తెలంగాణ అధికారిక గీతానికి అద్భుతమైన నాట్యంతో అందరి మనసులు దోచుకుంటోంది అక్షర దేవళ్ల. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊది, ప్రతీ ఒక్కరి గుండెల్లో చైతన్యాన్ని నింపిన ఈ అందెశ్రీ పాటకు తెలంగాణ సాకారమైన పదేళ్ల తర్వాత అధికారిక హోదా దక్కింది. ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సంగీత స్వరకల్పనలో కొత్తదనం అందుకున్న జయ జయహే తెలంగాణ పాటకు సంప్రదాయ నృత్యంతో మరింత అందాన్ని అక్షర దేవళ్ల తీసుకొచ్చింది. ఆమె నర్తించిన ఈ పాట ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తెలంగాణ ప్రకృతి అందాల మధ్యన అద్భుతమైన హావభావాలతో నర్తించి జయ జయహే తెలంగాణ పాటకు అక్షర ప్రాణం పోసింది. తన తల్లి, గురు భావన పెదప్రోలు దగ్గర నృత్యశిక్షణ తీసుకున్న అక్షర దేవళ్ల మూడేళ్ల నుంచే ప్రదర్శనలు ఇస్తోంది. భామా కలపం నృత్య నాటకాన్ని ఇటీవలే ఏకధాటిగా గంటన్నర పాటు ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకొంది. అలాగే సమతా కుంభ్ రెండో వార్షికోత్సవ వేడుకల్లో ప్రత్యేక నృత్య ప్రదర్శన ఇవ్వడంతో పాటు, వెయ్యి మంది చిన్నారులు ప్రదర్శించిన "సహస్ర గోదా వైభవం" పాటకు నృత్య రీతులను సమకూర్చినందుకు వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, గ్లోబల్ స్టార్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులు అందాయి. ఆమె నృత్య ప్రతిభకు ముగ్ధులైన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి, తన ఆశ్రమానికి డ్యాన్స్ అండ్ కల్చరల్ అంబాసిడర్‌గా నియమించారు. ఆశ్రమంలో ఎలాంటి కార్యక్రమం జరిగినా అక్షర నృత్య ప్రదర్శనను తప్పనిసరి చేశారు. దీంతోపాటు మలేషియాలో గత ఏడాది జరిగిన బాటు కేవ్స్ ఫెస్టివల్‌లోనూ భారత దేశం తరపున నృత్య ప్రదర్శన ఇచ్చింది కూచిపూడి నృత్యంతోనే కాకుండా నటనతోనూ మెప్పిస్తూ ఆల్‌రౌండర్ అనిపించుకొంటోంది అక్షర. తెలుగు చిత్ర పరిశ్రమలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా రాణిస్తూ ఇప్పటికే దాదాపు 12 సినిమాల్లో నటించింది. ఆమె కీలక పాత్రలు పోషించిన ప్రభాస్ రాజాసాబ్, హీరో నితిన్ తమ్ముడు, దుల్కర్ సల్మాన్ ఆకాశంలో ఒక తార, డైరెక్టర్ కేకే తీసిన కేజేక్యూ, శోభిత దూళిపాళ్ల చీకట్లో సినిమాలు రాబోతున్నాయి. పుమా, అపర్ణ, మాంచెస్టర్స్ గ్లోబల్, దాదూస్, క్యారెట్ జ్యూయలరీస్ ప్రకటనల్లోనూ నటించింది. అటు నటన, ఇటు నృత్య ప్రదర్శనలతో బిజీగా ఉన్నా చదువులోనూ టాప్ ర్యాంకర్‌గా కొనసాగుతోంది. అన్నింటా ఆల్‌రౌండర్‌గా దూసుకెళ్తున్న అక్షర దేవళ్లకు ఆల్ ది బెస్ట్. ▫

# విద్యను సమాజ సేవకు జతచేస్తే..



ఇండోనేషియాలోని కొన్ని గ్రామాల ప్రజలకి కలుషిత నీరే శరణ్యం. దాంతో చిన్నా పెద్దా తేడా లేకుండా రోగాల బారిన పడటం చూసి చలించి మిస్ ఇండోనేషియా మోనికా కేజియా సెమింగ్. ఆ పరిస్థితులను మార్చాలనుకుంది. అదే తనని 'బ్యూటీ విత్ ఎ పర్పస్' టైటిల్‌ను గెలుచుకునేలా చేసింది. విద్యను సమాజ సేవకు జతచేస్తే... అది మరింత ప్రభావవంతమైన సాధనం అవుతుంది... అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తుందని నమ్మే అమ్మాయి మోనిక. ఇండోనేషియా లోని సుమత్రా నగరంలో పుట్టిపెరిగింది ఈమె. కెమికల్ ఇంజినీరింగ్ చేసింది. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తోంది. చిన్నప్పట్నుంచీ సంగీతం, బొమ్మలు గీయడం, సామాజిక సేవ అంటే ఇష్టం. పాఠశాల రోజుల నుంచే సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేది. అందులో భాగంగానే 2022లో కాంపంగ్ సిక్ అందుబాటులోకి వెళ్లింది. నీళ్లు, గాలి కలుషితం అవుతున్నాయి. మానవ మనుగడకు ముప్పుగా మారుతున్నాయి... లాంటి అంశాల్ని పుస్తకాల్లో చాలానే చదివాను. కానీ ప్రత్యక్షంగా చూసింది మాత్రం కాంపుంగ్ లోనే. చుట్టూ నదులూ, చెరువులతో అపార జలసంపద ఉన్న ప్రాంతం ఇది. కానీ, తాగడానికి గుక్కెడు మంచినీళ్లు లేవు. అక్కడి నదులూ, చెరువులన్నీ వ్యర్థాలతో కలుషితమయ్యాయి. దీనికి తోడు ఆ నీటినే నిత్యకృత్యాలు తీర్చుకోవడానికీ తాగడానికీ ఉపయోగిస్తున్నారు. అక్కడివాళ్లు పర్యవసానంగా అనారోగ్యాల బారిన పడుతున్నారు. చర్మ సంబంధిత సమస్యలు, కడుపు నొప్పి లాంటి కారణాలతో పిల్లలు విద్యకు దూరమవుతున్నారు. ఈ పరిస్థితులను మార్చాలనుకున్నా అనే మోనిక 2023లో 'వైడ్‌లైన్ ఫర్ లైఫ్‌లైన్' అనే ప్రాజెక్టును ప్రారంభించింది. సిసెక్ మూడు ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నది నుంచి మంచినీళ్లు తెచ్చే ప్రయత్నం చేసింది. అందుకు ప్రత్యేక పైప్‌లైన్ వేసి, గ్రామంలో నిర్మించిన మంచినీటి ట్యాంకుకు పంపింది. అక్కణ్నుంచి ప్రజలు స్వచ్ఛమైన నీటిని పట్టుకుంటున్నారు.

**ఒక్క గ్రామంతో ఆగిపోకూడదని..**

ఇండోనేషియాలో క్యాంపుంగ్ లాంటి ప్రాంతాలు చాలానే ఉన్నాయి. మంచినీరు అందించాలంటే తన గళం దేశవ్యాప్తంగా వినిపించనుంది.



అందాల పోటీని అందుకు మార్గంగా ఎంపికచేసుకుంది. పోటీల్లో పాల్గొని 2024లో మిస్ ఇండోనేషియా కిరీటాన్ని దక్కించుకుంది. మిస్ వరల్డ్72కి అర్హత సాధించి, ప్రపంచ వేదికపై తన లక్ష్యాన్ని చెప్పి, న్యాయనిర్ణేతలను మెప్పించింది. బ్యూటీ విత్ ఎ పర్పస్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఖితెలివి ఉన్నా నలుగురికి ఉపయోగపడనప్పుడు దానికి విలువ లేనట్లే. సామాజిక స్పృహ లేకుంటే అందానికి అర్థం లేదని చెప్పే మోనిక సేవా కార్యక్రమాలు ఇకపైనా కొనసాగించాలని కోరుకుంటూ....

ఆల్ ద బెస్ట్ చెప్పేద్దామా మరి!

# జీవ గడియారం ఎక్కువ



ఏ ఇంట్లోనైనా మహిళలే త్వరగా లేచి పనులు చక్కబెడుతుంటారు. ఎందుకంటే, స్త్రీలు మగవారి కంటే తొందరగా నిద్ర నుంచి మేల్కొంటారట. వాళ్ల జీవ గడియారం ఎక్కువగా తూర్పు టైమ్ జోన్ ప్రకారం ఉంటుంది. అందుకే వాళ్లు త్వరగా నిద్ర లేచి, త్వరగా నిద్రపోతారట. పైగా ఆడవాళ్లకు మగవారి కంటే 20 నిమిషాల ఎక్కువ నిద్ర అవసరమవుతుందట. ▫

వయసునుబట్టి పేస్‌ప్యాక్ ఉపయోగించడం అలవాటు చేసుకోండి. తలారా స్నానం చేయడానికి ముందుగ అయిల్‌బాగా మసాజ్ చేసుకోవాలి. లేదా నిమ్మరసం పెరుగు శనగపిండి కలిపి శరీరానికి మర్ధన చేసి స్నానం చేయండి. ▫

# వీటితో అలర్జీనా?

**ఆడవాళ్లకు, నగలకు అవినాభావ సంబంధం ఉంటుంది. అయితే వీటిని ఎంత ఇష్టంగా ధరించినా.. వీటి తయారీలో వాడే కొన్ని లోహాలు కొన్ని చర్మతత్వాలకు సరిపడవు. ముఖ్యంగా ఆర్టిఫిషి ఆడవాళ్లకు నగలకు అవినాభావ సంబంధం ఉంటుంది.** అయితే వీటిని ఎంత ఇష్టంగా ధరించినా వీటి తయారీలో వాడే కొన్ని లోహాలు కొంతమంది చర్మతత్వాలకు సరిపడవు ముఖ్యంగా ఆర్టిఫిషియల్ నగల విషయంలో ఈ సమస్య ఎక్కువగా తలెత్తుతుంటుంది. ఫలితంగా చర్మంపై ఎర్రటి దద్దుర్లు, దురద, మంట.. వంటి సమస్యలొస్తాయి. మరి, వీటి మంచి విముక్తి పొందడమెలాగో తెలుసుకుందాం ..



- ఆర్టిఫిషియల్ నగల తయారీలో నికెల్ లోహాన్ని వాడుతుంటారు. చాలామందిలో అలర్జీ రావడానికి ఇదే ముఖ్య కారణమంటున్నారు నిపుణులు. ముఖ్యంగా సున్నితమైన చర్మతత్వం ఉన్న వారిలో దీని కారణంగా దురద, దద్దుర్లు, ఎరుపెక్కడం.. వంటి సమస్యలొస్తాయంటున్నారు. అలాంటి వారికే ఈ విబలు మేలు వస్తుంది.
- నగల అలర్జీ ఉన్న వారు వాటిని ధరించే ముందు మాయిశ్చరైజర్, పౌడర్, క్యాలమైన్ లోషన్స్, వంటివి రాసుకోవాలి. ఇవి చర్మానికి కవచంలా పనిచేసి ఆయా లోహాల ప్రభావం చర్మంపై పడకుండా చేస్తుంది.
- అవుటిఫిట్ ఏదైనా.. కొంతమంది మెడ దగ్గరగా ఉండే చోకర్.. వంటి బిగుతుగా ఉంటే జ్యుయలరీని ఎంచుకుంటారు. దీనివల్ల గాలి ఆడక కూడా అలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే చాలా వరకు వదులుగా ఉండే నెక్‌పీస్‌లు, లాంగ్ చెయిన్స్,. ఎంపిక ఎంచుకోవాలి.
- ధరించే ముందు ట్రాన్స్‌పరెంట్ నెయిల్ పాలిష్‌ను నగలపై ఓ కోటింగ్ వేసి.. ఆపై వేసుకోవడం మంచిది. ఇది నగల్లోని లోహాల ప్రభావం చర్మంపై పడకుండా కాపాడుతుంది.
- ఆర్టిఫిషియల్ నగలే కదా అని వీటి విషయంలో చాలామంది శ్రద్ధ తీసుకోరు. తడిసినా, చెమట పట్టినా.. అలాగే వాటిని బాక్సుల్లో భద్రపరుస్తుంటారు. ఆ తడిదనం వల్ల నగల నాణ్యత, దెబ్బతిం టుంది. ఇది కూడా చర్మ అలర్జీలకు కారణమవుతుంది. కాబట్టి నగల్ని భద్రపరిచే ముందు పూర్తిగా ఆరనివ్వడం మేలు. అలాగే తేమ అధికంగా ఉండే ప్రదేశాల్లో వీటిని భద్రపరచ కూడదు. ▫

చెలి చిట్కా

# నమ్మాలంటే.. నవ్వాలి !

ఒక చిన్న నవ్వు.. చుట్టూ ఉన్న వాతావరణాన్నే మార్చేస్తుంది కదా! ఇది మానసిక ప్రయోజనాలనే కాదు, సామాజిక బంధాలు బలపడటంలోనూ కీలకపాత్ర పోషిస్తుందట. ఇతరులకు మనపై నమ్మకం ఏర్పడేలా చేసేదీ ఓ చిన్న స్మైలేనని జర్నల్ సైకలాజికల్ సైన్స్ పరిశోధనలు చెబుతున్నాయి. ఎదుటివారిని చూసి చిన్న నవ్వు నవ్వినప్పుడు.. నేను స్నేహపూర్వకంగా ఉంటాను. నాతో ప్రమాదం లేదు. నాతో ఎప్పుడైనా



మాట్లాడొచ్చు లాంటి పాజిటివ్ సంకేతాలు వాళ్లకు వెళతాయట. ఈ ఫీలింగ్ తెలియని వారికే కాదు, బాగా తెలిసిన వారికీ మనపై మరింత ప్రేమ, నమ్మకం ఏర్పడానికీ ఇది దోహదపడుతుందట. దీనికోసం పరిశోధకులు ఓ ప్రయోగం చేశారు. అందులోని వ్యక్తులను రెండు గ్రూపులుగా విభజించి తెలియని వ్యక్తితో ఇంటర్వ్యూ చేయించారు. దాన్ని వీడియో రికార్డు చేశారు. అందులో ఓ గ్రూపు వాళ్లకు నవ్వుతూ మాట్లాడమనీ, మరో గ్రూపు వాళ్లకు ఎలాంటి భావోద్వేగాలూ లేకుండా ఉండమనీ చెప్పారు. నవ్వని వారితో పోలిస్తే నవ్వుతూ మాట్లాడిన వారు ఎక్కువ నమ్మదగిన వారిగా ఉన్నట్లు గుర్తించారట. కాబట్టి, ఇతరుల నమ్మకాన్ని చూరగొనాలంటే పెదవులపై చిరునవ్వు మాత్రం చెరగనీయొద్దు. ▫

# చర్మ సమస్యలకు చెక్ !

మహిళలు ముఖ సౌందర్యాన్ని తగ్గించే సమస్యల్లో ముడతలు, పిగ్మెంటేషన్ ప్రధానమైనవి. ముడతలతో వయసు పైబడిన వారిలా కనిపిస్తే.. పిగ్మెంటేషన్ మచ్చలతో ముఖమంతా అంద విహీనంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో బాదం పప్పును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఈ సమస్యలను అధిగమించవచ్చని చెబుతున్నారు నిపుణులు.




.క్యాలరీలు తక్కువగా ఉండే బాదం పప్పును చాలామంది బరువు తగ్గించుకోవడానికి స్నాక్స్‌గా వినియోగిస్తారు. ఇందులోని విటమిన్-'ఇ'తో పాటు మోనో అన్‌శ్చాచురేటెడ్ కొవ్వుల కారణంగా వీటిని నిత్య తీసుకునే మహిళల్లో గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం తక్కువని అధ్యయనాల్లో తేలింది. ఇలా ఎన్నో ప్రయోజనాలున్న బాదం పప్పుతో మహిళల్లో ముఖం పైన ముడతలు, పిగ్మెంటేషన్ మచ్చలు కూడా మాయమవుతాయని చెబుతున్నారు నిపుణులు.

**ఈ.. అదే కారణం...**

బాదంలో విటమిన్6ఇ, అన్‌శ్యాచు రేటెడ్ కొవ్వులతో పాటు పలు పోషక పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి మెనోపాజ్ దశలో మహిళల ముఖంపైన ఏర్పడే ముడతలు, పిగ్మెంటేషన్ సమస్యల తీవ్రతను తగ్గించేస్తాయి అంటున్నారు చర్మసౌందర్య నిపుణులు.

**అందుకే ఇవి డైట్‌లో ఉండాల్సిందే!** ప్రతిరోజూ బాదం పప్పులు తినడం వల్ల మహిళల ముఖంపై ముడతలు తగ్గడమే కాకుండా చర్మంపు రంగులో కూడా మార్పులొస్తాయి. బాదం పప్పుల్లో విటమిన్'ఇ' అధికంగా ఉంటుంది. వీటితో పాటు అత్యవసర ప్యాటీ ఆమ్లాలు, పాలీఫినాల్స్ కూడా సమృద్ధిగా ఉంటాయి. మహిలలు తమ చర్మం ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు ఈ పోషకాలు ఎంతగానో సహకరిస్తాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని మహిళలు, ముఖ్యంగా మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు తమ రోజువారీ డైట్‌లో బాదం పప్పులను చేర్చుకోవడం ఎంతో ముఖ్యం అని వారు సూచిస్తున్నారు. ▫



# ఆరోగ్యానికి పండ్ల పిండ్లు

**నెలవారీ పచారీ సరకులు రాసేటప్పుడు సాధారణంగా మన జాబితాలో బియ్యప్పిండి, గోధుమపిండి, సెనగపిండి.. ఇవి ఉంటాయి కదా!**



ఇక నుంచి వీటితోపాటు.. అనాసపిండి, స్ట్రాబెర్రీపిండి, పనసపిండి వంటి పండ్ల పిండ్లు కూడా తోడుకావొచ్చు. పండ్లతో పిండి ఏంటా అని ఆలోచిస్తున్నారా? ఇది నిజమే. బేకింగ్ చేయాలన్నా, కొన్ని రకాల పిండి వంటలు చేయాలన్నా.. మనకి మైదా ఠక్కున గుర్తొస్తుంది. కానీ ఈ మైదాలో పీచు ఉండదు. పైగా కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. దాంతో ఆరోగ్యానికి ఎంత మాత్రం మంచిది కాదని తేలిపోయింది. దాని మోతాదుని తగ్గించుకొనేందుకు, ప్రత్యామ్నాయంగా మార్కెట్లో మనకి పండ్లతో తయారుచేసిన పనసపిండి, అరటిపిండి వంటి పండ్ల, పొడులు దొరుకుతున్నాయి. వీటిని గోధుమపిండివంటి వాటితో కలిపి వాడటం వల్ల అదనపు పోషకాలూ అందుతాయి.



రుచీ పెరుగుతుంది.

**పనసపిండి: ..** దీనిని చపాతీ పిండిలోకి, కూరల్లోకి, సూపుల్లోకి వేసుకోవచ్చు. పీచుతో పాటు ప్రొటీన్‌ని సమృద్ధిగా అందిస్తుంది రుచి కూడా పెరుగుతుంది.

**నేరేడు పిండి :** సీజన్‌లో తప్ప మళ్లీ కనిపించని ఈ పండు పిండి రూపంలో రావడం మన అదృష్టమే. ఆంటీ ఆక్సిడెంట్లు నిండుగా ఉండే ఈ పిండి స్మూథీల్లో వాడుకోవచ్చు. దీనికుండే చక్కని రంగు కావాలనుకుంటే స్వీట్లలో కూడా వాడుకోవచ్చు.



**ఖర్జూరం :** వంటల్లో పంచదార వాడకుండా ప్రత్యామ్నాయంగా ఈ పిండిని వాడుకోవచ్చు. స్వీట్ల తయారీలో, బేకింగ్‌లో వడతారు.

**అనాసపిండి :** కేకులు, పుడ్డింగులు, మిఠాయిల తయారీలో ఈ పిండిని వాడుకోవచ్చు. అద్భుతమైన రుచి.. మనసు దోచే పరిమళం రెండూ వంటకాలకి తోడవుతాయి.



**దానిమ్మ:** కూరలకి పుల్లటి రుచి కావాలనుకున్నప్పుడు, చాట్‌మసాలాకి ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు. బేకింగ్, సూపులకు మంచి రుచి ఇవ్వడానికి ఇది ఉపయోగపడుతుంది.

**ఆరెంజ్, స్ట్రాబెర్రీ మామిడి** పొడులను కూడా బేకింగ్‌లో రుచి కోసం వాడుతుంటారు. ▫





ఆధ్యాత్మికం

# భావనా ప్రభావం

మనసులో జనించే ఆలోచనను 'భావన' అంటాము. మనుషుల మనసులలో అనేక భావనలు నిరంతరం చెలరేగుతూనే ఉంటాయి. వాటిలో కొన్ని మంచి భావనలైతే, మరికొన్ని చెడు భావనలు ; కొన్ని సత్యమైనవి, మరికొన్ని ఊహా జనితమైనవి ; కొన్ని సాధింపగలిగేవి, మరికొన్ని అసాధ్యమైనవి ; కొన్ని మనలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించేవి, మరికొన్ని ఆత్మ న్యూనతకు దారి తీసేవి ... ఇలా రకరకాల భావనలు పరిభ్రమించే సుడిగుండం మనిషి మనస్సు అని చెప్పవచ్చు. ఆ మనస్సే బంధ మోక్షాలకు కారణమని ఉపనిషత్తులు చెబుతున్నాయి. యోగవాశిష్ఠం కూడా "యత్ చిత్తం తన్మయో భవతి పూరు షః " అన్నది. మనసెలా భావించి నిర్దేశిస్తే అలాగే మనిషి ప్రవర్తిస్తాడు. ఆవిధం గానే తనను తాను రూపు దిద్దుకొంటాడు. మనము మన మనసు ఏ భావనలతో నిండి ఉంటుందో తెలుసుకోవడం ముఖ్యం. అది భయంతోనా, అసూయతోనా, కోపంతోనా, ధైర్యంతోనా, ఆకర్షణలతోనా, వైరాగ్యంతోనా, ప్రేమ లేక ద్వేషంతోనా అని తెలుసుకొన్నాక మనలను మనం సరిదిద్దుకోవడం సులభతరమవుతుంది. కరుశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు ఇలా చెప్పారు. "ప్రార్థనముల పుణ్య తీర్థంబులందున/ గురులయందు, వైద్య వరులయందు, భావమెట్టి దట్టి ఫలతంబు ప్రాప్తించు/ లలత గుణజాల తెలుగుబాట! ప్రార్థనలు చేసినా, పుణ్య పదులలో స్నానాలు చేసినా గురువుల బోధనలు గ్రహిస్తున్నా, వైద్యుల చికిత్సలను పొందుతున్నా. ఆయా అంశాలలో మనకు నమ్మకం. విశ్వాసం ఉంటేనే అవి మనకు అనుకూలమైన ఫలితాలనిస్తాయి లేకుంటే అవి మనకు ఉపయోగపడవు. సానుకుల దృక్పథం ఉంటేనే కార్యసిద్ధి కలుగుతుంది. యద్భావం తద్భవతి అనే పెద్దల మాట కానీ 'యామతి స్సా గతిర్భవేత్' (మతి ఎలా ఉంటే గతి అలా అవుతుంది) అనే అష్టావక్రగీతా వాక్యం కానీ ఈ విషయాన్నే ధృవీకరిస్తున్నాయి. ▫

# చిన్నారులకు సపోర్ట్‌గా..



కారులో దూర ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కొంతసేపు సరదాగా గడిపినా.. ఆ తర్వాత అలసిపోయి పిల్లలు నెమ్మదిగా నిద్రలోకి జారుకుంటారు. కనుకు వేసేలోపే మెడనొప్పి అంటూ పెద్దవాళ్ల బడి వెతుక్కుంటారు. ఇలా ఎంతో దూరం ప్రయాణించలేరు. సరదాగా సాగాల్సిన టూర్ అనారోగ్యాలతో పూర్తవుతుంది. అలా కాకుండా ఉండాలంటే ఈ దిండ్లు ఉండాల్సిందే. సీట్‌బెల్ట్‌లా.. కారు సీటు బెల్ట్‌కు ఈ దిండును



తొడిగే వీలుంటుంది. లేదా స్ట్రాప్‌తో అటాచ్ చేయుచ్చు. పిల్లలు కూర్చున్న వెంటనే దిండు తొడిగిన బెల్ట్ వేస్తే చాలు. కదలకుండా ఉంచడమే కాదు. మెత్తగానూ అనిపించే ఈ దిండు తల్లి వద్ద ఉన్న అనుభూతిని అందిస్తుంది. ఎటువంటి అసౌకర్యం లేకుండా చిన్నారులు హాయిగా నిద్రలోకి జారుకుంటారు. వీటిలో కొన్ని చిన్నారులకు భుజం నుంచి పొట్ట చుట్టూతా వచ్చేలా పొడవుగా ఉండే రకాలున్నాయి. రకరకాల జంతువుల బొమ్మల ఆకారాల్లోనూ, ఆకర్షణీయమైన రంగుల్లోనూ ఇవి లభ్యమవుతున్నాయి. అలాగే మరికొన్ని మెడ వరకు మాత్రమే వచ్చేలా అర్థచంద్రాకారంలో తలకు మాత్రం సపోర్ట్ ఇస్తాయి. ▫


# 'లక్ష్మీ నరసింహా' రీరిలీజ్ బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్ లక్ష్మీ నరసింహా మరోసారి థియేటర్స్‌లో అలరించడానికి సిద్ధమైయిం ది. జయంత్ సి.పరాన్జీ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత బెల్లం కొండ సురేష్ నిర్మించిన ఈ చిత్రం 2004లో విడుదలైన ఘన విజయాన్ని అందుకుంది. ఈ చిత్రాన్ని 4కె వెర్షన్‌లో జూన్ 8న థియేటర్స్‌లో వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రీ రిలీజ్ చేస్తున్నారు. రీరిలీజ్ వెర్షన్‌లో కొత్త పాట యాడ్ చేశారు. మందేసినోడు అంటూ సాగే పాటని భీమ్స్ సిసిరోలియో అన్‌స్టాపబుల్ వైబ్‌తో కంపోజ్ చేశారు. స్వరాగ్ కీర్తన్ హై ఎనర్జీతో పాడిన ఈ సాంగ్‌కి ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ మాస్‌ని కట్టిపడేసే లిరిక్స్ అందించారు. రీరిలీజ్ ప్రెస్ మీట్‌లో ఈ సాంగ్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ప్రెస్ మీట్‌లో నిర్మాత బెల్లం కొండ సురేష్ మాట్లాడుతూ, అందరికీనమస్కారం. ఈ సినిమా రీరిలీజ్‌ని లైఫ్‌లో మర్చిపోలేను. 21 ఏళ్ల తర్వాత లక్ష్మీ నరసింహ సినిమాని రీరిలీజ్ చేస్తున్నానంటే నందమూరి అభిమానులకు ఏదో ఒక స్పెషల్, సర్ప్రైజ్ ఇవ్వాలి. ఎలాంటి సర్‌ప్రైజ్ అని ఆలోచన వచ్చినప్పుడు.. ఈ సినిమా కోసం రెండు సాంగ్స్ చేశాం. ఒక సాంగ్‌ని షూట్ చేసాంగాని సినిమాలో లేదు. ఆ సాంగ్‌ని ఎలాగైనా రీరిలీజ్‌లో యాడ్ చేయాలి అని ఆలోచన వచ్చింది. ప్రసాద్ ల్యాబ్స్‌లో నెగిటివ్ దొరికింది. కానీ సౌండ్ దొరకలేదు సౌండ్ లేదు. ఓన్లీ పిక్చర్ ఉంది. పిక్చర్ ప్రింట్ చేసి ఫస్ట్ చంద్రబోస్‌కి, తర్వాత డైరెక్టర్‌కి, భీమ్స్‌కి పంపించాను. వాయిస్, లిరిక్ రాసి రికార్డు చేయాలని చెప్పాను. బోస్ ఇది ఎలా పాజిబుల్ అన్నారు. చేస్తేనే పాజిబుల్ అవుతుందని చెప్పాను. ఒకసారి ప్రయత్నించమని చెప్పాను. అయితే ఈ ప్రయత్నాన్ని అద్భుతంగా చేశారు. ఈ పాటని డిస్ట్రిబ్యూటర్స్‌కి వినిపిస్తే పాట అద్భుతంగా ఉంది. కొత్త సినిమాల్లో పెట్టండి బ్లాక్ బస్టర్ అవుతుంది అని చెప్పారు. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. డైరెక్టర్ జయంత్ సి.పరాన్జీ మాట్లాడుతూ, అందరికినమస్కారం. సురేష్‌కి థాంక్యూ. ఇలాంటి కొత్త ఐడియాలన్నీ సురేష్‌కి వస్తాయి. ఆడియో లేని ఈ సాంగ్‌కి ఏదైనా చేద్దామని ఆయన అన్నప్పుడు నేను ఇంపాజిబుల్ అని చెప్పాను. ఆయన, చంద్రబోస్, భీమ్స్ కలిసి ఈ అద్భుతం చేశారు. ఒక ఇంపాజిబుల్ టాస్‌ని పాజిబుల్ చేసి చూపించారు. ఇళయరాజా ఇలాంటి ఒక ప్రయోగం చేశారని ఎప్పుడో విన్నాను. అయితే అది ఒక మాంటేజ్ సాంగ్.



## 'రానా నాయుడు సీజన్ 2': నాగనాయుడు పాత్ర సూపర్బ్

ప్రేక్షకుల మనసుల్ని గెలిచిన కల్ట్ క్లాసిక్ హిట్ అందాల రాక్షసి మరోసారి అలరించడానికి సిద్ధమైంది. ఈ ఎవర్ గ్రీన్ లవ్ స్టోరీ జూన్ 13న రీరిలీజ్ కాబోతోంది. నవీన్ చంద్ర, రాహుల్ రవీంద్రన్, లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహించారు. వారాహి చలనచిత్రం బ్యానర్‌పై సాయి కొర్రపాటి, ఎస్.ఎస్. రాజమౌళి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 10,



2012 న విడుదలై ఘన విజయాన్ని సాధించింది. భిన్నమైన ప్రేమ కథ, లోతైన భావోద్వేగాలతో ప్రేక్షకుల మనసులో నిలిచిపోయేలా ఈ సినిమా అద్భుతంగా తెరకెక్కించారు దర్శకుడు హను రాఘవపూడి. రధన్ మ్యూజిక్ ఎవర్ గ్రీన్‌గా నిలిచింది. ఇందులో పాటలన్నీ సూపర్ హిట్‌గా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాకు కల్ట్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడీ మ్యాజిక్ మళ్లీ బిగ్ స్క్రీన్‌పై ఎక్స్‌పీరియన్స్ చేయడానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



## 13న 'అందాల రాక్షసి' రీరిలీజ్

ప్రేక్షకుల మనసుల్ని గెలిచిన కల్ట్ క్లాసిక్ హిట్ అందాల రాక్షసి మరోసారి అలరించడానికి సిద్ధమైంది. ఈ ఎవర్ గ్రీన్ లవ్ స్టోరీ జూన్ 13న రీరిలీజ్ కాబోతోంది. నవీన్‌చంద్ర, రాహుల్ రవీంద్రన్, లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహించారు. వారాహి చలనచిత్రం బ్యానర్‌పై సాయి కొర్రపాటి, ఎస్.ఎస్. రాజమౌళి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 10, 2012న విడుదలై ఘన విజయాన్ని సాధించింది. భిన్నమైన ప్రేమ కథ, లోతైన భావోద్వేగాలతో ప్రేక్షకుల మనసులో నిలిచిపోయేలా ఈ సినిమా అద్భుతంగా తెరకెక్కించారు దర్శకుడు హను రాఘవపూడి. రధన్ మ్యూజిక్ ఎవర్ గ్రీన్ గా నిలిచింది. ఇందులో పాటలన్నీ సూపర్ హిట్‌గా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాకు కల్ట్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడీ మ్యాజిక్ మళ్లీ బిగ్ స్క్రీన్‌పై ఎక్స్‌పీరియన్స్ చేయడానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## 'చౌకీదార్' నుంచి సాంగ్

డైలాగ్ కింగ్ సాయి కుమార్ ప్రస్తుతం ఏ చిత్రంలో నటిస్తే ఆ చిత్రం బ్లాక్ బస్టర్ అవుతున్న సంగతి తెలిసిందే. గత ఏడాది ఆయన నటించిన సినిమాలన్నీ కూడా బ్లాక్ బస్టర్ హిట్లుగా నిలిచాయి. ఇక ఆయన నటించిన కమిటీ కుర్రోళ్లు, లక్కీ భాస్కర్, సరిపోదా శనివారం, మెర్సీ కిల్లింగ్ వంటి చిత్రాలకు గద్దర్ అవార్డులు కూడా వచ్చిన సంగతి తెలిసిందే. అలాంటి సాయి కుమార్ ప్రస్తుతం తెలుగు, కన్నడ భాషల్లో చౌకీదార్ అనే సినిమాను చేస్తున్నారు.

ఈ చిత్రంలో పృథ్వీ అంబర్, ధన్యా రమ్యకుమార్ జంటగా నటిస్తున్నారు. చౌకీదార్ మూవీని వీఎస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద డా.కల్లహల్లి చంద్ర శేఖర్ నిర్మిస్తుండగా, చంద్రశేఖర్ బండియప్ప తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈచిత్రానికి సంబంధించిన ఓ ఎమోషనల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. నాన్న గొప్పదనం చాటి చెప్పేలా గుండెను పిండేసేలా ఓ చక్కటి బాణీని అందిం చారు. నాన్నా అంటూ సాగే ఈ పాటను సంతోష్ వెంకీ రచించగా, విజయ్ ప్రకాష్ ఆలపించారు. సచిన్‌బస్రూర్ అందించిన బాణీ అయితే ప్రతీ ఒక్కరినీ కదిలించేలా ఉంది. తండ్రి త్యాగాల్ని, మోసే బాధ్యతల్ని, చూపించే ప్రేమను చాటేలా పాటను రచించారు. ఇక లిరికల్ వీడియో చూస్తుంటే సాయి కుమార్ తండ్రిగా మరోసారి ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉన్నారు. పృథ్వీ అంబర్, సాయి కుమార్ మధ్య మంచి ఎమోషనల్ సీన్స్ ఉండేట్టుగా కనిపిస్తోంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదీని ప్రకటించనున్నారు.





శ్రీనిధి శెట్టి నయా లుక్

## 13న 'కట్టప్ప జడ్జిమెంట్' విడుదల

అపోలో ప్రొడక్షన్స్ పతాకంపై రావూరి వెంకట స్వామి నిర్మాతగా బాహుబలి కట్టప్ప సత్యరాజ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం కట్టప్ప జడ్జిమెంట్. తీర్పుగల్ విర్కపడుమ్ తమిళ చిత్రాన్ని తెలుగులో కట్టప్ప జడ్జిమెంట్ పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు నిర్మాత వెంకట స్వామి. బాహుబలి కట్టప్ప అంటే తెలుగులో తెలియని ప్రేక్షకులు వుండరు. అంతలాఎడతెగని అనుబంధం ఉంది తెలుగులో సత్యరాజ్ గారికి. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం యు/ఏ సర్టిఫికెట్ అందుకుంది. జూన్ 13న తెలుగులో విడుదల చేయడానికి నిర్మాత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యర్థి పాత్రలో మధు సూదనరావు అద్భుతంగా నటించారు. పూర్తి మాస్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అనడంలో సందేహం లేదు. కట్టప్ప ఏ విషయంలో ఎలాంటి జడ్జిమెంట్ ఇచ్చాడో వెండితెరపై చూసి తెలుసుకోండి. ఈ చిత్రానికి ధీరన్ దర్శకత్వం వహించారు. మరియు స్మృతి వెంకట్, సత్యరాజ్, హరీష్ ఉత్తమన్ మరియు మధుసూధన్ రావు, రవిప్రసాద్ ప్రధాన పాత్రలు పోషించారు.



## 90స్‌లో నగ్మా యూత్ కలల రాకుమారి

90స్‌లో యూత్ కలల రాకుమారి. 1994లో విడుదలైన తమిళ చిత్రం కాదలన్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో కట్టిపడేసింది. తెలుగు, తమిలం, మలయాళం, హిందీ భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. ఇంతకీ హీరోయిన్ నగ్మా గుర్తుందా..?



ఒకప్పుడు సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్. 1994లో విడుదలైన కాదలన్ అనే తమిళ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో అనేక హిట్ చిత్రాల్లో నటించింది. సూపర్ స్టా రజినీకాంత్ జోడిగా బాషా చిత్రంతో సూపర్ హిట్ అందుకుంది. అలాగే తెలుగులో మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ వంటి స్టార్ హీరోలతో కలిసి నటించింది. సినీరంగంలో నగ్మా చెల్లెల్లు సైతం హీరోయిన్లుగా రాణించారు. నగ్మా చెల్లెల్లు మరెవరో కాదు.. జ్యోతిక, రోషిణి. దశాబ్దాలపాటు సినీరంగంలో వరుస సినిమాలతో అలరించిన నగ్మా.. 2008 నుంచి సినిమాలకు దూరంగా ఉండిపోయారు. చాలా కాలం తర్వాత నగ్మా ఫోటోస్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ఇదిలా ఉంటే.. ఇటీవలే సూర్య, జ్యోతిక దంపతుల కుమార్తె దియా ఇంటర్ పూర్తి చేసింది. తాజాగా ఆమె గ్రాడ్యుయేషన్ వేడుకలకు సంబంధించిన ఫోటోస్ షేర్ చేస్తూ తల్లిదండ్రులుగా తాము గర్వపడుతున్నామంటూ రాసుకొచ్చింది జ్యోతిక. అయితే ఈ కార్యక్రమంలో నటి నగ్మా కూడా పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోస్ తన ఇన్ స్టాలో షేర్ చేసింది నగ్మా. అందులో ఆమె గుర్తుపట్టలేనంతగా మారి పోయింది.

## ఎస్ఎల్‌వి సినిమాస్ గ్రాండ్ లాంచ్

ఎలక్ట్రిక్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎఫర్ట్ లెస్ యాక్టింగ్, అద్భుతమైన కామిక్ టైమింగ్‌తో అలరించే మాస్ మహారాజా రవితేజ, ఫ్యామిలీ ఎంటర్టైనర్ల మాస్టర్, దర్శకుడు కిషోర్ తిరుమలతో కలిసి ఆర్‌టి76 ప్రాజెక్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. క్యాలిటీ, హై ఎంటర్ టైన్మెంట్ వాల్యూస్‌తో సినిమాలని అందించడంలో పాపులరైన ప్రతిష్టాత్మక ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రేజీ కాంబినేషన్‌లో రాబోయే ఈ చిత్రం ఈరోజు ముహూర్తపు వేడుకతో ఘనంగా ప్రారంభమైంది. దర్శకుడు కిషోర్ తిరుమల, రవితేజ సిగ్నేచర్ స్టయిల్, కామెడీతో కూడిన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌ని రాశారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఈ కథలో రవితేజ తనదైన ఎనర్జీతో అలరించనున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రవితేజ వెరీ స్టైలిష్ అవతార్‌లో, డిజైనర్ సూట్ ధరించి కనిపిస్తున్నారు. ఎయిర్ క్రాఫ్ట్ సీటులో హాయిగా కూర్చున్న అతను, ముందు సీటుపై ఒక కాలు క్యాజువల్‌గా ఆనించి, ఒక చేతిలో వైన్ బాటిల్, మరో చేతిలో పుస్తకంతో కనిపించడం అదిరిపోయింది. ఇది ఇప్పటివరకు రవితేజ మోస్ట్ స్టైలిష్ లుక్‌ను సూచిస్తుంది. అతను పట్టుకున్న పుస్తకంలో సీ ఇట్ అండ్ సే ఇట్ స్పానిష్‌లో ఉంది, ఇది అతని పాత్రపై ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. బ్లాక్‌బస్టర్ ధమాకా కోసం చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను అందించిన తర్వాత భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి రవితేజతో మళ్ళీ వర్క్ చేస్తున్నారు. ప్రసాద్ మూరెళ్ల డీవోపీగా పని చేస్తున్నారు. అవార్డ్ విన్నింగ్ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ చేస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్. ఆర్‌టి76 రెగ్యులర్ షూటింగ్ జూన్ 16 నుండి హైదరాబాద్‌లో ప్రారంభమవుతుంది. ఈ చిత్రం 2026 సంక్రాంతికి థియేటర్లలో రిలీజ్ కానుంది. తారాగణం: రవితేజ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కిషోర్ తిరుమల, నిర్మాత: సుధాకర్ చెరుకూరి, బ్యానర్:ఎస్ఎల్‌వి సినిమాస్ డీవోపీ: ప్రసాద్ మూరెళ్ల సంగీతం: భీమ్స్ సిసిరోలియో ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్ ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విజయ్ కుమార్ చాగంటి.



## మైసూర్ శాండల్‌కు ప్రచారకర్తగా తమన్నా భాటియా

బుద్ధి చిన్నది అయితే అన్నీ వివాదాలుగానే ఉంటాయి. కర్ణాటకలో జరుగుతున్న మైసూర్ శాండల్ సబ్బు ప్రచారకర్త నియామకం విషయంలో అదే జరుగుతోంది. మైసూర్ శాండల్ సబ్బును తయారు చేసే కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జంట్స్ కంపెనీ తమ ఉత్పత్తుల ప్రచార కర్తగా తమన్నా భాటియాను నియమించుకుంది. రెండేళ్లకు ఆరు కోట్ల రూపాయుల చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే మన సబ్బుకుతమన్నా ఎందుకని కన్నడ నటీమణులు లేరా అని అక్కడి కన్నడ ఉద్యమ సంఘాలు తమ పని ప్రారంభించాయి. మైసూర్ సబ్బును మైసూర్ లోనో.. కర్ణా టకలోనే అమ్మడం లేదని.. దేశ వ్యాప్తంగా అమ్ముతున్నామని.. దేశవ్యాప్త మార్కెట్ కోసం అందర్నీ పరిశీలించిన తర్వాతనే తమన్నాను ఎంపిక చేసుకున్నామని ఆ సంస్థ చెబుతోంది. దీపికా పదుకొనే, రష్మికను కూడా పరిశీలిం చామని.. కానీ అన్ని అంశాలను చూసిన తరవాత తమన్నానే ఎంపిక చేసుకున్నామన్నారు. తమన్నాకు నేషనల్ వైడ్ పాపు లారిటీ ఉంది. సోషల్ మీడియాలో మిలి యన్ల కొద్దీ ఫాలోయర్లున్నారు. కేఎస్డీఎల్ అనేది ప్రభుత్వ సంస్థ. అందుకే ఇది మరింత వివాదాస్పదం చేస్తున్నారు. మరో మూడేళ్లలో మైసూర్ శాండల్ సోప్ మార్కెట్‌ను ఐదు వేల కోట్ల రూపాయలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అది నార్త్‌లో మార్కెట్ పెంచు కుంటేనే సాధ్యమవుతుందని అనుకుంటున్నారు. కానీ అక్కడ కన్నడ సంఘాలు మాత్రం.. మా సబ్బు.. మా నటి అని వితండవాదం చేస్తున్నారు.



## నభా నటేష్ ఎమోషనల్ పోస్ట్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెట్టును కౌగిలించుకున్న ఫొటోను షేర్ చేస్తూ ఎమోషనల్ పోస్ట్ చేసింది హీరోయిన్ నభా నటేష్. ఆమె ఇన్‌స్టా గ్రామ్ ద్వారా చేసిన ఈ పోస్ట్ నెటిజన్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ పోస్ట్‌తో నేచర్ గురించి నభా బ్యూటిఫుల్ మెసేజ్ ఇచ్చిందంటూ నెటిజన్స్ కామెంట్స్ రాస్తున్నారు. తన సోషల్ మీడియా పోస్ట్‌లో నభా స్పందిస్తూ ఈ రోజు ఒక చెట్టును కౌగిలించుకున్నాను...ఆ చెట్టు కూడా నన్ను తిరిగి కౌగిలించుకుందనే భావన కలిగింది. ఎంతో అందమైన ఈ ప్రపంచాన్ని చూసేందుకు వచ్చిన అతిథులం మనం. ఇక్కడ ప్రకృతి మనకెన్నో గొప్ప అనుభవాలు ఇస్తోంది. ఈ ప్రకృతి ని, పర్యావరణాన్ని అనుభూతి చెందడం మాత్రమే మనకున్న హక్కు. ఈ సంతోషాలు ఇచ్చిన నేచర్‌కి రుణ పడి ఉంటాను. అని పేర్కొంది. ప్రస్తుతం పలు ఇంట్రెస్టింగ్ మూవీస్‌లో నటిస్తోంది నభా నటేష్. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభుతో పాటు మరో ప్రెస్టీజియస్ మూవీ నాగబంధంలో నటిస్తోంది.





# టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్ కెప్టెన్‌గా పాట్ కమిన్స్

## భారత్ నుంచి యశస్వి, బుమ్రాలకు చోటు

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 ఫైనల్ మ్యాచ్ ఈ నెల 11 నుండి 15వ తేదీ వరకు లండన్‌లోని లార్డ్స్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌తో డబ్ల్యూటీసీ మూడో సైకిల్ ముగుస్తుంది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు టెస్టు ఛాంపియన్ షిప్ కోసంపోటీపడనున్నాయి. ఈనేపథ్యంలో క్రికెట్ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ 20 23 -25 టీమ్ ఆఫ్‌ది టోర్నమెంట్‌ను ప్రకటించింది. మూడో సైకిల్‌లో రాణించినఆటగాళ్లతో కూడిన ఎలెవన్‌ను ప్రకటించింది. ఈ జట్టును ప్రక టించేందుకు కేవలం ఆటగాళ్ల గణాంకాల పైన మాత్రమే ఆధారపడలేదు. వివిధ పరిస్థితుల్లో ఆటగాళ్ల చూపిన ప్రదర్శన ఆధారంగా జట్టును ఎంపిక చేసినట్లు తెలిపింది. ఈ జట్టులో భారత్ కు చెందిన ఇద్దరు ఆటగాళ్ల చోటు దక్కించుకున్నారు. ఇందులో ఒకరు యువఆటగాడు యశస్వి జైస్వాల్ కాగా, రెండోఆటగాడు బుమ్రాకావడం విశేషం. డబ్ల్యూటీసీ మూడోసైకిల్‌లో జైస్వాల్ 19 టెస్టులు ఆడి 1798 పరుగులు చేశాడు. ఇందులో 4శతకాలు, 10 అర్ధశతకాలు ఉన్నాయి. మరోవైపు బుమ్రా 15 టెస్టులు ఆడి 77వికెట్లు తీశాడు. బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో 32 వికెట్లు పడ గొట్టాడు. ఆస్ట్రేలియాకు చెందిన పాట్‌కమిన్స్ కెప్టెన్‌గా ఎంపిక అయ్యాడు. ఆసీస్‌కే చెందిన ఉస్మాన్ ఖవాజా, అలెక్స్ కేరీలు కూడాజట్టులో చోటుదక్కించుకున్నారు. న్యూజి లాండ్ నుంచి కేన్ విలియమ్సన్, మాట్ హెన్రీలు చోటు దక్కించుకోగా ఇంగ్లాండ్ నుంచి జోరూట్, హ్యారీ బ్రూక్‌లు అవకాశం దక్కించుకున్నారు. శ్రీలంక నుంచి కమిందు మెండిస్,పాకిస్థాన్ నుంచి నోమన్ అలీలు జట్టులో చోటు దక్కించుకున్నారు. క్రికెట్ ఆస్ట్రేలియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ 2023-25 టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్ జట్టులో పాట్ కమిన్స్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, ఉస్మాన్ ఖవాజా, కేన్ విలియమ్సన్, జో రూట్, హ్యారీ బ్రూక్, కమిందు మెండిస్, అలెక్స్ కారీ (వికెట్ కీపర్), జస్ప్రీత్ బుమ్రా, మాట్ హెన్రీ, నోమన్ అలీ, కగిసో రబాడను 12వ ఆటగాడిగా తీసుకుంది.




### ఆర్చరీ మహిళల ప్రపంచ కప్‌లో..

# క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్ టీమ్

## రికర్వ్ ఈవెంట్‌లో మిశ్రమ ఫలితాలు

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 3 లో మధుర ధమన్ గోంకర్ తన అద్భుతమైన పరుగును కొనసాగించింది, కాంపౌండ్ మహిళల అర్హత రౌండ్‌లో నాల్గవ స్థానంలో నిలిచింది, గురువారం జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించడంతో భారత్ మూడవ సీడింగ్‌ను సాధించడానికి మరియు క్వార్టర్ ఫైనల్స్‌కు నేరుగా ప్రవేశించడానికి సహాయపడింది. మూడేళ్ల తర్వాత గత నెలలో అంతర్జాతీయ సర్క్యూట్‌లోకి అద్భుతంగా పునరాగమనం చేసిన మధుర, షాంఘై స్టేజ్ 2లో అభిషేక్ వర్మతో కలిసి వ్యక్తిగత స్వర్ణం, మహిళల టీమ్ ఈవెంట్‌లో రజతం మరియు మిక్స్‌డ్ టీమ్ కాంస్యంతో మూడు పతకాలను గెలుచుకుంది. అంటాల్యాలో, ఆమె దక్షిణ కొరియాకు చెందిన హాన్ సెంగ్యోన్ (603) కంటే కేవలం మూడు పాయింట్లు వెనుకబడి ఉంది. ఆమె టాప్‌ఫోర్ ఫినిషింగ్‌తో, మధుర వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్ యొక్క రెండవ రౌండ్‌లో కూడా బై పొందింది. పోటీలో ఉన్న ఇతర భారతీయ మహిళలలో, చికిత్స తనిపర్తి 11వ స్థానంలో నిలిచి తర్వాతి స్థానంలో నిలిచింది, అయితే బహుళ ప్రపంచ కప్ బంగారు పతక విజేత జ్యోతి సురేఖ వెన్నం స్వల్ప ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో 19వ స్థానంలో నిలిచింది. ఇక పురుషుల కాంపౌండ్ విభాగంలో, భారత్ జట్టు ఈవెంట్‌లో ఐదవ స్థానాన్ని దక్కించుకుంది. వ్యక్తిగత అర్హతలో రిషబ్ యాదవ్ భారత త్రయంలో అత్యుత్తమంగా 13వ స్థానంలో నిలిచాడు, అనుభవజ్ఞుడైన అభిషేక్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ ఓజాస్ డియోటలే వరుసగా 29వ మరియు 34వ స్థానాల్లో నిలిచారు. కాగా భారత్‌కు రికర్వ్ ఈవెంట్‌లు మిశ్రమ ఫలితాలను వచ్చాయి. పురుషుల అర్హత రౌండ్‌లో ధీరజ్ బొమ్మదేవర 13వ స్థానంలో, అతాను దాస్ 15వ స్థానంలో, గత ప్రపంచ కప్ దశలో కాంస్యం గెలిచిన పార్థ్ సలుంఖే 26వ స్థానంలో నిలిచారు, జట్టు ఐదవ ర్యాంకింగ్‌తో ముగిసింది. అయితే భారత మహిళల రికర్వ్ ఆర్చర్లు ఇబ్బంది పడ్డారు. మాజీ ప్రపంచ నంబర్ 1 దీపికా కుమారి 35వ స్థానంలో నిలవగా, అంకితా భకత్ (33వ) అత్యుత్తమ స్థానంలో నిలిచింది. సిమ్రంజీత్ కౌర్ 54వ స్థానంలో నిలిచారు, మహిళల జట్టు 12వ స్థానంలో నిలిచింది.

### చరిత్ర సృష్టించిన

# జకోవిచ్

## వరల్డ్ మూడో ర్యాంకర్‌పై గెలుపు

**న్యూఢిల్లీ:** సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్ 2025 టోర్నీలో సెమీఫైనల్ చేరి ఈ ఘనత సాధించిన అతి పెద్ద వయస్కుడిగా నిలిచాడు. పురుషుల క్వార్టర్ ఫైనల్లో 38 ఏళ్ల వయసున్న నొవాక్ జకోవిచ్ 4-6, 6-3, 6-2, 6-4తో ప్రపంచ మూడో ర్యాంకర్



అయిన అలెగ్జాండర్ జ్వెరెవ్(జర్మనీ)ని ఓడించాడు. ఈ విజయంతో జకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో 100 విజయాలు పూర్తి చేసుకున్నాడు. రఫెల్ నాదల్ తర్వాత ఆ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా జకోవిచ్ నిలిచాడు. అంతేకాకుండా జకోవిచ్‌కు ఇది 51వ గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్. ఇది ఒక కొత్త రికార్డు. మూడు గంటల పాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో జకోవిచ్ ఆరంభంలో ఇబ్బంది పడ్డాడు. తొలి సెట్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన జ్వెరెవ్ 6 4తో సొంతం చేసుకున్నాడు. మొదటి సెట్ కోల్పోయిన తర్వాత జకోవిచ్ తన ఆటను మెరుగుపర్చుకున్నాడు. అద్భుతమైన డ్రాప్ షాట్స్, బలమైన డిఫెన్స్‌తో జ్వెరెవ్‌ను ఇబ్బంది పెట్టాడు. జకోవిచ్ తన అనుభవాన్ని ఉపయోగించి మ్యాచ్‌పై పట్టు సాధించాడు. కీలక సమయాల్లో బ్రేక్ పాయింట్లను మార్చుకోవడంలో విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో జకోవిచ్ 6 ఏఎస్‌లతో పాటు 42 విన్నర్లు కొట్టాడు. 29 తప్పిదాలు చేసిన అతడు 35 డ్రాప్ షాట్స్ ఆడి 121 పాయింట్స్ సొంతం చేసుకున్నాడు. మరోవైపు జ్వెరెవ్ 4 ఏస్‌లు, 38 విన్నర్స్ కొట్టాడు. 44 అనవసర తప్పిదాలు చేసిన జ్వెరెవ్ 12 డ్రాప్ షాట్స్ మాత్రమే ఆడి 101 పాయింట్స్ సాధించాడు.




### ఇండోనేసియా ఓపెన్‌లో..

# సింధు, ట్రీసా-గాయత్రీ ఔట్

**న్యూఢిల్లీ:** ఇండోనేషియా ఓపెన్-2025 టోర్నమెంట్ నుండి భారత క్రీడాకారిణి పివి సింధు వైదొలగింది. గురువారం జరిగిన రౌండ్ ఆఫ్ 16లో థాయిలాండ్‌కు చెందిన పోర్న్‌పావీ చోచువాంగ్ చేతిలో ఓడిపోవడంతో సింధు ఇండోనేషియా ఓపెన్ 2025 నుండి నిష్క్రమించక తప్పలేదు. ఈ టోర్నీమెంట్‌లో సింధు ఉత్సాహంగా ఆరంభించి, 10-16తో వెనుకబడినప్పటి నుండి కోలుకుని తొలి గేమ్‌ను కైవసం చేసుకుంది. అయితే, చోచువాంగ్ రెండవ గేమ్‌లో ధీటుగా స్పందించి, 21-10తో ఆధిక్యాన్ని ముగించే ముందు 10 పాయింట్ల ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

నిర్ణయాత్మక జట్టు చాలా వరకు హోరాహోరీగా సాగింది, కానీ చివరి దశలో చోచువాంగ్ ఆడి మ్యాచ్‌ను 21-18తో ముగించింది. ఇక మహిళల డబుల్స్ ద్వయం ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ 16వ రౌండ్ దశలో జపాన్‌కు చెందిన యుకీ ఫుకుషిమా మరియు మయు మట్సుమోటో చేతిలో 13-21, 22-24 తేడాతో ఓడిపోయారు.

### వాలీబాల్ నేషన్స్ లీగ్‌లో

# ఛాంపియన్‌గా ఇరాన్

## 3-0తో భారత్ క్లీన్ స్వీప్



**న్యూఢిల్లీ:** పురుషుల నేషన్స్ లీగ్-2025 టోర్నీ ఫైనల్లో ఇరాన్ ఛాంపియన్‌గా నిలిచింది. ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన ఫైనల్‌లో టాప్ సీడ్ ఇరాన్‌వరుస గేమ్‌లతో విజయం సాధించి భారత్‌ను క్వీన్ స్వీప్ చేసింది. దీంతో భారత్ 0-3 తేడాతో ఓటమి పాలైంది. ఉజ్బెకిస్తాన్‌లోని ఫెర్గానాలో జరిగిన సిఎవిఎ నేషన్స్ లీగ్ ఫైనల్‌లో భారత పురుషుల వాలీబాల్ జట్టు ప్రచారం ముగిసింది. చాలా ఉన్నత ర్యాంక్‌లో ఉన్న ఇరానియన్ జట్టు చేతిలో ఓడిపోయింది. ప్రపంచ 15వ ర్యాంక్‌లో ఉన్న టాప్ సీడ్ ఇరానియన్ జట్టు, రెండేళ్ల తర్వాత అంతర్జాతీయ ఈవెంట్‌లో ఆడుతున్న అనుభవం లేని భారత జట్టుపై 25 -17, 25-20, 25-19 సునాయాసంగా విజయం సాధించింది. కాగా గ్రూప్ దశలో భారత్ ఇరాన్‌పై విజయం సాధించింది. కానీ ఈసారి ఆసియాలో రెండవ అత్యుత్తమ జట్టుకు పెద్దగా సవాలు విసరలేకపోయింది, నెట్‌లో వారి అనేక డిఫెన్సివ్ బ్లాక్‌లను పూర్తి చేయడంలో విఫలమైంది. అన్‌సీడెడ్ జట్టు అయినప్పటికీ, భారతదేశం తన తొలి ప్రచారాన్ని పూర్తిగా ఉపయోగించుకుంది. రెండవ దశలో పాకిస్తాన్ మరియు కజకిస్తాన్‌పై గట్టి విజయాలు సాధించడంతో సహా వరుసగా నాలుగు విజయాలతో ఫైనల్‌కు చేరుకుంది. సీనియర్ పోటీలు ముగియడంతో, అందరి దృష్టి ఇప్పుడు సిఎవిఎ అండర్ 16 బాలుర వాలీబాల్ ఛాంపియన్ షిప్ మరియు యు19 పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్ వైపు మళ్లుతుంది. ఈ రెండూ జూన్ 10న తాష్కెంట్‌లో ప్రారంభమవుతాయి. అండర్ 16 ఈవెంట్‌లో ఆరు జట్లు పాల్గొంటాయి. కజకిస్తాన్, పాకిస్తాన్, ఇరాన్, కిర్గిజ్స్తాన్, అండర్ 19 పోటీలో భారత్, ఇరాన్, కిర్గిజ్స్తాన్ పాల్గొంటాయి.

# వాణిజ్యం

# బ్రిటానియా ఫ్యాక్టరీ మూసివేత, కారణాలు

**ముంబై, జూన్ 5:** బ్రిటానియా ఇండస్ట్రీస్. ఇది దాదాపు 132 సంవత్సరాలుగా భారతదేశంలోని ప్రతి ఇంట్లో తెలిసిన పేరు. బిస్కెట్ల వంటి అత్యంత ప్రాథమిక ఆహార పదార్థాల ఉత్పత్తిలో భారత దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడమే కాకుండా, దేశంలోని మొట్టమొదటి ఎఫ్ఎంసిజి కంపెనీలలో ఇది ఒకటి. కానీ



నేడు భారతదేశం నుండి పెద్ద మొత్తంలో బిస్కెట్లు కూడా ఎగుమతి అవుతున్నాయి. ఇప్పుడు బ్రిటానియాఇండస్ట్రీస్ దాని పురాతన కర్మాగారాలలో ఒక దాన్ని మూసివేయబోతోంది. దీనికి దేశ స్వాతంత్రంతో సంబంధం కూడా ఉంది. ముంబై హైకోర్టు నిర్ణయాన్ని కొట్టి వేస్తూ సుప్రీం కోర్టు, మూడు దశాబ్దాలకు పైగా బిస్కెట్లు తయారు చేసిన బ్రిటానియా ఇండస్ట్రీస్ లిమిటెడ్ (బిఐఎల్) కంపెనీని మూసి వేయడానికి అనుమతి ఇచ్చింది. ఫిబ్రవరి 17, 2023 నాటి హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా హరినగర్ షుగర్ మిల్స్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎంఎల్) దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ సంజయ్ కరోల్ మరియు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఈ తీర్పు ఇచ్చారు. హెచ్ఎస్ఎంఎల్ గతంలో తన ఉద్యోగులకు రూ.10 కోట్లు గుడ్‌విల్‌గా ఇవ్వడానికి ముందుకొచ్చింది. కానీ కోర్టు ఈమొత్తాన్ని రూ.15కోట్లకు పెంచింది. ఎనిమిది వారాల్లోపు చెల్లించాలని కూడా కోరింది. ఈ కంపెనీని మూసి వేయడం వల్ల కొంతమంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయే అవకాశం ఉందని, మరికొందరు ఎటువంటి తప్పు లేకుండా నిరుద్యోగులుగా మారే అవకాశంఉందని పరిగణనలోకి తీసుకుని హెచ్ఎస్ఎంఎల్ తీసుకున్న ఈ చర్యను మేము అభినందిస్తున్నాము. అలాంటి ప్రకటనలు రికార్డులో నమోదు చేసినట్లు కోర్టు పేర్కొంది. హెచ్ఎస్ఎంఎల్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి, గుడ్‌విల్ మొత్తాన్ని పెంచడంపై నిర్ణయం తీసుకునే బాధ్యతను కోర్టుకే వదిలేశారు. అప్పీలుదారుల ఆఫర్‌ను రూ.5 కోట్లు పెంచడం న్యాయమైనదని తాము భావిస్తున్నామని తెలిపింది. అందువల్ల, మా ఆర్డర్‌లో ఆ మొత్తం రూ.10 కోట్లకు బదులుగా రూ.15 కోట్లు అవుతుంది. మొత్తాన్ని విడుదల చేయడానికి ఎనిమిది వారాల కంటే ఎక్కువ సమయం పట్టకూడదని సూచించింది.

# ఆర్‌బిఐ రేట్ల కోత అంచనాలతో సూచీల్లో లాభాలు

**ముంబై, జూన్ 5:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందన్న అంచనాలతో సూచీలు రాణించాయి. ఐటీ, ఫార్మా షేర్లలో కొనుగోళ్లు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోలుదారులుగా నిలవడం సూచీలకు కలిసొచ్చింది. దీంతో సెన్సెక్స్ ఇంట్రాడేలో 800 పాయింట్లు మేర రాణించింది. సెన్సెక్స్ ఉదయం 81,196.08 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లతో రాణించిన సూచీ ఇంట్రాడేలో 81,911.13



వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 443 పాయింట్ల లాభంతో 81,442 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,899 వద్ద గరిష్ఠాన్ని తాకిన నిఫ్టీ చివరకు 130 పాయింట్ల లాభంతో 24,750 వద్ద ముగిసింది. ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా, ఐటీసీ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. ఇండస్ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.10 డాలర్ల వద్ద ట్రేడగగా, బంగారం ఔన్సు 3,413 డాలర్ల వద్ద కొనసాగింది.

# పన్నుల చెల్లింపుల్లో అదానీ రికార్డు

**ముంబై, జూన్ 5:** దేశీయ పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ రికార్డు సృష్టించింది. లిస్టెడ్ సంస్థల పోర్ట్‌ఫోలియో ద్వారా 2025 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 74,945 కోట్ల రూపాయల పన్నులను చెల్లించింది. ఇది గత ఆర్థిక సంవత్సరం 2023 24తో పోల్చుకుంటే 29 శాతం అధికం. ఆ ఆర్థిక సంవత్సరంలో అదానీ గ్రూప్ మొత్తం 58,104 కోట్ల రూపాయల మేర పన్నులు చెల్లించగా, ఇప్పుడీ మొత్తం 74,945 కోట్ల రూపాయలకు చేరింది. ఈ మొత్తం దేశంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి పర్చడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో అదానీ గ్రూప్ ఏ స్థాయి లో భాగస్వామ్యం వహిస్తోందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ 74,945 కోట్ల రూపాయల్లో ప్రత్యక్ష పన్నుల వాటా 28,720 కోట్ల రూపాయలు. పరోక్ష పన్నుల వాటా 45,407 కోట్ల రూపాయలు. ఇతరత్ర పన్నుల మొత్తం 818 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి. పన్నుల చెల్లింపులో రికార్డు సృష్టించిన అదానీ కోట్లాది మంది ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తుంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మెట్రో నెట్‌వర్క్‌ను నిర్మించడానికి అవసరం అయ్యే ఖర్చుతో దాదాపుగా ఇది సమానం. ఆధునిక ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి కూడా ఈ మొత్తం దాదాపు సరిపోతుంది. అలాగే కోట్లాది మంది ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో జీవనాడిగా నిలుస్తుందని అదాని గ్రూప్ ఓ ప్రకటనలో వెల్లడించింది. అదానీ గ్రూప్ పబ్లిక్ లిస్టెడ్ సంస్థల్లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, అదానీ సిమెంట్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్.. ఈ పన్నుల చెల్లింపుల్లో కీలకంగా మారాయి. పన్నుల రూపేణా వేల కోట్ల రూపాయల మేర నిధులను ప్రభుత్వ ఖజానాకు సమకూర్చాయి. పన్నుల చెల్లింపుల ద్వారానే దేశంలో మౌలిక సదుపాయాలు అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్, అదానీ పవర్ లిమిటెడ్, అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్, అంబుజా సిమెంట్స్‌తో పాటు ఎన్డీటీవీ, ఏసీసీ, సంఘీ ఇండస్ట్రీస్ కూడా పన్నులు చెల్లించిన లిస్టెడ్ సంస్థల జాబితాలో ఉన్నాయి. ఈ గ్రూప్.. తన ఏడు సంస్థల వెబ్‌సైట్లలో బేసిస్ ఆఫ్ ప్రిపరేషన్ అండ్ అప్రోచ్ టు ట్యాక్స్ అనే పేరుతో ఓ డాక్యుమెంట్‌ను అందుబాటులో ఉంచింది. పన్నుల చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇందులో పొందుపరిచింది. ప్రపంచవ్యాప్తంగా పోర్ట్‌ఫోలియో కంపెనీలు కొనసాగించే వ్యాపార, వాణిజ్య లావాదేవీల ద్వారా వచ్చే పన్నులు, సుంకాలు, ఇతర ఛార్జీలను ప్రత్యక్ష పన్నుల జాబితాలో చేర్చిందీ సంస్థ. ఇతర స్టేక్ హోల్డర్ల నుంచి సేకరించిన పోర్ట్‌ఫోలియో కంపెనీలకు సంబంధించిన మొత్తం చెల్లింపులను ఇండైరెక్ట్ ట్యాక్సుల్లో కలిపింది. అదానీ గ్రూప్ పన్ను పార



దర్శకతను సంస్థ కార్యకలాల్లో కీలకంగా పరిగణిస్తోంది. పన్నుల చెల్లింపుల ద్వారానే దేశంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని భావిస్తోన్నామని పేర్కొంది. సకాలంలో పన్నుల చెల్లింపు తమ సంస్థ పారదర్శకత, దేశ సమగ్రాభివృద్ధిలో చిత్తశుద్ధికి అద్దం పడుతోందని వెల్లడించింది.

# ఎఐతో ఉద్యోగాలు పోవడం కంటే అదే డేంజర్: డీప్ మైండ్ సిఇఒ

**వాషింగ్టన్, జూన్ 5:** కృత్రిమ మేధ (ఎఐ) ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. టెక్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తోంది. దీని రాకతో ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. సర్వం ఎఐ మయమవుతుందన్న వాదనలు వినిపిస్తున్న వేళ ఈ సాంకేతికతపై గూగుల్ డీప్‌మైండ్ సిఇఒ డెమిస్ హస్సాబిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవడం కంటే దాని దుర్వినియోగమే అత్యంత ప్రమాదకరమని అన్నారు. కృత్రిమ మేధ దుర్వినియోగంపై డెమిస్ ఆందోళన వ్యక్తం చేశారు. మనుషుల ఉద్యోగాలను ఎఐ భర్తీ చేస్తుందనే విషయం తనకు ఆందోళన కలిగించడం లేదని ఆ సాంకేతికత చెడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తేనే అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఒకవేళ అలా జరిగితే వినాశకర పరిమాణాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వ్యక్తులకు వీటి యాక్సెస్‌ను పరిమితం చేయాలని సూచించారు. అయితే ఈ శక్తివంతమైన సాంకేతికతను ఉపయోగించి అద్భుతమైన పనుల్ని సజావుగా నిర్వహించవచ్చని తెలిపారు. ఎఐ వల్ల ఎంట్రీ లెవల్ వైట్-కాలర్ ఉద్యోగాలు తగ్గుముఖం పడతాయని డెమిస్ అన్నారు. సాధారణ పన్నుల్ని ఎఐ చేయడంతో మానవులు మరింత ముఖ్యమైన పనులపై దృష్టిపెట్టగలరని తెలిపారు. అప్పుడు మరింత నైపుణ్యంతో కూడిన ఉద్యోగావకాశాలు వస్తాన్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ఎఐ శక్తి, వినియోగం పెరిగేకొద్దీ దాని దుర్వినియోగాన్ని ఆపేందుకు ప్రపంచవ్యాప్తంగా సహకారం అవసరమన్నారు.



## మార్కెట్లో టాటా వర్సెస్ హ్యుండాయ్

**ముంబై, జూన్ 5:** టాటా మోటార్స్ తన ప్రీమియం హ్యాచ్ బ్యాక్ 2025 ఆల్ట్రోజ్ రిఫ్రెష్ చేసింది. ఈ ప్రీమియం కారు రూ.6.89లక్షల నుంచి రూ.11.49 లక్షల (ఎక్స్ షోరూమ్) ప్రారంభధరలతో అందుబాటులో ఉంది. ఈ అప్డేట్ ఆల్ట్రోజ్‌ను ఈ విభాగంలోని కీలక పోటీదారులైన హ్యుందాయ్ ఐ20, మారుతి బాలెనో మరియు టయోటా గ్లాంజాతో పోటీ పడేలా చేసింది. ధర, సెగ్మెంట్ ప్లేస్మెంట్ పోల్చదగినవి అయినప్పటికీ ఫేస్లిఫ్ట్ ఆల్టోజ్ ఆకర్షణను విస్తృతం చేయడంలో సహాయపడ టానికి మరిన్ని ఫీచర్లు, విస్తృత శ్రేణి పవర్ ట్రెయిన్ ఎంపికలను అందిస్తుంది. ఈ నేపథ్యంలో ఆల్ట్రోజ్ కారుకు హ్యుందాయ్ ఐ20తో కార్ల మధ్య ప్రధాన తేడాలను చూద్దాం. 2025 ఆల్ట్రోజ్ లుక్‌లో మాత్రం పెద్దగా మార్పు లేదు. ఫ్లష్‌టైప్ డోర్ హ్యాండిల్స్ అవుటర్ లుక్‌కు ఆధునిక, అధునాతన రూపాన్ని ఇస్తున్నాయి. ఈ కారు వెనుక కనెక్ట్ చేసిన ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్‌ను ఆధునిక టచ్‌ను అందిస్తాయి. ఈ కారు ఫ్రంట్ ఎండ్ లైటింగ్లో కూడా అప్ గ్రేడ్‌తో వస్తుంది. ఆటో



మేటిక్ ఎల్ఈడీ హెడ్‌లైట్‌లు, ఎల్ఈడీ ఫాగ్ లాంప్‌లు కార్నరింగ్ ఫంక్షన్‌తో ఆకట్టుకుంటుంది ఈ రెండు అప్‌గ్రేడ్‌లు ఫ్రంట్ ఎండ్ స్టైలింగ్‌ను మెరుగుపరుస్తాయి. ఆటోఫోల్డింగ్ అవుట్ సైడ్ మిర్రర్లు, 16 అంగుళాల డ్యూయల్ టోన్ అల్లాయ్ వీల్స్ కూడా వాహానానికి సంబంధించిన కర్బ్ సైడ్ ఆకర్షణకు సహాయపడతాయి. అందువల్ల ఆల్టోజ్ సెగ్మెంట్‌లోని మరింత విలాసవంతమైన హ్యాచ్‌బ్యాక్‌లతో పోటీపడడానికి ఉన్నత స్థాయి అనుభూతిని ఇస్తుంది. 2025 టాటా ఆల్టోజ్, హ్యుందాయ్ 20 ఫీచర్లలో దగ్గరగా సరిపోతాయి. అయితే కొన్ని కీలక అంశాలలో విభిన్నంగా ఉంటాయి. అవుటర్ వ్యూలో రెండూ ఎల్ఈడీ హెడ్‌లైట్లు, డీఆర్ఎల్‌లు, అల్లాయ్‌వీల్స్, ఆటో ఫోల్డింగ్ ఓఆర్‌వీఎంలతో వస్తాయి. ఆల్టోజ్ కార్నరింగ్, కనెక్టెడ్ టెయిల్ లైట్లు, ఫ్లష్‌టైప్‌డోర్ హ్యాండిల్స్ ఎల్ఈడీ ఫాగ్ ల్యాంప్లతో ఆకట్టుకుంటుంది. అయితే ఐ20లో పుడిల్ ల్యాంప్‌లతో ఆకట్టుకుంటున్నాయి. ఇంటీరియర్ విషయానికి వస్తే ఆల్టోజ్‌లో బ్లాక్‌బీజ్ థీమ్, ఫాబ్రిక్ అప్హోల్స్టరీ, మల్టీ కలర్ యాంబియంట్ లైటింగ్, టచ్‌బేస్డ్ ఏసీ ప్యానెల్‌తో కూల్డ్ గ్లోబ్బాక్స్‌లతో ఆకట్టుకుంటుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.